సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 361

శుక్రవారం 22-3-2024



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



పేరెంటింగ్ ప్రపంచంలో

కొత్త మంత్రం

ఇంట్లో టీనేజర్లు సృష్టించే యుద్ధ వాతావరణంలో ఎవరు గెలుస్తారో ప్రతి పేరెంట్‌కు తెలుసు కాబట్టి ఆర్ఎమ్ఎఫ్ మంత్రాన్ని మననం చేసుకోండి అంటున్నారు నిపుణులు. - IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
శుక్రవారం ॥ 22-3-2024

ఫ్యాషన్

ధరించే డ్రెస్‌ను బట్టి తమ స్టైల్, లుక్ ఎదుటివారికి తెలియాలని కోరుకుంటారు. క్యాజువల్ వేర్ అయినా పార్టీ వేర్ అయినా తమను ప్రత్యేకంగా గుర్తించాలని తపిస్తారు. ముందే పలకరిస్తున్న వేసవి తాపాన్ని తట్టుకుంటూ వేడుకలలోనూ రాయల్ లుక్‌తో మెరిసిపోవడానికి ఓవర్‌కోట్ బార్డర్ స్టైల్ తన స్పెషాలిటీని చాటుతోంది. రెడీ అవ్వడానికి తక్కువ టైమ్ పట్టడమే కాదు సౌకర్యంలోనూ సరైన ఛాయిస్ అనిపించకమానదు.

టైమ్ లెస్ కంఫర్ట్ ప్లస్





ఇండోవెస్ట్రన్ స్టైల్ డ్రెస్సింగ్ నవతరాన్ని అధికంగా ఆకర్షిస్తుంటుంది. అప్పట్లో ఓవర్ కోట్ అంటే మందంగా ఉండే డ్రెస్‌గా మాత్రమే చూసేవారు. ఇప్పుడు అదే స్టైల్‌లో పట్టు, కాటన్స్‌తో తయారు చేస్తున్నారు.

•••

ఎంచుకున్న మెటీరియల్‌ను బట్టి పైతానీ, గద్వాల్, ఇక్కత్ హ్యాండ్లూమ్ డిజైన్ గల బార్డర్స్ వచ్చేలా డిజైన్ చేస్తున్నారు. ఓవర్‌కోట్‌లా ఉండే టాప్స్, అదే రంగులో ఉండే బాటమ్ ప్యాంట్స్‌కి అంచును జత చేయడంతో ఈ డ్రెస్‌లో అమ్మాయిలు మరింత ప్రత్యేకంగా కనపడుతున్నారు.

•••

సిల్క్, క్రేప్ ప్లెయిన్ మెటీరియల్‌ను ఈ డ్రెస్ తయారీకి ఎంచుకున్నప్పుడు ప్రత్యేక హంగుగా హ్యాండ్ ఎంబ్రాయిడరీని ఉపయోగిస్తున్నారు.

•••

షరారా ప్యాంట్స్, టాప్స్, టై అండ్ డై మెటీరియల్ ఎంపిక కూడా ఈ డ్రెస్సింగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా అమరుతున్నాయి.

•••

బంగారు రంగులో ఉన్న వెడల్పాటి అంచులే కాదు, ఎంబ్రాయిడరీ చేసిన లేదా కాంట్రాస్ట్ బార్డర్స్ కూడా ఈ డ్రెస్ మోడల్స్‌ను స్పెషల్‌గా చూపుతున్నాయి.

•••

గాఢమైన రంగులు లేదా లేత రంగులు సందర్భానికి అనుగుణంగా డ్రెస్‌ను ఎంపిక చేసుకోవచ్చు. వీటికి ఫ్యాషన్ జ్యువెలరీ అదీ చాలా తక్కువగా ఉపయోగించవచ్చు. లేదా ఆభరణాల ఊసు లేకపోయినా నప్పే హెయిర్ స్టైల్‌తో ఆధునికంగా మెరిసిపోవచ్చు.

వంటిల్లు

వడగాలి వస్తోంది!

వడియాల కాలం వచ్చేసింది!!

మార్చి మూడు వంతులు గడిచింది.
ఆహారం ఎండబెట్టే కాలం వచ్చింది.
ఏడాదికి సరిపడా నిల్వ చేయాలి.
వానల్లో వెచ్చగా వేయించుకు తినాలి.
చలిలో కరకరలాడే రుచిని ఆస్వాదించాలి.
ఏప్రిల్ నెలకు ఎండ తీవ్రత పెరుగుతుంది.
వడగాలి వచ్చి దుమ్మెత్తి పోయకముందే...
వడియాలకు దినుసులు సిద్ధం చేద్దాం.
ఎండబెట్టమని సూర్యుడికి పని చెబుదాం.


బియ్యప్పిండి వడియాలు



కావలసినవి: బియ్యప్పిండి – ఒక గ్లాసు; సగ్గుబియ్యం – పావు కప్పు; ఎండుమిర్చి – 2; జీలకర్ర – టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● ఒక పాత్రలో బియ్యప్పిండి వేసి అందులో రెండు గ్లాసుల నీటిని పోసి ఉండలు లేకుండా కలిపి పక్కన ఉంచాలి. ● ఒక పాత్రలో సగ్గుబియ్యం వేసి మునిగేలా నీటిని పోసి పక్కన పెట్టాలి. ● మిక్సీలో ఎండుమిర్చిని గ్రైండ్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. మెత్తగా గ్రైండ్ కావాల్సిన అవసరం లేదు. ● ఒక పెద్ద పాత్రలో ఆరుగ్లాసుల నీటిని పోసి వేడి చేయాలి. నీరు వేడెక్కిన తర్వాత ఉప్పు కలపాలి. నీరు మరగడం మొదలైన తర్వాత నానబెట్టిన సగ్గుబియ్యం వేసి కలిపి మూత పెట్టాలి. సగ్గుబియ్యం ఉడకడం మొదలైన తర్వాత నానబెట్టిన బియ్యప్పిండిని పోసి కలపాలి. పిండి అడుగు పట్టకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. పిండి ఉడికేటప్పుడు ఎండుమిర్చి పొడి, జీలకర్ర వేసి కలిపి దించేయాలి. వడియాల పిండి వేడి తగ్గేలోపు నూలు వస్త్రాన్ని తడిపి నేల మీద పరిచి సిద్ధం చేసుకోవాలి. ఇప్పుడు మిశ్రమాన్ని స్పూన్‌తో వడియాలుగా పెట్టాలి. రెండు రోజులు ఎండబెట్టిన తర్వాత క్లాత్‌కు వెనుకవైపు నీటిని చల్లి వడియాలను వలిచి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ● ఈ వడియాలు చాలా త్వరగా వేగుతాయి. నూనెలో వేసిన తర్వాత పొంగి పువ్వుల్లా విచ్చుకోవడం మొదలవుతుంది. అప్పుడు చిల్లుల గరిటెతో నూనెలో ముంచినట్లయితే రెండు వైపులా సమంగా వేగుతాయి. వీటిని తెల్లగా ఉండగానే నూనెలో నుంచి తీసేయాలి. తీయడం ఆలస్యమైతే ఎరుపురంగులోకి మారిపోయి చేదు వస్తుంది.

బియ్యం.. సగ్గుబియ్యం వడియాలు



కావలసినవి: బియ్యం – ఒక గ్లాసు; సగ్గుబియ్యం – పావు గ్లాసు; పచ్చిమిర్చి – 2; అల్లం – అంగుళం ముక్క; జీలకర్ర – టీ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి;

తయారీ: ● బియ్యం, సగ్గుబియ్యాన్ని కడిగి మంచినీటిలో నానబెట్టాలి. ఆరు గంటల తర్వాత మిక్సీ జార్‌లో వేసి, తగినంత నీటిని పోస్తూ, ఉప్పు కలిపి గ్రైండ్ చేయాలి. దోసెల పిండిలాగ మెత్తగా గరిటె జారుడుగా రుబ్బుకోవాలి. ● మరొక జార్‌లో పచ్చిమిర్చి, అల్లం గ్రైండ్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. ● పెద్ద పాత్రలో ఐదు గ్లాసుల నీటిని పోసి మరిగిన తర్వాత బియ్యప్పిండి మిశ్రమాన్ని పోసి గరిటెతో కలపాలి. మిశ్రమం దగ్గరయ్యేటప్పుడు అల్లం, పచ్చిమిర్చి పేస్టు, జీలకర్ర వేసి కలపాలి. మిశ్రమం బాగా దగ్గరయ్యి సంగటిలా ముద్దగా అవుతుంది. పాత్రను స్టవ్ మీద నుంచి దించేసి చల్లారనివ్వాలి. ● పాలిథిన్ షీట్ మీద వడియాల్లాగ పెట్టాలి. ఈ వడియాలను స్పూన్‌తో పెట్టడం కుదరదు. చేత్తోనే పెట్టాలి. కాబట్టి వేడి తగ్గిన తర్వాత పిండిని చేతిలోకి తీసుకుని పిండి కొద్దికొద్దిగా పడేటట్లు మునివేళ్లతో పేపర్ మీద పెట్టాలి. ఈ వడియాలు ఒక్కరోజులోనే ఎండిపోతాయి. ఉదయం పెడితే సాయంత్రానికి ఎండతాయి. వేళ్లతో కదిలించగానే పేపర్ మీద నుంచి ఊడి వచ్చేస్తాయి. లోపల కొద్దిపాటి పచ్చి ఉన్నప్పటికీ అదే రోజు వలిచి పేపర్ మీద ఆరబోసి రెండవ రోజు ఎండలో పెట్టాలి. ● ఈ వడియాలను వేయించేటప్పుడు కూడా కొద్దిపాటి జాగ్రత్త అవసరం. నూనె వేడెక్కిన తర్వాత వడియాలను నూనెలో వేసిన వెంటనే చిల్లుల గరిటెతో నూనెలో ముంచి కొద్ది సెకన్లపాటు ఉంచితే లోపల కూడా బాగా కాలి పువ్వులా విచ్చుకుంటాయి.

మినపప్పప్ప వడియాలు



కావలసినవి: చాయ మినప్పప్పు – అర కేజీ; పచ్చిమిర్చి – 4; అల్లం – అంగుళం ముక్క; జీలకర్ర – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ఇంగువ – పావు స్పూన్; నూనె – వేయించడానికి సరిపడినంత;

తయారీ: ● మినప్పప్పును శుభ్రంగా కడిగి మంచినీటిలో నాలుగు గంటలసేపు నానబెట్టాలి. ● నానిన తర్వాత నీటిని వంపేసి పప్పును వెట్‌గ్రైండర్‌లో రుబ్బాలి (మిక్సీలో గ్రైండ్ చేస్తే వడియం గట్టిగా వస్తుంది, రుచిగా ఉండదు). పప్పు మెదిగేలోపు అందులో పచ్చిమిర్చి, అల్లం, ఉప్పు వేయాలి. మెత్తగా మెదిగిన తర్వాత జీలకర్ర, ఇంగువ వేసి రెండు నిమిషాల పాటు గ్రైండ్ చేస్తే వడియాల మిశ్రమం రెడీ. ● నూలు వస్త్రాన్ని తడిపి దానిమీద వడియాల మిశ్రమాన్ని టీ స్పూన్‌తో పెట్టాలి. రెండు రోజులు ఎండిన తర్వాత వస్త్రానికి వెనుక వైపు నీటిని చల్లి వడియాలను వలవాలి. వలిచిన వడియాలను మళ్లీ ఎండలో పెట్టాలి. బాగా ఎండిన తర్వాత గాలి దూరని డబ్బాలో నిల్వ చేయాలి.

గమనిక: మినప వడియాలను వేయించేటప్పుడు ఒకింత జాగ్రత్త అవసరం. నూనె బాగా వేడెక్కిన తర్వాత వడియాలను వేసి మంట మీడియంలోకి మార్చాలి. అప్పుడు వడియం లోపల కూడా చక్కగా సమంగా ఎర్రగా వేగుతుంది. మంట తగ్గించకపోతే... వడియం బయటి వైపు ఎర్రగా వేగినప్పటికీ లోపల పచ్చిదనం తగ్గదు. లోపల కూడా వేగేవరకు ఉంచితే వడియం అంచులు మాడిపోతాయి. **మరో విషయం...** ఈ వడియాలను వేయించి అలాగే తినవచ్చు, కూరల్లో కూడా వేసుకోవచ్చు.

రవ్వ వడియాలు

కావలసినవి: బొంబాయి రవ్వ – కేజీ; పచ్చిమిర్చి– పది; జీలకర్ర : టేబుల్ స్పూన్; అల్లం – 50 గ్రాములు; ఉప్పు– టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి; నీరు – 8 లీటర్లు; సగ్గుబియ్యం – పావు కేజీ; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● రవ్వను ఒక పాత్రలో వేసి మునిగేటట్లు నీటిని పోసి పక్కన ఉంచాలి. ● అల్లం, పచ్చిమిర్చి శుభ్రం చేసి మిక్సీ జార్‌లో వేయాలి, అందులో జీలకర్ర, ఉప్పు కూడా వేసి గ్రైండ్ చేయాలి. ● పెద్ద పాత్రలో నీటిని పోసి వేడి చేయాలి. నీరు మరగడం మొదలైన తర్వాత గ్రైండ్ చేసిన అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు మిశ్రమాన్ని వేసి కలపాలి. ఆ తరవాత సగ్గుబియ్యాన్ని, నానబెట్టిన రవ్వను వేసి కలియబెట్టాలి. రవ్వ ఉడికి దగ్గరవుతున్నప్పుడు స్టవ్ ఆపేయాలి. ● ఒక నూలు వస్త్రాన్ని తడిపి నేల మీద పరిచి వడియాలు పెట్టాలి. మిశ్రమాన్ని ఒక పాత్రలోకి తీసుకుని టీ స్పూన్‌తో ఒక్కో స్పూన్ మిశ్రమాన్ని వస్త్రం మీద వేయాలి. ఇలా రవ్వ మిశ్రమం మొత్తాన్ని వడియాలుగా పెట్టాలి. మంచి ఎండల్లో ఒక రోజుకే ముప్పావు వంతు ఎండిపోతాయి. లోపల ఉన్న పచ్చి రెండవ రోజుకు ఎండిపోతుంది. ఇలా రెండు రోజులు ఎండిన తర్వాత వస్త్రానికి వెనుక వైపు నీటిని చల్లి



వడియాలను వలవాలి. వలిచిన తరవాత ఒక రోజు ఎండబెట్టాలి. ఇలా తయారైన వడియాలు ఏడాదంతా నిల్వ ఉంటాయి. భోజనానికి పదిమినిషాల ముందు నూనెలో వేయించుకుంటే కరకరలాడే వడియాలు రెడీ.

గమనిక: 1. వడియాల మిశ్రమం వేడి తగ్గిన తర్వాత పూర్తిగా చల్లారే లోపు వడియాలు పెట్టేయాలి. మరీ చల్లారితే మిశ్రమం గట్టి పడిపోయి స్పూన్‌తో తీసి వస్త్రం మీద పెట్టేటప్పుడు స్పూన్‌ను వదలకుండా ఇబ్బంది పెడుతుంది. 2. వడియాలు పెట్టడానికి నూలు వస్త్రం లేకపోతే పాలిథిన్ షీట్ మీద పెట్టవచ్చు.

* ఆర్ఎమ్ఎఫ్

పేరెంటింగ్ ప్రపంచంలో కొత్త మంత్రం

అమ్మానాన్నా మాట్లాడుతున్నా సరే,
వినకుండా విసురుగా వెళ్లిపోవడం
వ్యంగ్యంగా మాటలు అనేయడం
నాటకీయంగా కళ్లు తిప్పడం
ఉన్నట్టుండి తమ గదిలోకి వెళ్లి
'ధఢేల్'న తలుపులు వేసుకోవడం
ఇలాంటివెన్నో సంఘటనలు..
టీనేజ్ పిల్లలున్న తల్లిదండ్రులకు తెలియని విషయమేమీ కాదు.
ఒంటరి తల్లులకు పిల్లల పెంపకం
మరింత కష్టంగా ఉంటుంది.
పిల్లల చంచలమైన భావాలను
నియంత్రించలేక
తల్లులు చాలాసార్లు మౌనంగా
మారిపోతుంటారు.
ఇంట్లో టీనేజర్లు సృష్టించే
యుద్ధ వాతావరణంలో
ఎవరు గెలుస్తారో
ప్రతి పేరెంట్‌కు తెలుసు కాబట్టి
ఆర్ఎమ్ఎఫ్ మంత్రాన్ని మననం
చేసుకోండి అంటున్నారు నిపుణులు.


ప్రతీకాత్మక చిత్రం

రెస్ట్ మామ్ ఫేస్ (ఆర్ఎమ్ఎఫ్) అనే ఈ మంత్రం అమ్మ ముఖకవళికలను పిల్లల ముందు ఎలా ప్రదర్శించాలి, అందుకు తగిన సాధన ఏ విధంగా చేయాలో నిపుణులు చెబుతున్నారు.

'టీనేజ్‌లో ఉన్న మా అమ్మాయి విషయంలో చాలాసార్లు నా ప్రవర్తన ఒత్తిడితో కూడుకున్నదై ఉంటుంది. చికాకు పరిచే సంఘటనలు ఎదురైనప్పుడు నా ఎమోషన్స్‌ని సమర్థంగా నియంత్రించలేక పోతుంటాను' అంటుంది కార్పొరేట్ ఆఫీసులో హెడ్‌గా పనిచేసే కౌముది.

•••

'మా అబ్బాయితో గొడవపడటం, పదే పదే చెప్పడం, గతంలో చేసిన ప్రామిస్‌లను గుర్తుచేయడం అదేపనిగా జరుగుతుంటుంది. కానీ, ఆ వెంటనే తప్పనిసరై నాకు నేనే తగ్గడం, మౌనంగా ఉండటం, లేదంటే సర్దిచెప్పడం.. ఎప్పుడూ జరిగే పనే' అంటుంది బొటిక్‌ను నడిపే వింధ్య.

•••

'కుటుంబ ఆకాంక్షలను పిల్లలు తీర్చాలనే లక్ష్యంగానే నేటి తల్లిదండ్రుల ప్రవర్తన ఉంటోంది. తల్లులు టీనేజ్ పిల్లల విషయంలో తమను తాము నియంత్రించు కోవడానికి ఇది కూడా ఒక కారణంగా ఉంటుంది' అని తెలియజేస్తుంది హోలీ గ్రెయిల్ ఆఫ్ పేరెంటింగ్ మ్యాగజైన్. ఎలాంటి భావోద్వేగాలను ముఖంలో చూపని తటస్థ స్థితిని రెస్టింగ్ మామ్ ఫేస్ సాధన చేస్తే సరైన ప్రయోజనాలను పొందవచ్చు అని చెబుతోంది. అదెలాగో చూద్దాం.

తటస్థంగా..

సాధారణంగా ఎలాంటి వ్యక్తీకరణ లేని స్త్రీ ముఖాన్ని చూసిన వాళ్లు అహంకారమనో లేదా నిరాడంబరత అనో నిర్ధారించుకుంటుంటారు. సంతోషించే సమయంలోనూ వీరు 'తటస్థ' ముఖాలతో ఉండటం చూస్తుంటాం. చూసేవారికి వీరి ముఖాల్లో ప్రశాంతత కూడా కనిపిస్తుంటుందని పరిశోధకులు గ్రహించారు. అందరూ ఇలా ఉండలేరు. కానీ, పిల్లల ముందు తమ భావోద్వేగాలను బయటకు చూపకుండా తమని తాము నిభాయించుకుంటూ ఉండాలంటే ప్రాక్టీస్ అవసరం.

విశ్రాంతికి 30 సెకన్లు

అమ్మల ముఖం పిల్లల ముందు సరైన విధంగా ఉండాలంటే...

- ఫేస్ యోగాను సాధన చేయాలి.
- కోపంగా ఉన్న పిల్లలతో మాట్లాడేముందు ముఖ కండరాలకు కూడా విశ్రాంతి అవసరం అని తమకు తాముగా చెప్పుకోవాలి. రెండు పిడికిళ్లతో ముఖాన్ని రుద్దుకుంటున్నట్టు, కోపాన్ని కూల్ చేసుకుంటున్నట్టు ఊహించుకోవాలి. గాఢంగా ఊపిరి పీల్చుకోవడం, వదలడం చేయాలి. అయితే, అది ఎదుటివారికి నిట్టూర్పులా ఉండకూడదు. మీ ముఖ కండరాలలో చికాకు, ఆశ్చర్యం, విమర్శించడం ... వంటివన్నీ తీసేసి, స్పష్టంగా అనుకున్న విషయాన్ని చెప్పేయాలి.
- చిన్నపిల్లలు యుక్తవయసులో ఉన్నా, పెద్దవారైనప్పుడైనా ఈ ఆర్ఎమ్ఎఫ్ ఉపయోగకరంగా ఉంటుంది. నిజాయితీగా ఈ వ్యూహాన్ని అమలుపరిస్తే ప్రయోజనకరమైన మార్పులు కనిపిస్తాయి.
- గొడవ పడే సమయాల్లో ఎలాంటి బోధలు చేయద్దు. అలాగే శిక్షించవద్దు.
- పిల్లలు వారి భావోద్వేగాలను స్వీయ – నియంత్రణ చేయగలిగేలా చేయడమే లక్ష్యంగా ఉండాలి.
- మీ బిడ్డ తన ఆందోళనను, అసంతృప్తిని మరింత ఆమోదయోగ్యమైన మార్గాల్లో వ్యక్తపరచలేకపోతే అకస్మాత్తుగా దాడికి దిగవచ్చు. లేదంటే తనని తాను బాధించుకోవచ్చు. అందుకని సమస్యను కూల్‌గా పరిష్కరించాలి.

బంధాలు పదిలం..

'తల్లి మెరుగైన ఆలోచనతో ఉంటే పిల్లలతో స్నేహాలను, ఆరోగ్యకరమైన సంబంధాలను పెంచుకోగలదు. కానీ, నియంత్రణతో సరైన ప్రయోజనాలను రాబట్టలేరు' అంటారు సైకాలజిస్ట్ అండ్ పేరెంటింగ్ రైటర్ అలిజా. పిల్లల ఆకలి తీరినప్పుడు వారి కోపం చల్లబడుతుంది. అందుకని వారికి ఆరోగ్యకరమైన చిరుతిండిని అందిస్తుండాలి. దీంతో పిల్లల దృష్టి మారిపోతుంది. కానీ, అన్ని విషయాల్లో ఇది సాధ్యం కాకపోవచ్చు. అందుకని సాధ్యమైనంత వరకు ఆర్ఎమ్ఎఫ్‌ని సాధన చేయడమే మేలు అనేది నిపుణుల మాట.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 361

శుక్రవారం 22-3-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పార్టీని ఆర్థికంగా చిదిమేసే కుట్ర

కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాల్ని ఫ్రీజ్ చేయడంపై సోనియా మండిపడ్డారు. రూ.2 చెల్లించలేని స్థితిలో ఉన్నామని రాహుల్ అన్నారు.

- వివరాలు 6లో



ఆ చట్టంపై స్టే ఇవ్వలేం: సుప్రీం

ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం–2023పై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

- వివరాలు 6లో

కేజ్రీవాల్ అరెస్ట్

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎంను అదుపులోకి తీసుకున్న ఈడీ

- అరెస్టు నుంచి ఉపశమనం కల్పించలేమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసిన కొన్ని గంటల్లోనే ఈడీ ఆపరేషన్
- సెర్చ్ వారెంట్‌తో కేజ్రీవాల్ అధికారిక నివాసానికి అధికారులు
- తొలుత రెండున్నర గంటలపాటు విచారణ.. కేజ్రీవాల్‌తోపాటు కుటుంబ సభ్యుల ఫోన్లు సీజ్
- అనంతరం కేజ్రీవాల్ అరెస్టు... ఈడీ ప్రధాన కార్యాలయానికి తరలింపు
- నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న ఈడీ అధికారులు
- కేజ్రీవాల్‌ను తమ కస్టడీకి అప్పగించాలని కోరే అవకాశం
- ముఖ్యమంత్రి పదవిలో కేజ్రీవాల్ కొనసాగుతారని ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టీకరణ



గురువారం ఢిల్లీలో కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న ఈడీ అధికారులు

న్యూఢిల్లీ: అంతా అనుకున్నదే జరిగింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన మనీ లాండరింగ్ వ్యవహారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్(55)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నాటకీయ పరిణామాల మధ్య అరెస్టు చేసింది. ఈ కేసులో అరెస్టు చేయకుండా కేజ్రీవాల్‌కు రక్షణ కల్పించలేమని ఢిల్లీ హైకోర్టు తేల్చిచెప్పిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈడీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం నుంచి

మిగతా 6వ పేజీలో ▶

ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ నష్టమే!

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు కావడం ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి ఎదురు దెబ్బేనని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి భారీ నష్టం తప్పదని అంటున్నారు. ఢిల్లీ, హరియాణా, గుజరాత్‌లో కాంగ్రెస్‌తో ఆ పార్టీ పొత్తు కుదుర్చుకుంది. పంజాబ్‌లో ఒంటరిగానే అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల్లో గణనీయంగా సీట్లు సాధించి, దేశమంతటా పార్టీని విస్తరింపజేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న తరుణంలో కేజ్రీవాల్ అరెస్టు కావడం ఆప్ శ్రేణులను నిరాశకు గురిచేసింది. నిజానికి ఆప్‌లో కేజ్రీవాల్ మాత్రమే స్టార్ క్యాంపెయినర్. ఒకవేళ ఆయన ఈడీ కస్టడీకి గానీ, జైలుకు గానీ పరిమితమైతే పార్టీని ముందుకు నడిపించే బలమైన నాయకులెవరూ లేరు. మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్, సంజయ్ సింగ్ లాంటి సీనియర్లు ఇప్పటికే అరెస్టయ్యారు. కేజ్రీవాల్ లేకపోతే ఇంకెవరు? అనే ప్రశ్న ఆమ్ ఆద్మీ పార్టీలో ఏనాడూ తలెత్తలేదు. మరోవైపు కేజ్రీవాల్ అరెస్టు వ్యవహారం బీజేపీకి మేలు చేయకపోగా బ్యాక్ ఫైర్ అయ్యే అవకాశాలు లేకపోలేదన్న వాదన వినిపిస్తోంది. 12 ఏళ్ల క్రితం పుట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ భవితవ్యం ఏమిటన్నది మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

నేను ఎవరితోనూ టచ్‌లోకి వెళ్లలేదు

- లోక్‌సభ ఎన్నికల తర్వాత నేను సీఎం అన్నది ఊహాజనితమే: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- సీఎం వెంట ఉన్నంత మాత్రాన నంబర్ 2 ఎలా అవుతానని ప్రశ్న
- వచ్చే ఐదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల తర్వాత తాను సీఎం అవుతానంటూ జరుగుతున్న ప్రచారం ఊహాజనితమేనని రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం కావాలని తానేమీ కోరుకోవడం లేదన్నారు. తాను బీజేపీతో టచ్‌లోకి వెళ్లినట్టు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తాను ప్రధాన మంత్రిని కలిసినంత మాత్రాన పాల్యూట్

మిగతా 2వ పేజీలో ▶



మల్లు రవి (నాగర్ కర్నూల్)



గడ్డం రంజిత్‌రెడ్డి (చేవెళ్ల)



సునీతా మహేందర్‌రెడ్డి (మల్కాజిగిరి)



దానం నాగేందర్ (సికింద్రాబాద్)



గడ్డం వంశీకృష్ణ (పెద్దపల్లి)

చేయందుకున్న వారికి చాన్స్

- ఐదుగురితో కాంగ్రెస్ రెండో జాబితా
- మల్లు రవి మినహా నలుగురు కొత్తగా పార్టీలో చేరిన నేతలే
- దానం, గడ్డం వంశీకృష్ణ, మల్లు రవి, సునీతా మహేందర్‌రెడ్డి, గడ్డం రంజిత్ రెడ్డికి గ్రీన్ సిగ్నల్
- ఇద్దరు రెడ్డి, ఇద్దరు ఎస్సీ, ఒక బీసీ..
- మొత్తం 9 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి పోటీ చేసే మరో ఐదుగురు అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణ, మల్కాజిగిరి నుంచి సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, చేవెళ్ల నుంచి గడ్డం రంజిత్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి బరిలో ఉంటారని తెలిపింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) భేటీలో ఆమోదించిన జాబితాను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్

మిగతా 2వ పేజీలో ▶

మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి: రేవంత్‌రెడ్డి

2లో

పార్టీలోనే ఉంటే మంచి భవిష్యత్తు

- బీఆర్‌ఎస్ నేతలతో కేసీఆర్ భేటీలు
- లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధతపై చర్చ
- స్థానిక నేతలతో ఫోన్‌లో మాట్లాడుతూ దిశా నిర్దేశం
- హోలీ తర్వాత మిగతా 6 స్థానాలకు అభ్యర్థుల ఖరారు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో పార్టీ నేతలతో వరుస భేటీలు జరుపుతున్నారు. స్థానిక రాజకీయ పరిస్థితులు, క్షేత్ర స్థాయిలో ప్రజల స్పందన, ప్రభుత్వ వ్యతిరేకత, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పనితీరు వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు. పలువురు నేతలు పార్టీని వీడటం ఈ భేటీల్లో ప్రస్తావనకు వస్తుండగా, పార్టీని అంటిపెట్టుకుని

మిగతా 2వ పేజీలో ▶

విశాఖ పోర్టులో దొరికిన 25వేల కిలోల డ్రగ్స్.. కేరాఫ్ కోటయ్య చౌదరి

- సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కేంద్రంగా డ్రగ్స్ దందా
- బ్రెజిల్ నుంచి కంటైనర్లో విశాఖ పోర్టుకు.. ఇంటర్‌పోల్ సమాచారంతో సీబీఐ తనిఖీ
- 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌తో కలగలిపి కొకైన్ దిగుమతి.. సంధ్యా ఆక్వా పేరిట డెలివరీ
- ఈ కంపెనీ సీఈఓ కూనం కోటయ్య చౌదరి.. ఆయన తండ్రి వీరభద్రరావు ఎండీ
- బీజేపీ నేత పురంధేశ్వరి కుటుంబీకులకు వీరభద్రరావు వ్యాపార భాగస్వామి
- టీడీపీ నేతలతోనూ, బాలకృష్ణ వియ్యంకుడి కుటుంబంతోనూ సాన్నిహిత్యం
- టీడీపీ హయాంలో యథేచ్ఛగా అక్రమాలకు తెగబడ్డ సంధ్యా ఆక్వా
- అక్రమాలపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొరడా; కంపెనీని సీజ్ చేసిన పీసీబీ
- 2016లో అమెరికాలో విమాన ప్రయాణికురాలితో అసభ్య ప్రవర్తన, కేసు నమోదు
- ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లోనూ వీరభద్రరావు పాత్ర.. చేతులు మారిన రూ.25 కోట్లు!

- 11లో

'వికసిత్ భారత్' సందేశాలను ఆపండి



- ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రచారం చేసే వికసిత్ భారత్ సంకల్ప్ సందేశాలు ఓటర్ల ఫోన్లకు వాట్సాప్‌లో పంపడాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తప్పుబట్టింది.

- 6లో

ఇదండీ సంగతి



వెళ్లిపోయిన పార్టీలను ఆకర్షించడానికి ఏర్పాటు చేశాం!

క్లుప్తంగా...

బీజేపీ చేతిలో అణచివేత అస్త్రాలుగా ఈడీ, సీబీఐ: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ సంస్థలు బీజేపీ చేతిలో ప్రధానమైన అణచివేత అస్త్రాలుగా తయారయ్యాయి. బీజేపీ దేశంలో రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకొని ఎలాంటి ఆధారాలు లేకున్నా రాజకీయ కక్ష తీర్చుకునేందుకు రాజ్యాంగ విరుద్ధంగా పని చేస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నా' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.

ఆర్మూర్ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా లావణ్య



ఆర్మూర్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మునిసిపల్ చైర్ పర్సన్‌గా వన్నెల్ దేవి లావణ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీసీ మహిళకు రిజర్వు అయిన ఈ సీటు అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఖాళీ అయింది. దీంతో ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు మునిసిపల్ కార్యాలయంలో ఆర్మూర్ ఆర్డీవో రాజగౌడ్, మునిసిపల్ కమిషనర్ రాజు ఆధ్వర్యంలో చైర్ పర్సన్ ఎన్నికను గురువారం నిర్వహించారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లలో 30 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. ఎక్స్‌అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, బీజేపీ కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. 23వ వార్డు కౌన్సిలర్ లావణ్య పేరును సభ్యులు ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన లావణ్య ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు.

సీఎంతో కార్పొరేషన్ల చైర్మన్ల భేటీ



సీఎంను కలిసిన ముత్తినేని వీరయ్య

సాక్షి, హైదరాబాద్: వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమితులైన నేతలు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వికలాంగుల ఆర్థిక సహకార సంస్థ చైర్మన్‌గా నియమితుడైన ముత్తినేని వీరయ్య, బీసీ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్‌గా నియమితుడైన టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్ సీఎంను ఆయన నివాసంలో కలిశారు. పెరిక కుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్‌ను నెరవేర్చడంతో పాటు తనను వికలాంగుల ఆర్థిక సహకార సంస్థకు చైర్మన్‌గా నియమించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని వీరయ్య ప్రశంసించారు. తనను బీసీ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్‌గా నియమించినందుకు నూతి శ్రీకాంత్ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ బురద జల్లుతోంది

బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగంపై ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: సంబంధం లేని అంశాలను బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అంటగడుతూ ఆయనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. గాంధీభవన్ గురువారం కార్పొరేషన్ చైర్మన్‌లు ప్రీతమ్, మెట్టుసాయి, పార్టీ అధికార ప్రతినిధి లింగం యాదవ్, యూత్ కాంగ్రెస్ నేత రాజీవ్‌రెడ్డితో కలిసి బల్మూరి మాట్లాడారు. చిత్రపురి సొసైటీలో జరిగిన అవినీతికి సీఎం రేవంత్‌కు సంబంధం ఏంటో అర్థం కాకుండా పోస్టులు పెట్టారని, రేవంత్ సోదరుల్లో మహేందర్‌రెడ్డి పేరు ఉన్నవాళ్లు ఎవరం లేరని చెప్పారు. అనుములకు ఎనుములకు తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని, అవినీతికి సంబంధించిన ఆధారాలుంటే ప్రభుత్వానికిస్తే చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



సీఎం రేవంత్‌తో విఠల్‌రెడ్డి. చిత్రంలో సీతక్క

నిర్మల్: నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు గడ్డిగారి విఠల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో ఆయన పార్టీ కండువా వేసుకున్నా రు. విఠల్‌రెడ్డి కాంగ్రెస్ నుంచే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2014లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొంది బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఓటమి పాలయ్యారు.

చేయందుకున్న వారికి చాన్స్

▶ మొదటి పేజీ తరువాయి

గురువారం రాత్రి విడుదల చేశారు. తాజాగా ప్రకటించిన ఐదుగురిలో మల్లు రవి మినహా మిగతా నలుగురు కొత్తగా కాంగ్రెస్‌లో చేరినవారే కావడం గమనార్హం. బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ ఇంకా ఆ పార్టీకి రాజీనామా కూడా చేయలేదు. గడ్డం వంశీకృష్ణ తండ్రి గడ్డం వివేకానంద బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఉండి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇక సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, సునీతా మహేందర్ రెడ్డి కూడా ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. రెండో జాబితాలో ఇద్దరు రెడ్డి సామాజిక వర్గం నేతలకు, ఒక బీసీకి, ఇద్దరు ఎస్సీలకు అవకాశం కల్పించింది. తొలి జాబితాతో కలిపి మొత్తం నలుగురు రెడ్డి, ఇద్దరు బీసీ, ఒక ఎస్టీ, ఇద్దరు ఎస్సీ నేతలకు కాంగ్రెస్ చాన్స్ ఇచ్చినట్టయింది.

తొలి జాబితాలో నలుగురి ప్రకటన

కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ స్థానాలపై ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)లో చర్చ జరగలేదు. ఇక భువనగిరి, ఖమ్మం, మెదక్ స్థానాల విషయంలో ఇంకా ఏకాభిప్రాయం రాలేదు. మరోవైపు ఆదిలాబాద్ ఖరారైందనుకున్నా, చివరకు అక్కడ అభ్యర్థిని మార్చాలని భావించారు. దీంతో ఆయా స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన మరో సీఈసీ భేటీకి వాయిదా పడింది. దీంతో ఈ నెల 25 (హోలీ) తర్వాతే వీటిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మొత్తం మీద ఇప్పటివరకు 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, మరో 8 సీట్లు పెండింగ్‌లో ఉన్నాయి. తొలి జాబితాలో నలుగురు అభ్యర్థులు..



వంశీచంద్ రెడ్డి (మహబూబ్‌నగర్), బలరాం నాయక్ (మహబూబాబాద్), రఘువీర్ రెడ్డి (నల్లగొండ), సురేష్ షెట్కార్ (జహీరాబాద్) పేర్లను ప్రకటించిన సంగతి తెలిసిందే.

కాంగ్రెస్‌లో చేరిన టీచర్ ఆత్రం సుగుణ

ఆదిలాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉంటారని భావిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ గురువారం కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కల సమక్షంలో ఆమె పార్టీ కండువా కప్పుకున్నారు. సుగుణ బుధవారమే తన ఉద్యోగానికి సుగుణ రాజీనామా చేసిన నేపథ్యంలో ఆమె అభ్యర్థిత్వం ఖరారైనట్టేనని అంటున్నారు. అయితే రిమ్స్‌లో వైద్యురాలిగా ఉన్న సుమలత కూడా ఇటీవల సీఎంను కలిశారు. ఆమె కూడా ఉద్యోగానికి రాజీనామా చేయాలని భావించారు. ఆమె పేరు ఖరారైందనే వార్తలు వెలువడ్డాయి. కానీ తాజాగా ఆత్రం సుగుణ పేరు తెరపైకి వచ్చింది.

రెండు మాలలకా?

మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో రెండు మాలలకు ఇవ్వడంపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నాగర్‌కర్నూల్ (మల్లు రవి), పెద్దపల్లి (గడ్డం వంశీ) రెండు స్థానాలను మాలలకే ఎలా ఇస్తారని మాదిగ సామాజిక వర్గం నేతలు ప్రశ్నిస్తున్నారు. అయితే మెదక్ స్థానానికి మంత్రి దామోదర రాజనర్సింహ కుమార్తె త్రిష పేరును పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ నీలం మధు ముదిరాజ్‌కు ఖరారు కాని పక్షంలో త్రిష పేరు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక నిజామాబాద్‌లో జీవన్‌రెడ్డి, కరీంనగర్‌లో ప్రవీణ్‌రెడ్డి, హైదరాబాద్‌లో షెహనాజ్ తబుస్సమ్, ఖమ్మంలో పొంగులేటి ప్రసాదరెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. భువనగిరికి చామల కిరణ్ లేదా కోమటిరెడ్డి లక్ష్మిలలో ఒకరు ఖరారయ్యే అవకాశాలున్నాయి.

ఖమ్మంపై మున్షీ భేటీ

గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న ఖమ్మం టికెట్‌కు డిమాండ్ కూడా ఎక్కువగానే ఉంది. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రుల కుటుంబ సభ్యులు ఈ టికెట్‌ను ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ గురువారం ఆ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క (మధిర), మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (పాలేరు), తుమ్మల నాగేశ్వరరావు (ఖమ్మం), మట్టా రాగమయి (సత్తుపల్లి), రాందాస్ నాయక్ (వైరా), జారె ఆదినారాయణ (అశ్వారావుపేట) భేటీలో పాల్గొన్నారు. వీరితో ఉమ్మడిగా, విడివిడిగా సమావేశమైన మున్షీ ఖమ్మం నుంచి ఎవరు పోటీ చేస్తే బాగుంటుందన్న దానిపై అభిప్రాయాలు తీసుకున్నారు.



సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మైనంపల్లి హన్మంతరావు, మధుయాష్కీ గౌడ్, సునీతారెడ్డి తదితరులు

లోక్‌సభ ఎన్నికలు ప్రతిష్టాత్మకం!

మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి: రేవంత్‌రెడ్డి

- కేసీఆర్ పతనానికి బీజం ఇక్కడే పడిందని వ్యాఖ్య
- కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ గెలవాలని పిలుపు

సాక్షి, హైదరాబాద్: ఓ సామాన్యుడిని సీఎం స్థాయికి ఎదిగేలా చేసినది, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పతనానికి బీజం వేసినది మల్కాజిగిరి లోక్‌సభ నియోజక వర్గమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో ఆశించిన స్థాయిలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవలేదని, ఇప్పటికైనా లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. గురువారం జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఇందులో పార్టీ నాయకులను ఉద్దేశించి సీఎం రేవంత్ మాట్లాడారు. ''లోక్‌సభ ఎన్నికలు ప్రతిష్టాత్మకం. నా బలం, బలగం కార్యకర్తలే. మల్కాజిగిరిలో నేను ఎంపీగా పోటీ చేసినప్పుడు కొందరు నాయకులు అమ్ముడుపోయినా, కార్యకర్తలు నన్ను భుజాల మీద మోసి గెలిపించి ఢిల్లీకి పంపారు. ప్రతీ బూత్‌లో ఒక్కో కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేశారు. నాటి మల్కాజిగిరి గెలుపే నన్ను తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసింది..'' అని పేర్కొన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర మంతా కాంగ్రెస్ తుఫాను వచ్చినా మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదన్నారు. ఇక్కడి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం నాలుగు గెలిస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేదని పేర్కొన్నారు. అందుకే మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్ విజయం సాధించేలా పార్టీ యంత్రాంగం కృషి చేయాలని కోరారు. హోలీ పండుగలోగా అధిష్టానం అభ్యర్థులను ప్రకటిస్తుందని, కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదని చెప్పారు. పార్టీకి బలమైన నాయకత్వం ఉందని, సమన్వయంతో ముందుకెళితే విజయం సాధిస్తామని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, సునీతారెడ్డి, సుధీర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి తెప్పోత్సవం



తెప్పలపై విహరిస్తున్న రుక్మిణీ సమేత శ్రీకృష్ణ స్వామి

తిరుమల: తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై భక్తులకు అభయమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై స్వామివారు ఆసీనులై పుష్కరిణిలో ముమ్మార్లు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా జరిగింది. మూడోరోజు శ్రీభూ సమేతంగా మలయప్పస్వామివారు తిరుచ్చిపై సర్వాలంకార భూషితుడై పురవీధుల్లో ఊరేగిన అనంతరం కోనేటిలోని తెప్పపై ఆసీనుడై ముమ్మార్లు విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు.

24, 25 తేదీల్లో తుంబురు తీర్థ ముక్కోటి

తిరుమల: తిరుమల శ్రీ తుంబురు తీర్థ ముక్కోటి ఉత్సవం మార్చి 24, 25వ తేదీల్లో ఘనంగా జరుగనుంది. తీర్థానికి విశేషంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా తుంబురు తీర్థానికి మార్చి 24వ తేదీ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, 25వ తేదీ ఉదయం 5 నుంచి 11 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతిస్తారు. పాపవినాశనం డ్యామ్ వద్ద భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, మందులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సి ఉండటంతో గుండె, శ్వాస కోశ సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతి లేదు. భక్తులు వంట సామగ్రి, కర్పూరం, అగ్గిపెట్టెలు తీసుకురాకూడదని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. పోలీసు, అటవీశాఖ, టీటీడీ విభాగం సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టనున్నారు.

రేపు బీజేపీ తుది జాబితా!

- వరంగల్‌కు అరూరి రమేశ్ ఓకే
- ఖమ్మం... బీఆర్ఎస్ ఎంపీ ఆసక్తి... ఆయన కాదంటే జలగం పేరు పరిశీలనలో..
- నల్లగొండ ఎంపీ అభ్యర్థి మార్పుపై కూడా చర్చ...

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎంపీ అభ్యర్థుల తుది జాబితా శనివారం వెలువడే అవకాశాలున్నాయి. ఢిల్లీలో శుక్రవారం జరగాల్సిన కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం మరుసటి రోజుకు వాయిదా పడినట్టు సమాచారం. తెలంగాణ విషయానికొస్తే..వరంగల్, ఖమ్మం ఎంపీ సెగ్మెంట్లకు బీజేపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. బీఆర్ఎస్ నుంచి ఇటీవల బీజేపీలోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు వరంగల్ ఖరారు కాగా, ఇక అది ప్రకటించడమే తరువాయి అని సమాచారం. ఖమ్మం నుంచి ఎవరిని బరిలో దింపాలనే విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. మాజీ సీఎం జలగం వెంగళరావు తనయుడు మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు పేరును పరిశీలనలోకి తీసుకున్నా... పోటీకి ఓ బీఆర్ఎస్ ఎంపీ ఆసక్తి కనబరుస్తుండడంతో ఆయనకే ఈ సీటు దక్కే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థి ఖరారైన నల్లగొండ ఎంపీ సీటుతో పాటు ఒకట్రెండు స్థానాల్లో అభ్యర్థుల మార్పు జరగొచ్చుననే ప్రచారం కూడా సాగుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఒకరు పోటీ చేసేందుకు ఉత్సాహం కనబరుస్తుండడంతో, ఇప్పటికే ఖరారు చేసిన అభ్యర్థి కంటే సదరునేత మెరుగైన వాడిగా భావిస్తే నల్లగొండ అభ్యర్థి మార్పు కూడా ఉంటుందంటున్నారు. తుది జాబితా ప్రకటన ఒకరోజు వాయిదా పడడంతో ఎన్నికల వ్యూహాల ఖరారుకు శనివారం నిర్వహించాల్సిన సమావేశం ఆదివారానికి వాయిదా పడినట్టు తెలిసింది. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థులు, పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు, జిల్లా అధ్యక్షులతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.



ప్రధాన పార్టీల కంటే ముందుగానే

లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా మిగతా పార్టీలకన్నా బీజేపీనే ముందు వరుసలో ఉంది. ఇప్పటికే ప్రధాని మోదీ ఓ విడత ముందస్తు ప్రచారం పూర్తిచేయడం దీనినే సూచిస్తోంది. తెలంగాణలో నాలుగో విడత పోలింగ్ మే 13న ఉన్నందున, ఆ దశ ఎన్నికలప్పుడు మోదీ, అమిత్‌షా, నడ్డా, ఇతర ముఖ్యనేతల విస్తృత ప్రచారం నిమిత్తం రాష్ట్రానికి వస్తారని బీజేపీ నేతలు చెబుతున్నారు.

వికేంద్రీకరణ వ్యూహం...

బీజేపీ అగ్రనేత అమిత్‌షా ప్రత్యక్ష పర్యవేక్షణలో లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెరుగైన ఫలితాల సాధనకు వికేంద్రీకరణ వ్యూహం పార్టీ అమలు చేస్తోంది. ఇక్కడా పోలింగ్‌బూత్‌లే కేంద్రంగా కార్యాచరణ సిద్ధం చేసింది. ఇటీవల ఎల్‌బీ స్టేడియంలో దాదాపు 30వేల మంది పోలింగ్‌బూత్ కమిటీల అధ్యక్షులు, ఆపై మండల, జిల్లాస్థాయి అధ్యక్షులతో అమిత్‌షా సమావేశమైన సందర్భంగా పలు సూచనలు చేశారు. ఇందుకు అనుగుణంగా పోలింగ్‌బూత్‌లే కేంద్రంగా ఎన్నికల కార్యకలాపాలపై పార్టీ ప్రత్యేకదృష్టి కేంద్రీకరిస్తోంది. ఒక్కో పోలింగ్‌బూత్ పరిధిలో దాదాపుగా 24 పనులు క్రమం తప్పకుండా చేయాలని అమిత్‌షా ఆదేశించినట్టు తెలిసింది.

పేద బీసీ నాయకుడిని పార్లమెంట్‌కు పంపండి

సీఎం రేవంత్‌కు పున్నా కైలాశ్‌నేత లేఖ

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తనకు భువనగిరి స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాశ్‌నేత కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 'పేదింటి బిడ్డకు రాజకీయ అవకాశం కల్పించిన వారిని సమాజం చరిత్రలో మరువదు. అందుకే నాకు ఒక్క అవకాశం ఇవ్వండి. పేదింటి బీసీ నాయకుడిని పార్లమెంట్‌కు పంపండి. భువనగిరి లోక్‌సభ టికెట్ కేటాయించండి' అని లేఖలో కోరారు.

జానారెడ్డితో ఇంద్రకరణ్‌రెడ్డి భేటీ

త్వరలో కాంగ్రెస్‌లో చేరిక?



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి త్వరలోనే కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. గురువారం ఆయన హైదరాబాద్‌లో సీనియర్ కాంగ్రెస్ నేత జానారెడ్డితో భేటీ అయిన నేపథ్యంలో ఈ ప్రచారం ఊపందుకుంది. ఇంద్రకరణ్‌రెడ్డి చేరికపై గతంలోనూ ప్రచారం జరిగినా, గురువారం జానా నివాసానికి వెళ్లి గంటకుపైగా చర్చలు జరపడంతో కచ్చితంగా పార్టీ మారతారని భావిస్తున్నారు.

ఇందిరమ్మరాజ్యంలో ఎమర్జెన్సీ పాలన

- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్
- నిబంధనలకు విరుద్ధంగా ఫోన్లు సీజ్ చేశారు
- చిత్రపురిలో కుంభకోణంపై విచారణ జరిపించాలి



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మరాజ్యం తెస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ పాలనను గుర్తుకు తెస్తోందని బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం కన్వీనర్ మన్నె క్రిశాంక్ విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు సతీశ్‌రెడ్డి, జగన్ మోహన్‌రావు, దినేశ్ చౌదరితో కలిసి గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు తనపై కేసు నమోదు చేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తన పాస్‌పోర్ట్, సెల్‌ఫోన్‌తోపాటు తన పీఆర్‌ఓ, పీఏ ఫోన్లను మొబైల్‌ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. తమ ఫోన్లను సీఎం రేవంత్‌రెడ్డికి చేరవేసినట్లు తనకు అనుమానం కలుగుతుందన్నారు. తమ ఫోన్లను, పాస్‌పోర్ట్‌ను పోలీసులు కోర్టుకు అప్పగించాలని డిమాండ్ చేశారు. చిత్రపురి కాలనీలోనే రూ.3వేల కోట్ల మేర అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేత ఫిరోజ్‌ఖాన్ చేసిన ఆరోపణలను మాత్రమే తాను ప్రస్తావించానని పునరుద్ఘాటించారు. చిత్రపురికాలనీ అక్ర మాలపై రేవంత్ ప్రభుత్వం విచారణ జరిపించాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై ఉన్నత న్యాయస్థానంలోనే తేల్చుకుంటామని స్పష్టం చేశారు. చిత్రపురి సొసైటీకి చెందిన అనుముల మహానందరెడ్డి ఎవరో తెలియదని సీఎం రేవంత్ అంటున్నారని, ఆయనతో సీఎం దిగిన ఫొటోలు కూడా ఉన్నాయన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక ఆరోపణలు చేసినా అణచివేత చర్యలకు పాల్పడలేదన్నారు.

సీఎం రేవంత్ మాట మార్చడం సిగ్గుచేటు

మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



కొత్తకోట (వనపర్తి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మా పెద్దన్న అని మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరుసటి రోజే మాట మార్చడం సిగ్గుచేటని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో పలువురు నాయకులు గురువారం బీజేపీలో చేరికల అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు కాకపోవడంతో ప్రజల్లో నమ్మకం కోల్పోయారన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో మోసం చేసి గెలిచారని దుయ్యబట్టారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు, రాహుల్‌గాంధీని ప్రధాని చేసేందుకు ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో 12 ఎంపీ సీట్లు గెలుస్తామని, తనను ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు.

నేను ఎవరితోనూ టచ్‌లోకి వెళ్లలేదు

▶ మొదటి పేజీ తరువాయి

అయినట్టు కాదన్నారు. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని చెప్పారు. గురువారం మంత్రి పొంగులేటి హైదరాబాద్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పొంగులేటి సీఎం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని మీడియా ప్రస్తావించగా.. అంతా అవాస్తవన్నారు. ''పళ్లున్న చెట్టుకే రాళ్లదెబ్బలు పడతాయి. నా వద్ద పళ్లు ఉన్నాయి. అందుకే ఈ ప్రచారం జరుగుతోంది. నేను సీఎం వెంట ఉన్నంత మాత్రాన కేబినెట్‌లో నంబర్ 2 ఎలా అవుతాను. సీఎం కావాలని నేను అనుకున్నా పార్టీ అధిష్టానం అన్నిరకాల అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది కదా..'' అని పేర్కొన్నారు.

ఎవరి ఫోన్లనూ ట్యాప్ చేయబోం..

గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. తమ ప్రభుత్వం ఎవరి ఫోన్లనూ ట్యాపింగ్ చేయదని భరోసా ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 14 సీట్లు సాధిస్తుందన్నారు. బీఆర్ఎస్ ఒకట్రెండు సీట్లు గెలిస్తే గొప్పేనన్నారు. కాంగ్రెస్‌లోకి ఎవరినీ ఆహ్వానించలేదని, వారంతట వారే వస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌పై కేసులతో కక్షసాధింపు అన్న ఆరోపణలు సరికాదని.. గత ప్రభుత్వ అధికార దుర్వినియోగంపై చర్యలు తీసుకోకుండా ఎలా ఉంటామని ప్రశ్నించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడేనాటికే వానాకాలం ముగిసిందని.. కానీ జలాశయాల్లో నీళ్లు లేకపోవడం, పంటలు ఎండిపోవడం విషయంలో తమ ప్రభుత్వంపై రాళ్లు వేస్తున్నారని మండిపడ్డారు. జీతాల చెల్లింపులో కొంత ఆలస్యం వాస్తవమేనని, దానిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పార్టీలోనే ఉంటే మంచి భవిష్యత్తు

▶ మొదటి పేజీ తరువాయి

ఉండే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని అధినేత భరోసా ఇస్తున్నారు.

జిల్లాల వారీగా భేటీలు

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, మరో ఆరు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ టికెట్ ఆశిస్తున్న నేతలతో పాటు జిల్లాల వారీగా మాజీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలు కేసీఆర్‌ను కలుస్తున్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో మిగతా ఆరు స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ఖరారు చేస్తామని కేసీఆర్ చెబుతున్నారు. మెదక్, భువనగిరి, నల్లగొండ, సికింద్రాబాద్ స్థానాల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల విషయంలో స్పష్టత వచ్చిన తర్వాతే బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించాలని ఆయన భావిస్తున్నారు. నాగర్‌కర్నూలు నుంచి ఇటీవలే పార్టీలో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేరు ఖరారు కాగా హైదరాబాద్ నుంచి కూడా బలమైన అభ్యర్థి బరిలోకి దిగుతారని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. మెదక్ నుంచి వంటేరు ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి పేర్లు దాదాపు ఖరారయ్యాయి. భువనగిరి నుంచి బూడిద భిక్షమయ్య గౌడ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, పైళ్ల శేఖర్‌రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డిల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ పేరు తెరమీదకు రాగా, దాసోజు శ్రవణ్ పేరు కూడా వినిపిస్తోంది. సోమవారం హోలీ పండుగ తర్వాత బీఆర్ఎస్ తుది జాబితా వెలువడే అవకాశముంది.

మంచి ఫలితాలు ఖాయం!

మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వీడిన చోట ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టి కేసీఆర్ దిశా నిర్దేశం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సిర్పూరులో ఎమ్మెల్సీ దండె విఠల్, ముథోల్‌లో వేణుగోపాలచారి, హుజూర్‌నగర్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు ఎన్నికల సన్నాహాలను సమన్వయం చేస్తున్నారు. కింది స్థాయిలో స్థానికంగా చురుగ్గా ఉన్న కేడర్‌కు బాధ్యతలు అప్పగించాలని కేసీఆర్ ఆదేశించారు. మరోవైపు జిల్లాల వారీగా ఫోన్ల ద్వారా కూడా కేసీఆర్ దిశానిర్దేశం చేస్తున్నారు. వివిధ సర్వే ఏజెన్సీల నుంచి అందుతున్న నివేదికల ఆధారంగా పలు సూచనలు చేస్తున్నట్లు సమాచారం. కాగా ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందనే ధీమా కేసీఆర్ వ్యక్తం చేస్తున్నట్లు ఆయనను కలిసిన నేతలు చెప్తున్నారు.

మెదక్‌లో హరీశ్ పోటీ చేస్తారనే ప్రచారం

మాజీ మంత్రి హరీశ్‌రావు మెదక్ లోకకభ బరిలో ఉంటారని సామాజిక మాధ్యమాల్లో గురువారం విస్తృత ప్రచారం జరిగింది. అయితే ఇది పూర్తిగా తప్పుడు సమాచారం అని, అలాంటి చర్చ పార్టీలో జరగడం లేదని హరీశ్ స్పష్టత ఇచ్చారు. మెదక్ ఎంపీ అభ్యర్థి ఎవరనే అంశంపై పార్టీ అధినేత కేసీఆర్ రెండు మూడు రోజుల్లో పూర్తి స్పష్టత ఇస్తారంటూ ఒక ప్రకటన విడుదల చేశారు.

కేసీఆర్‌తో సుదీర్ఘ భేటీ

ఎమ్మెల్సీ కవిత అరెస్టు నేపథ్యంలో ఈ నెల 16న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, హరీశ్‌రావు ఢిల్లీకి వెళ్లిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి ఢిల్లీ నుంచి తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్న హరీశ్ గురువారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌తో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. కవిత విచారణ సహా ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలను వివరించడంతో పాటు లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కూడా చర్చించినట్లు తెలిసింది. ఢిల్లీలోనే ఉన్న కేటీఆర్ శనివారం హైదరాబాద్‌కు తిరిగి వచ్చే అవకాశముంది.

కాంగ్రెస్ నేతలకు అహంకారం పెరిగింది

పార్టీపై, బండి సంజయ్‌పై పొన్నం వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ

సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చాక మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతలకు అహంకారం తలకెక్కిందని బీజేపీ ఎస్సీ జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ మండిపడ్డారు. తమ అహంభావాన్ని వారు ఇతర పార్టీల నేతలపై చూపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గురువారం పార్టీ నాయకులు డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి, అధికార ప్రతినిధులు రాణీరుద్రమ, సీహెచ్ విఠల్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీపై, పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చాక రాజకీయాలు చేయబోమని, ప్రజలకిచ్చిన హామీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు ఆచరణకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో నేరెళ్లలో దళితులను ఇసుక లారీల కింద తొక్కిస్తే అప్పుడు బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రప్పించి పోరాడిన విషయాన్ని మంత్రి పొన్నం మరిచిపోయారా అని ప్రశ్నించారు. జిల్లా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నంల మధ్య అభిప్రాయ బేధాలున్నాయని వార్తలు వస్తు న్నాయని, అలాంటిది బీజేపీ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ వారికి లేదన్నారు. ఇతర పార్టీల వారితో సంబంధం లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలంటూ మంత్రి పొన్నం ఆదేశించినట్లు ఆడియో వైరల్ అయ్యిందని దీనికి ఆయన ఏం సమాధానం చెబుతారని రాణీరుద్రమ ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ కూడా ఇదే పద్ధతుల్లో పనిచేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దొరల పద్ధతినే కొనసాగిస్తోందని విమర్శించారు.

క్లుప్తంగా...

మానవజాతి బ్రహ్మాస్త్రం హరితహారం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: మానవజాతి చేతిలో ఉన్న ఏకైక బ్రహ్మాస్త్రం హరితహారమని, బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ నమ్మే సిద్ధాంతం ఇదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. అందుకే జంగిల్ బచావో.. జంగిల్ బడావో నినాదాన్ని మాజీ సీఎం కేసీఆర్ అక్షరాలా నిజం చేశారని పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా గురువారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 'దశాబ్దాల పాటు ధ్వంసమైన అడవులను దార్శనికతతో కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడారు. తెలంగాణలో మహోద్యమంలా హరితహారం చేపట్టి ప్రపంచ చరిత్రలో మూడో అతిపెద్ద మానవ ప్రయత్నం ద్వారా 230 కోట్ల మొక్కలు నాటించారు. 15 వేల నర్సరీల ద్వారా దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎనిమిది శాతం పచ్చదనం పెంచారు. పచ్చని అటవీ సంపదను పెంచేందుకు గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను తలదన్నేలా హరితహారం చేపట్టాం'.. అని కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

జీవవైవిధ్యం కాపాడే బాధ్యత అందరిపై ఉంది



సాక్షి, హైదరాబాద్: మానవ మనుగడకు అడవులు, జీవవైవిధ్యం కాపాడే బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. భవిష్యత్‌తరాలు ఆరోగ్యంగా జీవించడానికి అడవులను సంరక్షించుకోవాల్సిన అత్యయిక పరిస్థితి నెలకొందని చెప్పారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మంత్రి ఓ సందేశం ఇచ్చారు. తెలంగాణలో 24.05 శాతమున్న అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 'అడవులు–ఆవిష్కరణలు.. మెరుగైన ప్రపంచం కోసం కొత్త పరిష్కారాలు'' అనే థీమ్‌తో ప్రపంచవ్యాప్తంగా అటవీ దినోత్సవం జరుపుకుంటున్నారని మంత్రి చెప్పారు.

నకిలీ మందుల సమాచారం ఇవ్వండి


ప్రజలకు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: నకిలీ మందులు విక్రయిస్తున్నా.. ఎమ్మార్పీకంటే ఎక్కువ వసూలు చేసినా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. లైసెన్స్‌లు లేకుండానే కొన్ని కంపెనీలు మందులను తయారు చేసి విక్రయిస్తున్నట్టు తమ తనిఖీల్లో గుర్తించినట్టు చెప్పారు. ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా ప్రజలు 1800–599–6969 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కాగా, డీసీఏ అధికారులు కొత్తగూడెంలో చేపట్టిన తనిఖీల్లో డెక్స్‌ల్యాబ్ అనే స్టెరాయిడ్ ఇంజెక్షన్‌ను అధిక ధరకు విక్రయిస్తున్నట్టుగా గుర్తించినట్టు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో ఇంజెక్షన్ అసలు ధర రూ.26కు గాను సదరు కంపెనీ రూ.39.90 గా ముద్రించినట్టు గుర్తించామని పేర్కొన్నారు. నిబంధనలు విక్రయించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

23 నుంచి జిల్లాల్లో బీసీ జోడో యాత్ర

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



కాచిగూడ: చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ.. ఈ నెల 23వ తేదీ నుంచి జిల్లాల్లో బీసీ జోడో యాత్రను ప్రారంభిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. గురువారం జాతీయ బీసీ యువజన సంఘం ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్ నుంచి జోడో యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 10 సీట్లు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. కేంద్రంలో 15 లక్షల ఉద్యోగాలను ప్రకటించిన పార్టీలకే ఎన్నికల్లో బీసీల మద్దతు ఉంటుందని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఖాళీగా ఉన్న ఐదుగురు సభ్యులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఇతర నేతలు పాల్గొన్నారు.

నేషనల్ బుక్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా వల్లీశ్వర్

సాక్షి, హైదరాబాద్: నేషనల్ బుక్ ట్రస్టు ఎగ్జిక్యూటివ్ కమిటీలో సభ్యునిగా, సంస్థ ట్రస్టీగా సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్ నియమితులయ్యారు. మూడేళ్ల ఆ పదవిలో కొనసాగుతారని నేషనల్ బుక్ ట్రస్ట్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. వల్లీశ్వర్ ఆంధ్రపత్రిక, ఈనాడు, న్యూస్‌టైమ్ పత్రికల్లో, భారత్ టుడే చానల్లో ఉన్నత స్థాయిల్లో పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ పత్రిక ఎడిటర్‌గా సేవలందించారు. ప్రస్తుతం ఎమెస్కో ప్రచురణ సంస్థలో కీలక బాధ్యతల్లో ఉన్నారు.



టెట్.. టఫ్

రెగ్యులర్ బీఎడ్, డీఎడ్ వారితో రాసేందుకు సర్వీస్ టీచర్ల ససేమిరా

- ప్రత్యేక టెట్ నిర్వహించాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు
- సిలబస్ విడుదలతోనే రాజుకున్న రగడ
- సమగ్ర నోటిఫికేషన్ విడుదలకు తప్పని జాప్యం

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసిన వారితోనే టెట్ రాసేందుకు సర్వీస్‌లో ఉన్న టీచర్లు ససేమిరా అంటున్నారు. సర్వీస్ టీచర్లకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో టెట్ సమగ్ర నోటిఫికేషన్ విడుదలకు జాప్యం జరుగుతోంది. డీఎస్సీకి ముందే టెట్ నిర్వహించడంపై బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీరితోనే టెట్ రాయాలన్న నిబంధనను మాత్రం సర్వీస్‌లో ఉన్న టీచర్లు వ్యతిరేకిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో టెట్ నిర్వహణపై గందరగోళం నెలకొంది. సర్వీస్ టీచర్లు టెట్ రాసేందుకు అవసరమైన మార్గదర్శకాలు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ ప్రక్రియపై విద్యాశాఖ ఆచితూచి అడుగేస్తోంది. ఇప్పటి వరకూ టెట్ సిలబస్‌ను మాత్రమే ప్రకటించింది. సమగ్ర నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. టెట్ దరఖాస్తులను ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 10 వరకూ స్వీకరించాల్సి ఉంది. మే 20 నుంచి జూన్ 3 వరకూ టెట్ నిర్వహించాల్సి ఉంటుంది.

నిబంధనల్లో మార్పు తప్పదా?

టెట్ మార్గదర్శకాలు వెలువడితే తప్ప దరఖాస్తుల స్వీకరణ సాధ్యం కాదు. సమగ్ర నోటిఫికేషన్‌లో ఫీజు, పరీక్ష విధానం, రిజర్వేషన్లు ఇతర అంశాలన్నీ పేర్కొంటారు. దీనికి ముందు సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులూ కొత్తవారితో కలిసి టెట్ రాసేందుకు వీలుగా జీఓ వెలువడాలి. ఈ అంశాన్ని మార్గదర్శకాల్లో చేర్చాలి. అయితే, ప్రారంభంలోనే ఉపాధ్యాయ సంఘాలు టెట్‌పై అభ్యంతరాలు లేవనెత్తుతున్నాయి. సిలబస్ విడుదలైన వెంటనే అధికారులను ఉపాధ్యాయ సంఘాలు కలిసి అభ్యంతరాలు తెలియజేశాయి. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఏదో ఒక సబ్జెక్టులో మాత్రమే నిష్ణాతుడై ఉంటారని, అన్ని సబ్జెక్టులతో కూడిన టెట్ రాయడం అసాధ్యమంటున్నారు. భాషా పండితులకు వారు చెప్పే లాంగ్వేజీలపై తప్ప మరే ఇతర సబ్జెక్టులపై పట్టు ఉండదని చెబుతున్నారు. ఇటీవల కాలంలో బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు తేలికగా టెట్ రాసే వీలుందని, కొన్నేళ్ల క్రితం ఈ కోర్సులు చేసిన టీచర్లు ఎలా రాస్తారనే వాదన లేవనెత్తుతున్నారు. దీనిపై ప్రభుత్వం కూడా అధికారుల నుంచి వివరణ కోరింది. ఈ కారణంగానే టెట్ సమగ్ర నోటిఫికేషన్ విడుదలలో జాప్యం అవుతోందని విద్యాశాఖవర్గాలు అంటున్నాయి. టీచర్లను బలవంతంగా టెట్ రాసే జాబితాలో చేరిస్తే న్యాయ పోరాటానికి కొన్ని సంఘాలు సిద్ధమవుతున్నాయి. ఇదే జరిగితే టెట్ నిర్వహణకు బ్రేక్ పడుతుందన్న ఆందోళనలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా టెట్ అర్హత లేని ఉపాధ్యాయులు 80వేల మంది వరకూ ఉన్నారు. స్పెషల్ గ్రేడ్ ఉపాధ్యాయుల నుంచి సెకండరీ గ్రేడ్, ఎస్ఏల నుంచి హెచ్ఎంలకు పదోన్నతులు పొందాలంటే టెట్ అర్హత తప్పనిసరని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో టెట్ రాయాల్సిన అవసరం ఏర్పడింది. టెట్ తర్వాతే పదోన్నతులు చేపడతారు. పదోన్నతులు కల్పిస్తేనే ఖాళీల సంఖ్య స్పష్టంగా తెలుస్తుంది.

ప్రత్యేక టెట్ పెట్టి తీరాలి

ప్రత్యేక టెట్ పెట్టకపోతే సర్వీస్‌లో ఉన్న టీచర్లకు అన్యాయం జరుగుతుంది. కొన్నేళ్లుగా టెట్ ఫలితాలు అతి తక్కువగా ఉంటున్నాయి. ఎప్పుడో బీఈడీ, టీటీసీ చేసిన టీచర్లు ఇప్పుడు టెట్ రాస్తే పాసయ్యే అవకాశం తక్కువ. కాబట్టి ప్రత్యేక సిలబస్‌తో టీచర్లకు టెట్ పెట్టాలి. భాషా పండితులకు కూడా ప్రత్యేకంగా ప్రశ్నపత్రం ఉండాలి. ఇదే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. అన్యాయం జరిగిందని భావిస్తే ఎవరో ఒకరు న్యాయస్థానాన్ని ఆశ్రయించే వీలుంది. ఈ అంశాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని భావిస్తున్నాం.

– చావా రవి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తక్షణమే గైడ్‌లైన్స్ ఇవ్వాలి

షెడ్యూల్ ప్రకారం టెట్ గైడ్‌లైన్స్ విడుదల చేయకపోవడం ఎంతమాత్రం సరికాదు. విధివిధానాలు వస్తే తప్ప నిర్ణయించిన తేదీల్లో దరఖాస్తుల స్వీకరణ సాధ్యం కాదు. లక్షల మంది అభ్యర్థులు టెట్ సమగ్ర నోటిఫికేషన్‌కు ఎదురుచూస్తున్నారు. టెట్ సకాలంలో జరిగి, ఫలితాలు వెలువడినా, డీఎస్సీ రాయడానికి తక్కువ సమయమే ఉంటుంది. ఈ అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి.

– రావుల మనోహర్‌రెడ్డి తెలంగాణ బీఎడ్, డీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు



క్రషర్ యజమానుల సమ్మె విరమణ

చొరవ తీసుకున్న మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: క్రషర్ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇచ్చిన హామీతో ఐదురోజులుగా చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్టు తెలంగాణ క్రషర్ అసోసియేషన్ ప్రకటించింది. గురువారం తెలంగాణ క్రషర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధిబృందం మంత్రి కోమటిరెడ్డిని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించింది. మళ్లీ రాయల్టీ చెల్లించమని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని, ఇది క్రషర్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తుందని వారు మంత్రికి వివరించారు. దీంతో ఆయన సీఎంకు సమస్యను వివరించారు. కోడ్ ముగిసిన వెంటనే జూన్ 3వ తేదీ తర్వాత తాను ముఖ్యమంత్రితో మరోసారి చర్చించి మంత్రివర్గ ఉపసంఘం వేయించి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

'స్వర్' రూపశిల్పి గోపాల్‌కు జాతీయ పురస్కారం

ఉద్యాన పంటల సాగులో అతి తక్కువ నీటి వినియోగానికి 'స్వర్' రూపకల్పన



సాక్షి సాగుబడి, హైదరాబాద్: ఉద్యాన పంటల సాగులో నీటిని అతితక్కువగా వినియోగించే వినూత్న భూగర్భ డ్రిప్ 'స్వర్'పద్ధతిని ఆవిష్కరించిన హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్న్స్ (సీఈసీ) డైరెక్టర్ కె. ఎస్.గోపాల్ 'నీటి సుస్థిరత పురస్కారం 2023–24'విజేతగా నిలిచారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో గురువారం సాయంత్రం జరిగిన సభలో జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రధాన కార్యదర్శి, సీఈఓ భరత్ లాల్ ఈ పురస్కారాన్ని గోపాల్‌కు అందజేశారు. ద ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (తెరి), కేంద్ర జలశక్తి శాఖ, యూఎన్‌డీపీ ఇండియా సంయుక్తంగా నీటి సుస్థిరత పురస్కారాలను వరుసగా మూడో ఏడాది ప్రదానం చేశాయి.

కవితతో తల్లి శోభ ములాఖత్

ఐదో రోజూ కొనసాగిన ఈడీ విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో తల్లి శోభ ములాఖత్ అయ్యారు. శోభతోపాటు సోదరుడు కేటీఆర్, సోదరి సౌమ్య కూడా కలిశారు. వీరు గురువారం సాయంత్రం సుమారు గంట సేపు కవితతో మాట్లాడారు. కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణకు రానున్న కవిత పిటిషన్‌పైనా చర్చించినట్లు తెలిసింది. మరోవైపు, ఐదోరోజూ గురువారం కవితను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో సాక్షులైన తన పీఏలు చెప్పిన సమాచారం మేరకు కవితను ప్రశ్నించినట్లు తెలిసింది.




కవితను కలిసేందుకు వెళ్తున్న తల్లి శోభ, సోదరుడు కేటీఆర్

కృష్ణకుమార్ అక్రమాలపై ఏసీబీ ఆరా

- హెచ్ఎండీఏ అధికారిని ఇప్పటికే సస్పెండ్ చేసిన ప్రభుత్వం
- శివ బాలకృష్ణతో సంబంధాలపై దృష్టి

సాక్షి, హైదరాబాద్: హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ కృష్ణకుమార్ అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరింత దృష్టి సారించారు. ఇప్పటికే ఏసీబీ అరెస్టు చేసిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణతో కృష్ణకుమార్‌కు ఉన్న ఆర్థిక సంబంధాలపైనా ఆరా తీస్తున్నట్టు తెలిసింది. దీనిపై ఇప్పటికే ఏసీబీకి ఆధారాలు కూడా లభించాయి. హెచ్ఎండీఏలో ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్)లో అక్రమాలపై ప్రభుత్వం ఇప్పటికే కృష్ణకుమార్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. బిల్డర్లకు లబ్ధి చేకూర్చేలా పెద్ద సంఖ్యలో ఫైల్స్ క్లియర్ చేయడంలో కృష్ణకుమార్ కీలకంగా ఉన్నట్టు ఏసీబీ ఆధారాలు సేకరించినట్టు సమాచారం. ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో నష్టం చేస్తూ, బిల్డర్లకు లబ్ధి చేసేలా పలు అక్రమాలకు కృష్ణకుమార్ తెరతీసినట్టు అనుమానిస్తున్నారు. శివ బాలకృష్ణపై ఏసీబీ కేసు నమోదు కాగానే కృష్ణకుమార్ సెలవుపెట్టి అమెరికాకు వెళ్లాడు. దీంతో కృష్ణకుమార్ చిక్కితే మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వస్తాయని ఏసీబీ భావిస్తోంది. శివబాలకృష్ణ, కృష్ణకుమార్‌లకు సహకరించిన మరో ఇద్దరు హెచ్ఎండీఏ అధికారులపైనా ఏసీబీ దృష్టి పెట్టినట్టు తెలిసింది.



దొంగలొస్తే.. దొరకబుచ్చుకుని..

- మారణాయుధాలతో వచ్చిన దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్న తల్లీకూతుళ్లు
- ఘటనా స్థలంలో ఒకరిని.. కాజీపేటలో మరొకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



దుండగుడిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న తల్లీకూతుళ్లు. (ఇన్‌సెట్) స్వాధీనం చేసుకున్న తపంచా

సనత్‌నగర్ (హైదరాబాద్): ఇద్దరు దుండగులు ఓ ఇంట్లోకి చొరబడ్డారు. తపంచా (నాటు తుపాకీ), కత్తి చూపించి తల్లీకూతుళ్లను బెదిరించి, దోపిడీకి ప్రయత్నించారు. కానీ వారు దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఒకరిని గదిలో బంధించారు. మరొకరిని పట్టుకునేందుకు ప్రయత్నించినా, పరారయ్యాడు. ఈ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డయింది. హైదరాబాద్‌లోని బేగంపేట పైగాకాలనీలో గురువారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. పోలీసులు, బాధితులు చెప్పిన వివరాల మేరకు..

మాస్క్, హెల్మెట్ పెట్టుకుని..

బేగంపేట పైగాకాలనీకి చెందిన నవరతన్ జైన్, అమిత్ మహోత్ (46) భార్యాభర్తలు. వారికి ఒక మైనర్ కుమార్తె ఉంది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నవరతన్ ఇంట్లో లేని సమయంలో.. ఇద్దరు దుండగులు ఆ ఇంట్లోకి చొరబడ్డారు. ముఖాలు కనిపించకుండా ఒకరు మాస్క్, మరొకరు హెల్మెట్ పెట్టుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న తపంచా (నాటు తుపాకీ), కత్తి చూపించి.. ఇంట్లోని నగలు, నగదును తీసుకురావాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారు. అమిత అరుపులతో ఇంట్లోనే ఉన్న ఆమె మైనర్ కుమార్తె ధైర్యంగా ముందుకొచ్చింది. తల్లీకూతురు కలిసి దుండగులతో పెనుగులాడారు. ఈ క్రమంలో వారి నుంచి నాటు తుపాకీని అమిత లాగేసుకుంది. అప్పటికే తల్లీకూతురు కలిసి ఒకరిని లోపల బంధించారు. మరొకరు పారిపోతుండగా.. వెంటపడి పట్టుకునేందుకు ప్రయత్నించారు. కానీ ఆ వ్యక్తి వారిని నెట్టేసి పరారయ్యాడు. లోపల బంధించిన రెండో వ్యక్తి కూడా బయటపడి కత్తితో బెదిరిస్తూ, పారిపోయే యత్నం చేశాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

గతంలో పనిచేసిన వ్యక్తే..

ఆ ఇంట్లో గతంలో క్లీనింగ్ పనులు చేసిన ప్రేమ్‌చంద్, అతడి స్నేహితుడు సుశీల్‌కుమార్ కలసి ఈ దోపిడీ యత్నానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. వీరిలో ప్రేమ్‌చంద్‌ను స్థానికులు పట్టుకోగా.. పరారైన సుశీల్‌కుమార్‌ను పోలీసులు కాజీపేటలో అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. వారి నుంచి రెండు కత్తులు, తపంచా (నాటు తుపాకీ)లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. దుండగులు మారణాయుధాలతో వచ్చినా తల్లి, కుమార్తె భయపడకుండా ఎదుర్కోవడంపై పోలీసులు, ప్రజల నుంచి ప్రశంసలు వస్తున్నాయి.

పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం

మంత్రి పొంగులేటి హామీ



డీజేహెచ్ఎస్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి పొంగులేటికి వినతిపత్రం సమర్పిస్తున్న సొసైటీ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న పాత్రికేయులకు తప్పకుండా ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిబద్ధతతో ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత ఇందుకు సంబంధించిన కార్యాచరణను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం మంత్రి పొంగులేటి నివాసంలో దక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అతిత్వరలో అందరికీ న్యాయం చేసేవిధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా మంత్రిని డీజేహెచ్ఎస్ అధ్యక్షుడు బొల్లోజు రవి సత్కరించారు. కార్యక్రమంలో డీజేహెచ్ఎస్ ఉపాధ్యక్షుడు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప పాల్గొన్నారు.

'చక్షు'కు చెప్పండి!

సాక్షి, హైదరాబాద్:

"హలో.. మీకు లక్కీ లాటరీలో రూ.50 లక్షలు వచ్చాయి.. ఈ మొత్తాన్ని పొందాలంటే మేం చెప్పే బ్యాంకు అకౌంట్ నంబర్‌కు రూ.లక్ష పంపండి.. మిగిలిన మొత్తం మీ సొంతం అవుతుంది.."

'మీ వాట్సప్ నంబర్‌కు వచ్చిన లింక్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేయండి.. సర్‌ప్రైజ్ గిఫ్ట్ పొందండి..''

"హలో.. బ్యాంకు మేనేజర్‌ను మాట్లాడుతున్నాను.. మీ కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలి. లేదంటే మీ క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డు బ్లాక్ అయిపోతాయి. మేం అడిగే వివరాలు చెప్పండి.."

సైబర్ నేరాల కట్టడికి కొత్త పోర్టల్ తెచ్చిన కేంద్రం

- అనుమానాస్పద ఫోన్ నంబర్లపై రిపోర్ట్ చేసే అవకాశం
- అలాంటి ఫోన్ నంబర్లను దర్యాప్తు సంస్థలతో పంచుకోనున్న టెలికాం
- బ్యాంకులకు సమాచారంతో మోసాలకు చెక్‌పెట్టే అవకాశం
- ఇటీవలే చక్షు పోర్టల్ ప్రారంభించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



రోజుకో కొత్త తరహా సైబర్ మోసం...సైబర్ నేరగాళ్ల ఎత్తు ఏదైనా.. మూలం మాత్రం మన ఫోన్‌కు వచ్చే కాల్స్.. లేదంటే ఎస్ఎంఎస్‌లు. సైబర్ నేరగాళ్లు వివిధ ఫోన్ నంబర్ల నుంచి ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లు పంపి ఆర్థిక మోసాలకు పాల్పడటం ఇటీవల విపరీతంగా పెరిగింది. ఇలా ఫోన్ నంబర్లను ఉపయోగించి చేస్తున్న మోసాలను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'చక్షు'అస్త్రాన్ని అందుబాటులోకి తెచ్చింది. మోసపూరిత ఫోన్ నంబర్ల వివరాలు ఈ వెబ్ పోర్టల్‌లో నమోదు చేస్తే.. మోసగాళ్ల పనిపడతాయి దర్యాప్తు సంస్థలు. బ్యాంకులకు సైతం ఈ అనుమానాస్పద ఫోన్ నంబర్లు పంపుతారు. ఇలా చేయడం వల్ల సైబర్ నేరగాళ్లు సదరు నంబర్‌తో తెరిచిన బ్యాంకు ఖాతాలను జప్తు చేయడంతోపాటు మరొకరు మోసానికి గురికాకుండా కాపాడతారు. సాధారణ పౌరులు సైతం సైబర్ మోసగాళ్ల సమాచారాన్ని, మోసపూరిత ఫోన్ నంబర్ల సమాచారాన్ని చక్షు పోర్టల్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తేవచ్చు.

ఏమిటీ చక్షు పోర్టల్?

చక్షు అంటే కన్ను అని అర్థం.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ అందిస్తున్న సిటిజన్ సెంట్రిక్ సర్వీసెస్‌లో చక్షు పేరిట 'రిపోర్ట్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్'కొత్త సేవా పోర్టల్‌ను కేంద్ర కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవలే ప్రారంభించారు. అనుమానిత మోసపూరిత కాల్‌లు, సందేశాలు వివరాలు ఇందులో నమోదు చేయవచ్చు.

చక్షు పోర్టల్ ఎలా వినియోగించాలి..

- https://sancharsaathi.gov.in లింక్ ద్వారా సంచార్ సాథి పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలి. • సిటిజన్ సెంట్రిక్ సర్వీసెస్‌లో చక్షు ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. కంటిన్యూ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. • మోసపూరిత కమ్యూనికేషన్‌కు సంబంధించిన వివరాలు, ఆ కాల్ లేదా మెసేజ్ వచ్చిన సమయం, ఇతర వివరాలు నమోదు చేయాలి. • ఫిర్యాదు నమోదైన తర్వాత వెరిఫికేషన్ కోసం ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా నమోదైన ఫిర్యాదు దర్యాప్తు సంస్థలకు వెళుతుంది.

ఏయే అంశాలపై ఫిర్యాదు చేయవచ్చు

- అనధికారిక కనెక్షన్లు, మనకు వచ్చిన మోసపూరిత నంబర్లు సదరు వ్యక్తులపై ఉన్నాయా లేదా తనిఖీ చేయించవచ్చు. • మనం పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను బ్లాక్ చేయడం, ట్రాక్ చేయడం చేయవచ్చు.
- అనుమానాస్పద విదేశీ నంబర్లపై ఫిర్యాదు చేయవచ్చు.

యువకుడి ప్రాణాల మీదకు తెచ్చిన ఆన్‌లైన్ గేమ్

- లెక్కలో రూ.6 లక్షల తేడాతో పెట్రోల్‌బంక్ యాజమానుల ఫిర్యాదు
- రికవరీ పేరిట ఇంటిని రాయించుకున్న వైనం
- మనస్తాపంతో క్రిమిసంహారక మందు తాగిన యువకుడు



వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌస్‌పాషా

పరకాల: ఆన్‌లైన్ గేమ్ ఓ యువకుడి ప్రాణాల మీదకు తెచ్చింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో గురువారం రాత్రి వెలుగులోకి వచ్చింది. బాధితుడి తల్లి పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాలలోని వెలుమవాడకు చెందిన ఎండీ గౌస్‌పాషా గుడెప్పాడ్‌లోని జీకే పెట్రోల్ బంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గౌస్‌పాషా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆలోచనతో రమ్మీ ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటు పడి బంక్‌కు సంబంధించిన రూ.6లక్షలు పొగొట్టాడు. దీంతో బంక్ యజమానులు ఈ నెల 18న ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా ఆ డబ్బులు రికవరీ చేసేందుకు గౌస్‌పాషా ఇంటిని రూ.100 స్టాంప్ కాగితంపై రాయించుకున్నారు. అదే రోజు ఇంటికి చేరుకున్న గౌస్‌పాషా ఎంతో కష్టపడి తన తల్లిదండ్రులు కట్టుకున్న ఇంటిని బంక్ యజమానులు రాయించుకోవడం తెలిస్తే తట్టుకోలేరని మనస్తాపం చెంది ఈ నెల 19న పురుగుల మందు తాగాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని..మీరంతా తనను మరిచిపోవాలని తల్లి, తమ్ముడికి ఫోన్ చేశాడు. దీంతో వారు పోలీసులను సంప్రదించగా, పరకాల బంధం రోడ్డులో క్రిమిసంహారక మందు తాగి ప్రాణపాయ స్థితిలో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. తన కొడుకు ఆత్మహత్యయత్నానికి బంక్ యాజమానుల వేధింపులే కారణమని బాధితుడి తల్లి ఎండీ ఫర్వీనా పరకాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై పరకాల సీఐ రవి రాజుకు ఫోన్‌చేయగా స్పందించలేదు.

ఆయనే ఆకాశం నుండి భూమి వరకు ప్రతి వ్యవహారాన్ని నడిపిస్తున్నాడు;
తరువాత అంతా ఒకే దినమున, ఆయన వద్దకు పోయి చేరుతుంది;
దాని (ఆ దినపు) పరిమాణం మీ లెక్క ప్రకారం వేయి సంవత్సరాలు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 22 మార్చి 2024

గరళ కంఠ భారతం

ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి అంటూ రొమ్ము విరుచుకుంటున్న మనకు ఇప్పుడు పెద్ద అపకీర్తి కిరీటమూ దక్కింది. ప్రపంచంలోకెల్లా అత్యంత కలుషిత దేశాల్లో భారతదేశం ఒకటని తాజాగా తేలింది. స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ సంస్థ 'ఐక్యూ ఎయిర్' మొత్తం 134 దేశాలు, ప్రాంతాల్లోని 7,812 నగరాలలో 30 వేలకు పైగా వాయు నాణ్యతా పర్యవేక్షక కేంద్రాల నుంచి డేటా సేకరించి ఈ నివేదికను అందించింది. వారి ప్రపంచ వాయు నాణ్యతా నివేదిక ప్రకారం అత్యంత కాలుష్యదేశాల్లో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల తర్వాత మూడో స్థానం భారత్‌దే. 2022లో ఎనిమిదో స్థానంలో ఉన్న భారత్ ఒక్క ఏడాది కాలంలో కాలుష్యంలో మూడో ర్యాంకుకు చేరడం ఆందోళన రేపుతోంది. పైగా, ప్రపంచంలోకెల్లా అత్యంత కలుషిత రాజధాని అనే దుష్కీర్తి వరుసగా రెండో ఏడాది కూడా మన ఢిల్లీకే దక్కింది. అవి చాలదన్నట్టు ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా బెగూసరాయ్ నిలవడం దిమ్మ తిరిగేలా చేస్తోంది.

ప్రపంచంలో గత ఏడాది ఎదురైన ఆరోగ్య విపత్తు వాయు కాలుష్యమని నిపుణుల మాట. మన దేశంలో శిలాజ ఇంధనాల వినియోగం ప్రధాన కాలుష్యకారకం కాగా, ఉత్తరాదిన ఖరీఫ్ సీజన్‌లో పంట వ్యర్థాల్ని కాల్చే అలవాటుకు సరైన ప్రత్యామ్నాయం చూపడంలో పాలకుల వైఫల్యాలు సైతం ఢిల్లీ దుఃస్థితికి కారణమై వెక్కిరిస్తున్నాయి. అయితే, మెట్రోలు, గౌహతి – పాట్నా లాంటి ద్వితీయ శ్రేణి నగరాలే కాదు... బిహార్‌లోని బెగూసరాయ్, హర్యానాలోని రోహ్‌తక్, యూపీలోని మీరట్ లాంటి చిన్న పట్నాలు సైతం వాయు గరళంతో నిండిపోతున్నాయని నివేదిక తేల్చింది. ఐక్యూ ఎయిర్ జాబితాలోని 83 భారతీయ నగరాల్లో చాలావాటిలో కాలుష్య కారకాలు ఏమిటనే సమాచారం లేదు. అలాగే, బెగూసరాయ్ లాంటి చోట ఏడాది తిరగక ముందే కాలుష్యం 6 రెట్లు ఎలా పెరిగిందనేది కనిపెట్టాల్సి ఉంది. కారణాల్ని అంచనా వేస్తూనే, ముంచుకొచ్చిన ఈ ముప్పును విధానపరమైన పరిష్కారాలతో సమర్థంగా ఎదుర్కోవడం పాలకుల ముందున్న సవాలు.

గాలిలో ధూళికణాల (పీఎం) సాంద్రత ఏ మేరకున్నదనే దాన్ని బట్టి వాయుకాలుష్య ర్యాంకులు నిర్ణయిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) మార్గదర్శకాల ప్రకారం క్యూబిక్ మీటర్‌కు 5 మైక్రోగ్రాములు ఫరవాలేదు. అలాకాక, ధూళికణాలు 2.5 మైక్రాన్లు లేదా అంతకన్నా తక్కువ వ్యాసం (పీఎం 2.5) ఉన్నప్పుడు ఊపిరితిత్తుల, గుండె జబ్బులు, క్యాన్సర్, చిన్న వయసులోనే మరణాలు సంభవిస్తాయి. కాబట్టి అది ప్రమాదఘంటికకు కొలమానం. 2023లో భారత్‌లో వార్షిక సగటు పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 54.4 మైక్రోగ్రాములుగా రికార్డయింది. అలా భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఇక, క్యూబిక్ మీటర్‌కు 79.9 మైక్రోగ్రాములతో బంగ్లాదేశ్ మొదటి స్థానంలో, క్యూబిక్ మీటర్‌కు 73.3 మైక్రోగ్రాములతో పాకిస్తాన్ రెండోస్థానంలో ఉన్నాయి. నిజానికి, మిగతా రెండు దేశాలతో పోలిస్తే, భారత్ పీఎం2.5 సాంద్రత 2021 నాటి నుంచి తగ్గింది. అప్పట్లో భారత్‌లో క్యూబిక్ మీటర్‌కు 58.1 మైక్రోగ్రాములు ఉండేది. ఇప్పుడది 54.4కు తగ్గిందన్న మాటే కానీ ఇవాళ్టికీ ప్రపంచ టాప్ 50 కాలుష్య నగరాల్లో 42 మన దేశంలోవే కావడం కలతపరిచే అంశం.

దేశ జనాభాలో కొద్ది మంది మినహా దాదాపు 136 కోట్లమంది నిత్యం డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాలను మించి పీఎం2.5 ధూళికణ సాంద్రతకు లోనవుతున్నవారే! మరీ ముఖ్యంగా, మన దేశంలోని పట్టణప్రాంతాల్లో అధిక శాతం మంది ఇలా నిత్యం కాలుష్యం కోరల బారిన పడుతూ, శ్వాసకోశ సమస్యలతో డాక్టర్ల చుట్టూ తిరుగుతుండడం తరచూ కంటి ముందు కనిపిస్తున్న కథే. మిగిలినవి అటుంచితే, భారత్‌లో ఉత్పత్తి అయ్యే విద్యుచ్ఛక్తిలో 70 శాతం థర్మల్ విద్యుత్తే అన్నది గమనార్హం. ఇప్పటికీ మనం పునరుత్పాదక శక్తి వనరుల మార్గం పట్టలేదు. పైపెచ్చు, దేశ ఆర్థిక వృద్ధి మరింత వేగవంతమయ్యేకొద్దీ ఇది పెను సవాలు కానుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఇంటి పైకప్పులపై సౌరవిద్యుత్ ఫలకాల ఏర్పాటు లాంటి భారీ ప్రణాళికలు ప్రకటించింది. అయితే, ఇవన్నీ ఆచరణలోకొచ్చి, ప్రభావం చూపడానికి మరికొంత సమయం పడుతుంది. ఇలాంటి ప్రయత్నాలు గణనీయంగా ప్రభావం చూపాలంటే, మన విద్యుత్ విధానాలను సమూలంగా మార్చడం ముఖ్యం.

అసలు 'స్వచ్ఛమైన గాలి' కూడా ప్రాథమిక జీవనహక్కే. కోర్టులు ఆ సంగతి పదేపదే చెప్పాయి. బరిలోకి దిగక తప్పని పరిస్థితిని ప్రభుత్వాలకు కల్పించాయి. అయితే, పౌర రవాణాలో సీఎన్‌జీ, మెట్రో వ్యవస్థ, 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' లాంటివి తీసుకొచ్చినా ఢిల్లీ లాంటి చోట్ల కాలుష్యం కోరలు చాస్తూనే ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు సమస్య అవగాహన, పరిష్కారానికై శాస్త్ర విజ్ఞానాన్ని ఆశ్రయించాలి. అలాగే, కాలుష్య నియంత్రణకు అవసరమైన రీతిలో జనజీవితంలో అలవాట్లు మారేలా ప్రోత్సాహకాలు, అతిక్రమిస్తే జరిమానాల పద్ధతి తేవాలి. సర్వజన శ్రేయస్సు కోసం పార్టీలన్నీ కాలుష్యంపై పోరును రాజకీయ అంశంగా తీసుకొని, ఎన్నికల మేనిఫెస్టోల్లో చోటివ్వాలి. నిజానికి, జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమాన్ని పటిష్ఠం చేస్తామంటూ 2019లో కాంగ్రెస్, బీజేపీలు తమ ఎన్నికల వాగ్దానపత్రంలో పేర్కొన్నాయి. ఇది కేవలం కేంద్రం పనే కాదని గుర్తించి, రాష్ట్రాల నుంచి మునిసిపాలిటీల దాకా అన్నీ తమ వంతుగా కాలుష్యంపై పోరులో చేతులు కలపాలి. వాయు కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యమే కాక, దరిమిలా సంక్లిష్టమైన పర్యావరణ ప్రక్రియలతో పుడమి వాతావరణమే దెబ్బతింటుందని శాస్త్రవేత్తల మాట. అందుకని ఈ విషానికి విరుగుడు కనిపెట్టడం అన్ని విధాలా అత్యవసరం. ఈ క్రమంలో తాజా ఐక్యూ ఎయిర్ నివేదిక మనకు మరో మేలుకొలుపు.

ఓడినా మారని బాబు...

విశ్లేషణ



టంకశాల అశోక్

మొదటిసారి చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పటినుంచి, ఆయన విధానాలు తన స్వప్రయోజనాల చుట్టూ, సంపన్నుల ప్రయోజనాల చుట్టే తిరిగాయి. విద్యుత్ ట్యారిఫ్ పెంచి ఆందోళనాకారులపైన, రైతు వ్యతిరేక విధానాలు ప్రవేశపెట్టి రైతు ఆందోళనాకారులపైన కాల్పులు జరిపించారు. ఇక కాంగ్రెస్‌ను వదిలి టీడీపీలో చేరినప్పటి నుంచీ ఆయన వైఖరి కపటపూరితమైనదే. మొదట ఎన్టీఆర్ పట్ల, తర్వాత తనతో మైత్రి చేసిన కమ్యూనిస్టుల పట్ల, బీజేపీ పట్ల, కాపుల వంటి ప్రధాన కుల సమాజాల పట్ల, అల్ప సంఖ్యాక వర్గాల పట్ల ఎప్పటికప్పుడు తన రాజకీయ అవసరాలను బట్టి అవకాశవాద ఎత్తుగడలను అనుసరిస్తూ వస్తున్నారు. అందుకే, చంద్రబాబును చిత్తు చేసిందెవరు? స్వయంగా ఆయన పరిపాలనా విధానాలు, వాటి పట్ల సామాన్యుల ఆగ్రహం!

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతో సమస్యంతా ఆయన విధానాలతోనే. 1995లో మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పటినుంచి తర్వాత 29 సంవత్సరాల సుదీర్ఘ కాలమంతా ఆయన రాజకీయ విధానాలు, పరిపాలనా విధానాలు కూడా తన స్వప్రయోజనాల చుట్టూ, సంపన్నుల ప్రయోజనాల చుట్టే తిరిగాయి. సామాన్యుల గురించి కొన్ని కపటపు మాటలు మినహా వారి ప్రయోజనాల కోసం ఆయన ఎప్పుడూ పని చేయలేదు.

ఆయన 1995లో ముఖ్యమంత్రి అయ్యే నాటికి రాష్ట్రంలో ఎన్టీఆర్ సంక్షేమ రాజ్యం సామాన్యుల ఆదరణ పొంది నడుస్తున్నది. మరొకవైపు, 1991 నుంచి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు ఇంకా వేగం పుంజుకోవలసి ఉంది. చంద్రబాబు విషయానికి వస్తే, తనకు సంపన్నులపై గల ప్రేమ కారణంగా ఆర్థిక సంస్కరణలపై అమితమైన ప్రేమ, ఎన్టీఆర్ సంక్షేమ పథకాలపట్ల విముఖత ఏర్పడ్డాయి. దానితో జరిగిందేమిటి? సామాన్యులకు ఇంది రమ్మ రాజ్యానికి మించి దేవునిగా మారిన ఎన్టీఆర్ పథకాలను దెబ్బ తీస్తూ పోయారు. మరొకవైపు ఆర్థిక సంస్కరణలను, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ నిర్దేశాలను కేంద్రంతో సహా మొత్తం దేశంలోనే ఏ రాష్ట్రమూ చేయనంతగా తలకెత్తుకున్నారు. తనను తాను ముఖ్యమంత్రిని కాను, ఒక కంపెనీ నిర్వాహకుని తరహా సీఈఓను అని ప్రకటించుకుని, స్వదేశంతోపాటు విదేశాలలో కూడా పెట్టుబడిదారులకు దేవునిగా మారారు. విద్యుత్ ట్యారిఫ్ పెంచి ఆందోళనాకారులపైన, రైతు వ్యతిరేక విధానాలు ప్రవేశపెట్టి రైతు ఆందోళనాకారులపైన కాల్పులు జరిపించారు. చివరకు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రపంచబ్యాంక్ అధికారులు పరిశీలించి ఆమోదించే ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల దిగ్భ్రాంతికర పరిస్థితులను తీసుకు వచ్చారు. ఇక సామాన్యులైతే ఎన్టీఆర్ సంక్షేమం అడుగంటగా ఏమీ చేయలేని దిక్కు తోచని స్థితికి లోనయ్యారు. వారు మారుమూల గ్రామాల వరకు సైతం చంద్రబాబును 'బ్యాంకు బాబు' అని పిలవ సాగారు. ఇంత జరుగుతుండినా చంద్రబాబు తనకు దేశ, విదేశీ వ్యాపార వర్గాల నుంచి వెల్లువెత్తుతుండిన ప్రశంసలతో పొంగిపోయారు. కనుకనే ఆయన 2004 ఎన్నికలలో వైఎస్ రాజశేఖరరెడ్డి చేత దారుణంగా ఓడినపుడు ప్రపంచమంతా నిర్ఘాంతపోయింది.

చంద్రబాబును ఆ విధంగా చిత్తు చేసిందెవరు? తెరముందు కన్పించింది రాజశేఖరరెడ్డి. తెర వెనుక పనిచేసింది స్వయంగా చంద్రబాబు పరిపాలనా విధానాలు, వాటి పట్ల సామాన్యుల ఆగ్రహం. ఇందుకు పరాకాష్ఠగా కన్పించిన మరొక దృశ్యాన్ని చూడండి. 2004 ఎన్నికల సమయంలో ఆయనపై అలిపిరి వద్ద నక్సలైట్లు హత్యాయత్నం చేశారు. దానివల్ల కలిగిన సానుభూతితో తను గెలిచి తీరగలడని పలువురు భావించారు. అదీగాక ఆయన అంతవరకు తీవ్ర నిర్లక్ష్యం చేసిన రైతులపై అకస్మాత్తుగా వరాలు ప్రకటించారు. కానీ ఆ



సానుభూతిగానీ, ఈ వరాలు గానీ ఓటమి నుంచి కాపాడలేక పోయాయి. చంద్రబాబు పరిపాలనా విధానాలపట్ల సామాన్యులలో పేరుకుపోయిన వ్యతిరేకత ఎంతటిదో దీనినిబట్టి గ్రహించవచ్చు.

చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాల గురించి, తనకు ముందటి కాంగ్రెస్, ఎన్టీఆర్ విధానాలతో... తన తర్వాతి రాజశేఖరరెడ్డి విధానాలతో పోల్చుతూ, ఆయా పాలనలపట్ల సామాన్య ప్రజల అభిప్రాయాలను కూడా పోల్చుతూ ఒక విధానపరమైన అధ్యయనం జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది. పైన చర్చించినదంతా ఒక స్థూలమైన చిత్రం మాత్రమే. చెప్పు పోవాలంటే ఇంకా ఎంతైనా ఉంది. అందులో ఒక ముఖ్యమైనది తన విజన్–2020 పత్రం. మొదట ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ఓటమి వల్ల ఏ విజన్లూ అమలుకు రాలేదు. కానీ అందులో పేర్కొన్న ఆయన ప్రణాళికలు అన్నీ అంతిమ సారాంశంలో సంపన్న వర్గాలకు లాభం చేకూర్చి, సామాన్యులను ఉన్న చోట ఉంచేవే. కాకపోతే ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ సిద్ధాంత కర్తలు మొదటినుంచి సూచిస్తూ వచ్చిన ట్రికిల్ డౌన్ థియరీ ప్రకారం సామాన్యులకు కొన్ని ఎంగిలి మెతుకులు విదల్చటం వంటిది మాత్రం అందులో చూడవచ్చు. సంపదలన్నీ సంపన్నులకే దోచిపెడితే సామాన్యుల నుంచి వ్యతిరేకత పెరిగి ఎదురు తిరుగుతుందని ముందే గ్రహించిన సంస్కరణల మేధావులు ట్రికిల్ డౌన్, రిఫార్మ్స్ విత్ హ్యూమన్ ఫేస్ వంటి తరుణోపాయాలను కూడా మొదటనే సిఫారసు చేశారు. ఇంకా చెప్పా లంటే ఇందుకు కాపీ రైట్ జర్మనీ మొదటి ఛాన్స్‌లర్ బిస్మార్క్ (1815–98)ది. ప్రస్తుత సందర్భంలో గమనించవలసిందేమంటే, ఈ రిఫార్మ్స్ విత్ హ్యూమన్ ఫేస్ అన్నది సంస్కరణల పట్ల ప్రజల వ్యతిరేకతను ఒక పరిమితిలో ఉంచేందుకు తప్పనిసరి అన్న ఉపాయాన్ని కొందరు పాలకులు గుర్తించి పాటించగా, బాబు వంటి వారు ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ నియంతల తరహాలో పక్కకు తోసేశారు.

తన ఈ స్వభావాన్ని చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా (2014–19) కూడా మార్చుకోలేదు. అందువల్లనే ఆయన పార్టీ గెలిచిన సీట్లు 102 (2014) నుంచి 23 (2019)కి పడిపోయాయి. అందుకు కారణం ఎవరితోనో పొత్తులు ఉండటం లేకపోవటంకాదు. నిజానికి ఆ కాలమంతా ఏపీలోని ఇతర పార్టీల బలం నామమాత్రమే. కనుక, చంద్రబాబును అంతగా పరాభవించిన కారణాలు ఆయన ప్రజా వ్యతిరేక విధానాలు, సంపన్నుల అనుకూల విధానాలు మాత్రమే. మొదలు అనుకున్నట్లు టీడీపీ అధ్యక్షుడు కేవలం తన ప్రజా వ్యతిరేకమైన సహజ స్వభావాన్ని మార్చుకోలేక 2019లో మరొకసారి మట్టికరిచారు.

ఇక రాజకీయ విధానాల విషయానికి వస్తే, చంద్రబాబు తీరు ఆయన కాంగ్రెస్‌ను వదిలి టీడీపీలో చేరినప్పటి నుంచి గత 29 సంవత్సరాలుగా కపటపూరితమైనదే. మొదట ఎన్టీఆర్ పట్ల, తర్వాత తనతో మైత్రి చేసిన కమ్యూనిస్టుల పట్ల, బీజేపీ పట్ల, కాపుల వంటి ప్రధాన కుల సమాజాల పట్ల, అల్ప సంఖ్యాక వర్గాల పట్ల, ఒక దశలో టీఆర్ఎస్ పట్ల ఆయన ఎప్పటికప్పుడు తన రాజకీయ అవసరాలను బట్టి అవకాశవాద ఎత్తుగడలను అనుసరిస్తూ వస్తున్నారు. ఎన్టీఆర్ ప్రాపకంవల్ల పైకి వచ్చి ఆయనకు ద్రోహం చేసి చివరకు మానసిక క్షోభతో మరణించేట్లు చేశారు. కమ్యూనిస్టులను టూరిజం తప్ప కమ్యూనిజం అనేదేమీ లేదని ఈసడించారు. బీజేపీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎంతెంత దూషించారో, హైదరాబాద్‌లో అడుగు పెడితే అరెస్టు చేస్తామన్నారో లెక్కలేదు. ఈ ధోరణి ఎన్డీయే నుంచి బయటకు వచ్చి, ఇటీవల మళ్లీ ప్రవేశం కొరకు తాపత్రయ పడటం వరకు కొనసాగింది. కాపుల వంటి సమూహాలను ఎప్పుడూ చదరంగంలో పావులుగానే చూశారు.

చంద్రబాబు రాజకీయ విధానాలకు ప్రస్తుత ఎన్నికల సమయంలో మరొకమారు సామాన్యుల నుంచి ప్రశ్నార్థకత ఎదురవుతున్నది. జగన్ మోహన్ రెడ్డి పరిపాలన తను విమర్శిస్తున్నట్లు నిజంగానే అభివృద్ధి వ్యతిరేకంగా ఉన్నట్లయితే ఆయన జనసేన, బీజేపీలతో పొత్తు కోసం నెలల తరబడి అంతగా ఎందుకు వెంపర్లాడినట్లు? ఒక్క మాటలో చెప్పాలంటే, మూడు సుదీర్ఘ దశాబ్దాలుగా బాబుతో సమస్యంతా ఆయన విధానాలతోనే!

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆగదు పోరాటం



నా ప్రియమైన హిందూ అన్నా చెల్లెల్లారా! చాలాకాలంగా నా సొంత చిన్న మార్గాల్లో ప్రయత్నిస్తూనే ఉన్నాను; కానీ బదాయూ (ఉత్తరప్రదేశ్) ఘోరం (ఇద్దరు పిల్లల్ని గొంతుకోసి చంపిన ఘటన) నన్ను దారుణంగా కలచివేసింది. మన పిల్లలు ఆయుష్, అహాన్‌ల సాక్షిగా చెబుతున్నాను, నా జీవితాంతం మతోన్మాదుల నుంచి మిమ్మల్ని కాపాడేందుకు పోరాడుతూనే ఉంటాను.

– అంబ్రీన్ జైదీ, రచయిత్రి

మార్పు మంచిదేనా?



కతువా (జమ్ము) రేపిస్టులను 2018లో సమర్థించిన బీజేపీ నాయకుడు లాల్ సింగ్ ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరారు. కతువా అత్యాచార బాధితులకు మద్దతుగా నిలిచినందుకు బీజేపీ, రైట్‌వింగ్ తిట్లు, ట్రోలింగ్ ఎదుర్కొన్న శెహ్లా రషీద్ (యాక్టివిస్ట్) అనధికారికంగా బీజేపీలో చేరారు.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

తప్పలేదు



సంగీత కళానిధి అవార్డును తిరిగి ఇచ్చేస్తున్నాను. మూల సూత్రాలకే ప్రమాదం వాటిల్లుతున్నందున చాలా జాగ్రత్తగా అన్నీ పరిగణించి ఈ నిర్ణయం తీసుకున్నాను. (మద్రాసు మ్యూజిక్ అకాడమీ టి.ఎం. కృష్ణకు సంగీత కళానిధి అవార్డు ఇస్తున్నందుకు నిరసనగా.)

– చిత్రవీణ రవికిరణ్, సంగీతకారుడు

అక్కడా ఇదే తినాలా?



నేనొక ట్రిప్‌కు వెళ్లాల్సి ఉంది. కచ్చితంగా ఇండియన్ ఫుడ్ వడ్డిస్తామనే చోటే ట్రావెల్ ఏజెంట్లు హోటళ్లు బుక్ చేస్తున్నారు. నాకు విదేశంలో కూడా ఇండియన్ ఫుడ్ వద్దని వారిని ఒప్పించలేకపోతున్నా.

– రీతూపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్

భావజాల పోరు



దీనికి సంగీతంతో, టి.ఎం. కృష్ణ ప్రతిభతో సంబంధం లేదు. ఇది పూర్తిగా భావజాల పోరాటం. గాయక సోదరీమణులైన రంజని – గాయత్రి రాజకీయాలను కొన్నేళ్లుగా గమనిస్తున్న వాళ్లకు ఇదేమీ ఆశ్చర్యం కలిగించదు. (మద్రాస్ మ్యూజిక్ అకాడెమీలో తమ ప్రదర్శనను వాళ్లు రద్దు చేసుకున్నారు.)

– రాధికా సంతానం, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

భగవంతుడు సమాధానం చెప్పాలి?

''ఈ భూమినీ, ఈ ప్రపంచాన్నీ సృష్టించిన ఒక సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి, భగవంతుడు ఉన్నాడని మీరు నమ్ముతున్నారు. అలా అయితే దానిని ఆయన ఎందుకు సృష్టించాడో చెప్పగలరా? ఈ ప్రపంచంలో ప్రజలు పేదరికంతో, రకరకాల కష్టాలతో, బాధలతో అనేక అత్యాచారాలకు గురవుతూ జీవిస్తున్నారు. ఎవ్వరూ తృప్తిగా జీవించడం లేదు. దయచేసి ఆయనకున్న శాసనాలకు లోబడి చేస్తున్నాడని అనబోకండి. ఆయనే గనుక కొన్ని శాసనాలకు కట్టుబడి ఉండవలసిన వాడైతే ఆయన కూడా ఒదిగి ఒదిగి వుండవలసిన బానిస మాత్రమే కాగలడు. ఇలా జనాన్ని బాధపెట్టడం ఆయనకు సరదా అని అనబోకండి. నీరో చక్రవర్తి రోమ్ నగరాన్ని తగులబెట్టించాడు. నీరో పరిమిత సంఖ్యలోనే ప్రజలను హతమార్చాడు. అనేక విషాదాలను తన చిద్విలాసం కోసమే ఆయన జరిపించాడు. మరి అలాంటి నీరో చక్రవర్తి స్థానం చరిత్రలో ఏమిటి? చరిత్రకారులు ఆయనను ఏ పేరుతో పిలుస్తారు?... నీరో చక్రవర్తి పరమ నిరంకుశుడు, హృదయం లేని పరమ క్రూరుడు అని చరిత్ర పుటల నిండా వర్ణించబడ్డాడు.

ఇక చెంఘిజ్ ఖాన్ క్రూరమైన సంతోషం కోసం వేలమందిని హతమార్చాడు. చెంఘిజ్ ఖాన్ పేరు చెబితేనే మనకు ఒళ్లు మండుతుంది. అత్యంత ద్వేషం, అసహ్యం కలుగుతుంది. అలాంటప్పుడు ప్రపంచంలోని అశేష ప్రజల జీవితాలనే దుఃఖభాజనం చేసే దేవుణ్ణి, ప్రతిరోజూ, ప్రతి గంట, ప్రతి నిమిషం కష్టాలతో, విషాదాలతో వారి జీవితాలను అధోగతి పాల్జేసే దేవుణ్ని, ఈనాటికీ వారిని కష్ట సముద్రాల్లో నిత్యమూ ముంచుతున్న దేవుణ్ణి మనం ఏమనాలి? చెంఘిజ్ ఖాన్, నీరో చక్రవర్తి ఎప్పుడో ఒకసారి చేసిన దానికంటే దేవుడు ఈ ప్రపంచంలోని ప్రజలను నిత్యమూ కష్టాలకు, బాధలకు అత్యాచారాలకు గురి చేస్తున్నప్పుడు ఆయనను ఎలా పూజించాలి? ఎలా కొలవాలి? మీకు నా సూటి ప్రశ్న ఇది. ఇంచుమించు నరకప్రాయంగా వున్న ఈ ప్రపంచాన్ని ఆయన ఇలా ఎందుకు సృష్టించాలి? ఎల్లప్పుడూ మానవులకు ఆవేదనలనూ, అశాంతినీ కలుగజేసే విధంగా ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాలి. ఆయన చేసిన పనిని మనం ఎలా సమర్థించగలం? ఇదంతా ఆయన ఆనందానికే అయితే, నీరో చక్రవర్తికీ, భగవంతుడికీ ఏమిటీ తేడా?



భగత్ సింగ్

చెరసాలలో మగ్గేవాళ్లు, ఆకలి మంటలతో అలమటించేవాళ్లు లక్షలాది కోట్లాది ప్రజలు ఈ ప్రపంచంలో ఉన్నారు. దోపిడీ చేయబడుతున్న కష్టజీవులు, కార్మికులు, అభాగ్యులు, దీనులు, హీనులు ఉన్నారు. వీరంతా తమ రక్తాన్ని స్వేదంగా మారుస్తున్నారు. ఈ రక్తాన్ని పిండి పెట్టుబడిదారీ వర్గాలు రాబందుల వలె, జలగల వలె వీరిని పీలుస్తూ సంపన్నులవుతున్నారు... అవసరమైతే తమ లాభాల రక్షణ కోసం, నిల్వపడి వున్న సరుకులను, ఆహార ధాన్యాలను సముద్రం పాలు చేస్తున్నారు. ఆకలితో మలమల మాడే కోటాను కోట్ల ప్రజలకు ఈ ఆహార ధాన్యాలను, పాల డబ్బాలను, బట్టలను తదితర జీవితావసర వస్తువులను పంచిపెట్టరు. వారందరూ దారిద్ర్యంతో కడుపునిండా తిండిలేక, బట్టలేక, ఇల్లులేక ఎందుకు అలమటించాలి? దీనికి భగవంతుడు ఏమి సమాధానం చెబుతాడు? ఇలా ఎందుకు జరుగుతున్నది? ఇలా ఒకవైపున జరుగుతూ వుంటే నా సృష్టి అంతా సవ్యంగా ఉన్నదని భగవంతుడు ఎలా అనగలడు? దీనికి ఆయన ఏమైనా సమాధానం చెప్పగలడా? మౌనమే సమాధానమా?''

– ఎమ్.డి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్

(రేపు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా 'నేనెందుకు నాస్తికుడినయ్యాను' అనే భగత్ సింగ్ పుస్తకం నుంచి)

జల గండం గట్టెక్కేదెలా?

మనకు అందుబాటులో ఉండే మంచి నీటిలో 90 శాతాన్ని వ్యవసాయం కోసమే వాడుతున్నాం. మిగతా పది శాతాన్ని తాగటానికి, పారిశ్రామిక అవసరాలకు వాడుకుంటున్నాం. అయినా, సాగు భూమిలో 24 శాతం విస్తీర్ణానికి మాత్రమే నీటి పారుదల సదుపాయం ఉంది. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయోత్పత్తుల దిగుబడిలో 40 శాతం సాగునీటి సదుపాయం ఉన్న భూముల ద్వారానే అందుతోంది.

నానాటికీ భూతాపం పెరుగుతున్న నేపథ్యంలో నీటిపారుదల సదుపాయాన్ని మరింత విస్తరింప జేసుకోవడానికి వ్యవసాయక దేశాలు ప్రయత్నించటం సహజమే. అయితే, ఈ విస్తరణ ఆహార అవసరాల కోసమే అయినప్పటికీ అది పర్యావరణ అస్థిరతకు దారితీయకుండా ఉండేలా చూసుకోవాలన్నది నిపుణుల మాట. కాని, ఇందుకు భిన్నంగా జరుగుతోంది. ఇప్పటికే నీటి వనరులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న ప్రాంతాల్లోని నదుల్లో పారే నీటిని ప్రకృతి అవసరాల కోసం, మనుషుల ఇతర అవసరాల కోసం మిగల్చకుండా దాదాపు మొత్తాన్నీ వ్యవసాయానికే మళ్లించటం వంటి అస్థిర నీటి విస్తరణ కార్యకలాపాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది.

తాజా అధ్యయనం హెచ్చరిక

243 దేశాల ఇరిగేషన్ ప్రాజెక్టుల గణాంకాలపై అమెరికా, జర్మనీ, ఫిన్లాండ్, చైనాకు చెందిన పరిశోధకులు చేసిన తాజా అధ్యయనం ప్రకారం... 21వ శతాబ్దం తొలి (2000 – 2015 వరకు) 15 ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా సాగునీటి పారుదల 11 శాతం మేరకు విస్తరించింది. 2000–2015 మధ్యకాలంలో 29.7 కోట్ల హెక్టార్ల నుంచి 33 కోట్ల హెక్టార్లకు పెరిగింది. భారత్, చైనాల్లో ఈ విస్తరణ ఎక్కువగా ఉంటే, రష్యాలో తగ్గటం విశేషం.

ఆహారోత్పత్తిలో స్వావలంబన సాధించే లక్ష్యంతో భారీ నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించటం ద్వారా చైనా కోటి 28 లక్షల హెక్టార్లలో, భారత్ 85 లక్షల హెక్టార్లలో సాగు భూమికి ఈ 15 ఏళ్లలో అదనంగా నీటిపారుదల సదుపాయాన్ని విస్తరింప చేసుకున్నాయి. అయితే, అప్పటికే నీటి వనరులపై తీవ్ర ఒత్తిడి ఉన్న ఈ దేశాల్లో ఈ సరికొత్త డ్యామ్‌ల నిర్మాణం వల్ల నదుల్లో జల ప్రవాహం, భూగర్భజలాలపై ఒత్తిడి మరింత పెరిగిందని ఈ అధ్యయనం చెబుతోంది.

బ్రెజిల్ 34 లక్షల హెక్టార్లలో అదనంగా నీటిపారుదల సదుపాయాలు కల్పించగా,



ఇందులో 96 శాతం విస్తీర్ణం జల వనరుల లభ్యత సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో ఆ పని చేసింది. ఫ్రాన్స్ 88 శాతం, ఇటలీ 85 శాతం, పెరు 94 శాతం, ఇండోనేషియా 76 శాతాలతో సుస్థిర నీటిపారుదల విస్తరణలో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

జలవనరులు ఇప్పటికే తీవ్ర ఒత్తిడికి గురవుతున్న ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులు నిర్మిస్తే... అప్పటికే నీటిపారుదల సదుపాయం ఉన్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత కొరవడి ఆహారోత్పత్తి కూడా అనిశ్చితికి గురవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పర్యావరణ సంక్షోభ పరిస్థితులే రాష్ట్రాలు, ప్రాంతాలు, దేశాల మధ్య జల జగడాలకు అగ్గి రాజేస్తున్నాయి.

వ్యవసాయంలో నీటి వినియోగం ఎక్కువగా ఉండటానికి ఒక ముఖ్య కారణం రసాయనిక పారిశ్రామిక వ్యవసాయ పద్ధతేనని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది. చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు చేసిన గత 14 నెలల కాలం నీటి విపత్తు నుంచి బయటపడాలంటే సాగు పద్ధతి మార్చుకోవాల్సిందేనని హెచ్చరిస్తోంది. ప్రకృతికి అనుగుణమైన సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించటం ద్వారా 50 శాతం సాగు నీటి అవసరాలను క్షేత్రస్థాయిలో తగ్గించవచ్చని తేల్చిచెప్తున్న సుసంపన్న క్షేత్రస్థాయి అనుభవాలు మన ముందున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల భాగస్వామ్యంతో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతే ఇందుకు ప్రబల ఉదాహరణ. సగానికి సగం నీటి వినియోగం తగ్గటంతో పాటు... అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల్ని తట్టుకోవటంలోనూ, రైతుల నికరాదాయాన్ని పెంచటంలోనూ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు తలెత్తుకొని నిలుస్తున్న ఉదంతాలు కూడా మనకు తెలుసు.

ప్రోత్సాహం అవశ్యం

వ్యక్తిగత శ్రద్ధ, శారీరక శ్రమ అదనంగా అవసరమయ్యే ప్రకృతి వ్యవసాయం వైపు ఎక్కువ మంది రైతులు ఆకర్షితులవ్వాలంటే పాలకులు మరింత తెలివైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఈ రైతులకు నేరుగా ప్రత్యేక ఆర్థిక ప్రోత్సాహం అందించాలి. రసాయనాల్లేకుండా పండించిన ఆహారోత్పత్తులకు గ్రామస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు ప్రత్యేక విశ్వసనీయమైన మార్కెటింగ్ వ్యవస్థను నిర్మించటం ద్వారా వినియోగదారులకు అందుబాటులోకి తేవాలి. అప్పుడే ప్రకృతి సేద్యం తామరతంపర అవుతుంది. 'క్లైమెట్ ఎమర్జెన్సీ'నీ, దుర్భిక్షాన్నీ, పౌష్టికాహార లోపాన్నీ దీటుగా ఎదుర్కోవటానికి మన దేశానికి పునరుజ్జీవన సేద్యం అత్యవసరమే కాదు, అనివార్యం కూడా!

– పంతంగి రాంబాబు, సీనియర్ జర్నలిస్టు

సుఖమే దుఃఖం

దహింప బడతాను అని తెలియక పురుగు అగ్నిలో పడి చస్తుంది. చస్తాను అని తెలియక గాలానికి ఉన్న ఎరను తిని చేప తన ఆయుష్షు పోగొట్టుకుంటుంది. కానీ మనం మాత్రం తెలిసి తెలిసి కొన్ని వ్యామోహాలలో చిక్కుకొని, కొన్ని తప్పుదారుల్లో నడిచి వినాశనం కొని తెచ్చుకుంటాం. తరచి చూస్తే మనం ఏవి సుఖాలని వెంట పడతామో అవే అసలు దుఃఖాలుగా గ్రహించే సరికి జీవితం ముగిసిపోతుంది.



ముసలితనం పెద్దపులి వలె భయపెడుతూ మనపై పడుతుంది. రోగాలు శత్రువుల్లా శరీరాన్ని కబళిస్తాయి. రంధ్రం పడిన కుండలోని నీరులా ఆయువు తరిగిపోతుంది. 'లోకం శోక హతం చ సమస్తం' అని తెలిసినప్పటికీ ఆశాపాశంతో జీవితం ముడిపడి మనం తప్పు దారిని విడవడం లేదు. మనకు కోరికలు తీరుతున్న కొద్దీ ఇంకా ఇంకా అనుభవించాలి, పొందాలి అనే తృష్ణ ఏర్పడుతుంది. తృష్ణను పారద్రోలి తృప్తిని పెంచుకున్న మానవుడు నిత్యానందాన్ని అనుభవిస్తాడు.

సంతృప్తిని మించిన సౌభాగ్యం లేదు. 'తృప్తిని పొందని మనుజుడు సప్త ద్వీప ములనైన చక్కం బడడు' అని పోతన చెప్పారు.

భక్తి, సజ్జన సాంగత్యం మాత్రమే మనిషికి సంతృప్తినీ, శాంతినీ ఇవ్వగలవు.

– ధనిష్ఠ

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.త్రయోదశి పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** మఖ తె.4.46 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.3.35 నుండి 5.19 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.29 నుండి 9.17 వరకు, తదుపరి ప.12.32 నుండి 1.20 వరకు, **అమృతఘడియలు:** రా.2.10 నుండి 3.56 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.07, **సూర్యాస్తమయం:** 6.07.

క్లుప్తంగా...

కొత్త గవర్నర్‌కు శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నూతన గవర్నర్‌గా (అదనపు బాధ్యతలు) నియమితులైన సీపీ రాధాకృష్ణన్‌కు బీజేపీ నేత, పార్టీ తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకరరెడ్డి దంపతులు శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలుసుకున్న పొంగులేటి దంపతులు ఆయనను శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. గవర్నర్‌గా ఆయన పదవీకాలం విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఆకాంక్షిస్తూ మాస్టర్స్ బుక్ వరల్డ్ ముద్రించిన ఆధ్యాత్మిక పుస్తకాలను రాధాకృష్ణన్‌కు అందజేశారు. గురువారం పొంగులేటి పుట్టినరోజు కావడంతో ఆయనకు గవర్నర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశాలివ్వాలి


దాసు సురేశ్

సాక్షి, హైదరాబాద్: ప్రజా పోరాటాల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన ప్రజాఉద్యమ సంఘాలు, సివిల్ సొసైటీ నేతలకు, కాంగ్రెస్ నేతలతో సమానంగా నామినేటెడ్ పదవులలో అవకాశాలివ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ కోరారు. ఈ మేరకు గురువారం బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను దాసు సురేష్ నేతృత్వంలోని బృందం కలిసి విన్నవించింది. తెలంగాణలో పదవులన్నీ ఒకే సామాజికవర్గానికి పరిమితం అవుతున్నాయని సురేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, బీసీల నాయకత్వపు ఎదుగుదలకు సహకరించాలని కోరారు.


రైతులకు నష్ట పరిహారమివ్వాలి


తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరి హారమివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మి నేని వీరభద్రం డిమాండ్ చేశారు. చేతి కొచ్చిన పంట నీళ్ల పాలు కావడంతో రైతులు నష్టపోయారని గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంట వివరాలు సేకరించి రైతులకు ఎకరాకు రూ.20 వేల పరి హారం చెల్లించాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వలేదని విమర్శించారు.

కరెంట్ కొంటారా .. లేదా ?

- 2,400 మెగావాట్ల రెండో విడత థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుపై ఎన్టీపీసీ అల్టిమేటం
- విద్యుత్ కొనుగోలుపై నాన్చివేత ధోరణిలో రాష్ట్రం
- గత ఫిబ్రవరి 10తోనే ముగిసిన గడువు
- సీఎంఓ పరిశీలనలోనే ప్రతిపాదనలు



సాక్షి, హైదరాబాద్: రామగుండంలోని రెండో థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ కొనుగోలు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నాన్చివేత ధోరణిపై నేషనల్ థర్మల్ పవర్‌కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్టీపీసీ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు సమ్మతి తెలపకుంటే తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాలకు ఆ విద్యుత్‌ను సరఫరా చేస్తామని హెచ్చరించింది. రెండో విడత విద్యుత్ కేంద్ర నిర్మాణంలో పురోగతిపై సమాచార హక్కుచట్టం కింద జర్నలిస్టు ఇనగంటి రవికుమార్ వివరాలు కోరగా, ఎన్టీపీసీ ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించింది. ఎన్టీపీసీ విధించిన గడువు ముగిసినా, ఇంకా రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలియజేయలేదు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఇంధనశాఖ నుంచి వెళ్లిన ప్రతిపాదనలు ముఖ్యమంత్రి కార్యాలయ పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది.

మూడు లేఖలు రాసినా స్పందించని రాష్ట్రం

తెలంగాణలో విద్యుత్ కొరత తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పునర్విభజన చట్టం–2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద రామగుండంలో 1600(2X800) మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఉంటేనే కొత్త విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి బ్యాంకులు రుణాలు అందిస్తాయి. తొలి విడత ప్రాజెక్టులోని 1600 మెగావాట్ల విద్యుత్‌లో 85 శాతం కొనుగోలు చేసేందుకు తెలంగాణ డిస్కంలు రాష్ట్రం ఏర్పడిన కొత్తలో ఎన్టీపీసీతో ఒప్పందం(పీపీఏ) చేసుకున్నాయి. ఈ ఒప్పందం ఆధారంగానే బ్యాంకుల నుంచి రుణాలు సమీకరించి తొలి విడత విద్యుత్ కేంద్రాన్ని ఎన్టీపీసీ నిర్మించింది. రెండో విడత కింద 2400 (3X800) మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి పనులు ప్రారంభించడానికి ఎన్టీపీసీ సన్నాహాలు చేస్తోంది. ఇందుకు అవసరమైన రుణాల సమీకరణకు విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ గతేడాది అక్టోబర్ 5న లేఖ రాసింది. స్పందన లేకపోవడంతో మళ్లీ గత జనవరి 9న రెండోసారి లేఖ రాసింది. అయినా స్పందన లేకపోవడంతో జనవరి 29న మూడోసారి రాసిన లేఖలో 12రోజుల్లోగా అనగా, గత ఫిబ్రవరి 10లోగా సమ్మతి తెలపాలని అల్టిమేటం జారీ చేసింది. సమ్మతి తెలపని పక్షంలో తెలంగాణ రెండో విడత ప్రాజెక్టు నుంచి విద్యుత్ కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా లేదని భావించి ఇతరులకు ఆ విద్యుత్ సరఫరా చేస్తామని స్పష్టం చేసింది. తెలంగాణ ఆసక్తి చూపిస్తే తొలి ఏడాది యూనిట్‌కు రూ.4.12 చొప్పున విద్యుత్ విక్రయిస్తామని తెలిపింది. దేశంలో గణనీయంగా పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టు విద్యుదుత్పత్తి సామర్థ్యం పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని, సత్వరంగా ఒప్పందం చేసుకోవాలని సూచించింది.

రెండో విడత ప్రాజెక్టుకు సంబంధించిన ఫీజిబిలిటీ రిపోర్టుకు ఆమోదం లభించిందని, టెక్నికల్ స్టడీ పురోగతిలో ఉందని ఎన్టీపీసీ తెలిపింది. ఎల్లంపల్లి బ్యారేజీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నీటి కేటాయింపులు చేసిందని వెల్లడించింది. శక్తి పాలసీ కింద ఈ ప్రాజెక్టుకు సింగరేణి బొగ్గు కేటాయిస్తూ గత జనవరి 3న స్టాండింగ్ లింకేజీ కమిటీ నిర్ణయం తీసుకుందని చెప్పింది. 1600 మెగావాట్ల తొలి విడత ప్రాజెక్టు నిర్మాణానికి గత జనవరి 31 వరకు రూ.11,572 కోట్లు ఖర్చు చేసినట్టు పేర్కొంది.

తొలి విడత ప్రాజెక్టు వ్యయం రూ.11,572 కోట్లు

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య


ప్రశాంత్

ఐనవోలు: అప్పుల బాధతో ఓ యువ కౌలురైతు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో గురువారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. బరిగెల ప్రశాంత్ (28) 7 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి సాగు చేస్తున్నాడు. అయితే పంటలు సరిగా పండక పోవడంలో సుమారు రూ.15 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడులు తగ్గుతాయని బాధపడుతూ ఉండేవాడు. అప్పులు తీర్చే మార్గం లేదని తీవ్ర మనస్తాపానికిగురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చిన అతని భార్య, తల్లి.. తలుపు గడియ పెట్టి ఉండటంతో కిటికీ తలుపులు తెరిచి చూశారు. లోపల ప్రశాంత్ ఉరి వేసుకుని ఉన్నట్లు గుర్తించి తలుపులు తొలగించారు. వెంటనే ప్రశాంత్‌ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చే ఖరీఫ్ నుంచి పంటలకు బీమా

- వడగళ్లతో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకుంటాం
- నష్టపరిహారం కింద ఎకరాకు రూ.10 వేలు చెల్లిస్తాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు


పంటనష్టంపై రైతును వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి జూపల్లి. చిత్రంలో షబ్బీర్ అలీ తదితరులు

ఖలీల్‌వాడి/నిజామాబాద్ /కామారెడ్డి నెట్‌వర్క్: వచ్చే ఖరీఫ్ నుంచి పంటలకు బీమా అమలు చేస్తామని, ప్రీమియం డబ్బులను ప్రభుత్వమే చెల్లిస్తుందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గురు వారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, వడగళ్ల వానలతో పంటలు దెబ్బ తిన్న రైతులను ఆదుకుంటామన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 40 వేల ఎకరాల వరకు నష్టం జరిగిందన్నారు. అధికారులు సర్వే పూర్తి చేసిన తర్వాత ఎకరానికి రూ.10 వేలు నష్ట పరిహారం అందిస్తామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రుణమాఫీ, మహిళలకు జీరో వడ్డీ, దళితులకు మూడెకరాల పంపిణీ వంటి హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాలను అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుగిస్తే బీఆర్ఎస్ సర్కార్ రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. వీటికి రూ.60 వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందన్నారు. దీనికోసం మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మహా అయితే ఒక సీటు రావొచ్చునని అన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడవద్దు : వడగళ్ల వానలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని కొండూర్, పెద్దవాల్గోట్ గ్రామాలు, కామారెడ్డి జిల్లాలోని దోమకొండ మండలం లింగుపల్లి, భిక్కనూరు మండలం అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, జంగంపల్లి, బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామాల్లో పర్యటించారు. వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

అలంపూర్ ఎమ్మెల్యే విజయుడికి హైకోర్టు నోటీసులు

- ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ

సాక్షి, హైదరాబాద్: అలంపూర్ ఎమ్మెల్యే విజయుడి ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌లో ఆయనకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 18కు వాయిదా వేసింది. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం బరిలో ప్రధాన అభ్యర్థులుగా బీఆర్ఎస్ నుంచి విజయుడు, కాంగ్రెస్ నుంచి సంపత్‌కుమార్, బీఎస్పీ నుంచి ప్రసన్నకుమార్ పోటీ చేశారు. ఎన్నికల్లో 30,573 ఓట్ల మెజారిటీతో విజయుడు గెలుపొందారు. అయితే విజయుడి ఎన్నికను సవాల్ చేస్తూ ప్రసన్నకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'ఉండవల్లి మండలం పుల్లూర్ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విజయుడు రాజీనామా చేయకుండానే అలంపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌లో ఎక్కడా తాను ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశానని పేర్కొనలేదు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వంలో పనిచేసిన వారు ఎవరైనా ఆ వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనాలి. విజయుడి ఎన్నిక చెల్లదని ప్రకటించాలి. ఆ మేరకు ఈసీకి ఆదేశాలు జారీ చేయాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. వివరాలు పరిశీలించిన న్యాయమూర్తి.. విజయుడికి నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. ఎన్నికలకు ముందు కూడా విజయుడి నామినేషన్‌ను తిరస్కరించాలని ప్రసన్నకుమార్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే అప్పటికే నోటిఫికేషన్ రావడంతో.. ఈ దశలో ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని ప్రధాన న్యాయమూర్తి బెంచ్ స్పష్టం చేసింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ప్రతివాది (విజయుడు) విజయం సాధిస్తే.. దాన్ని సవాల్ చేసుకోవచ్చని చెబుతూ ప్రసన్నకుమార్ పిటిషన్‌లో వాదనలను ముగించింది. దీంతో ప్రసన్నకుమార్ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు.

ఇళ్ల మధ్యలోని బార్‌ను తరలించండి

- హైకోర్టు సీజేకి విద్యార్థిని లేఖ
- వివరణ ఇవ్వాలని సర్కారుకు న్యాయస్థానం నోటీసులు



సాక్షి, హైదరాబాద్: తమ నివాసాల మధ్య నుంచి బార్ అండ్ రెస్టారెంట్‌ను తరలించాలన్న హయత్‌నగర్‌కు చెందిన 6వ తరగతి విద్యార్థిని అభ్యర్థనపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ.. నాలుగు వారాల్లోగా స్పందించాలని స్పష్టం చేసింది. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, హోం శాఖల ముఖ్య కార్యదర్శులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు మరికొందరు అధికారులకు నోటీసులు జారీ చేసింది. హయత్‌నగర్‌లోని నివాస ప్రాంతాల నుంచి బార్ అండ్ రెస్టారెంట్‌ను మార్చాలని వనస్థలిపురంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థిని వైష్ణవి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి గత నెలలో లేఖ రాసింది. వివిధ విద్యాసంస్థలు, వృద్ధాశ్రమం, దేవాలయాల మధ్యలో ఉన్న సాయి యువ బార్ అండ్ రెస్టారెంట్ వల్ల ప్రశాంతతకు తీవ్ర భంగం కలుగుతోందని పేర్కొంది. ఈ లేఖను హైకోర్టులో పిల్‌గా విచారణకు స్వీకరించింది. పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. లేఖలోని అంశాలపై వివ రణ ఇవ్వాలని అధికారులను ఆదే శిస్తూ, విచారణ వాయిదా వేసింది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు


గురువారం రాత్రి కేజ్రీవాల్ నివాసంలో ఈడీ అధికారులు


కేజ్రీవాల్ నివాసం వెలుపల ఆప్ శ్రేణుల ఆందోళన


కేజ్రీవాల్ నివాసం వద్ద మోహరించిన భద్రతా బలగాలు

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్

▶ మొదటి పేజీ తరువాయి
పరిణామాలు చకచకా జరిగిపోయాయి. తొలుత అదనపు డైరెక్టర్ నేతృత్వంలో 10 మంది ఈడీ అధికారులు సెర్చ్ వారెంట్‌తో ఢిల్లీ ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని కేజ్రీవాల్ అధికారిక నివాసానికి చేరుకున్నారు. రెండున్నర గంటలపాటు ప్రశ్నించారు. కేజ్రీవాల్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లను సీజ్ చేశారు. అనంతరం రాత్రి 9.11 గంటలకు ఆయనను అరెస్టు చేశారు. రాత్రి 11 గంటలకు తమ ప్రధాన కార్యాలయానికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. కేజ్రీవాల్‌ను శుక్రవారం ఉదయం కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకొని, విచారణ జరపాలని ఈడీ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. కేజ్రీవాల్ అరెస్టు సమాచారాన్ని ఆయన భార్యకు తెలియజేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో సిట్టింగ్ ముఖ్యమంత్రి అరెస్టు కావడం సంచలనాత్మకంగా మారింది. ఇదే కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవితను గతవారం ఈడీ అధికారులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

కేజ్రీవాల్ నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత
కేజ్రీవాల్ అరెస్టు సందర్భంగా ఆయన నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కేజ్రీవాల్‌కు అనుకూలంగా, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేజ్రీవాల్ నివాసం చుట్టూ ఢిల్లీ పోలీసులతోపాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మోహరించారు. స్థానికంగా 144 సెక్షన్ విధించారు. నినాదాలు చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.



హైకోర్టు ఉత్తర్వుపై సుప్రీంకోర్టుకు కేజ్రీవాల్
లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్‌కు ఈడీ ఇప్పటిదాకా తొమ్మిది సార్లు సమన్లు జారీ చేసింది. ఒక్కసారి కూడా ఆయన విచారణకు హాజరుకాలేదు. గురువారం కూడా విచారణకు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ రాలేదు. తనకు సమన్లు జారీ చేయడం చట్టవిరుద్ధమని ఆయన చెప్పారు. ఈడీ తనను అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, ఊరట దక్కలేదు. అరెస్టు చేయకుండా రక్షణ కల్పించలేమని హైకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును వ్యతిరేకిస్తూ ఆయన వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేశారు. గురువారం రాత్రే అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. ఇంతలోనే అరెస్టయ్యారు. కేజ్రీవాల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. లిక్కర్ స్కామ్‌లో ఈడీ గతంలో దాఖలు చేసిన చార్జిషీట్లలో కేజ్రీవాల్ పేరును అధికారులు పలుమార్లు ప్రస్తావించారు.

జైలు నుంచే పరిపాలన!
కేజ్రీవాల్ అరెస్టు అయినప్పటికీ ఢిల్లీ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, అవసరమైతే జైలు నుంచే పరిపాలన కొనసాగిస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత అతీషి ప్రకటించారు. కేజ్రీవాల్‌ను చూసి ప్రధాని నరేంద్ర మోదీ భయపడుతున్నారని, అందుకే లోక్‌సభ ఎన్నికల ముందు అక్రమంగా జైలుకు పంపించడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. సరిగ్గా ఎన్నికల సమయంలోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం వెనుక పెద్ద కుతంత్రం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా విమర్శించారు. కేజ్రీవాల్ అరెస్టును తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఖండించారు. ప్రతిపక్ష నేతలను మోదీ ప్రభుత్వం వేధిస్తోందని మండిపడ్డారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికం, దిగజారుడుతనానికి నిదర్శనమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆక్షేపించారు. మరోవైపు, లిక్కర్ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి పదవికి కేజ్రీవాల్ వెంటనే రాజీనామా చేయాలని, దర్యాప్తునకు సహరించాలని ఢిల్లీ బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

అరెస్టయిన మొట్టమొదటి సిట్టింగ్ సీఎం
దేశంలో ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ అరెస్టయిన మొట్టమొదటి సిట్టింగ్ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కావడం గమనార్హం. గతంలో బిహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సైతం పదవిలో ఉండగానే అరెస్టయ్యారు. కానీ, దర్యాప్తు సంస్థలు కస్టడీలోకి తీసుకోవడం కంటే ముందే తమ పదవికి రాజీనామా చేశారు. కేజ్రీవాల్ మాత్రం ఇంకా రాజీనామా చేయలేదు.

ఏమిటీ కుంభకోణం?

➤ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం 2021 నవంబర్‌లో నూతన మద్యం విధానాన్ని(పాలసీ) ప్రవేశపెట్టింది. ఈ విధానం ప్రకారం.. లిక్కర్ రిటైల్ విక్రయాల నుంచి ప్రభుత్వం తప్పుకుంది. మద్యం దుకాణాలను నడపడానికి ప్రైవేట్ లైసెన్స్‌దారులకు అనుమతులు ఇచ్చింది. దీనివల్ల లిక్కర్ బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని, ప్రభుత్వ ఆదాయం భారీగా పెరుగుతుందని అరవింద్ కేజ్రీవాల్ సర్కారు ప్రకటించింది.

➤ కొత్త పాలసీ కింద మద్యం దుకాణాలను అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా.. తెల్లవారుజామున 3 గంటల వరకు తెరిచి ఉంచవచ్చు. మద్యంపై ప్రైవేట్ లైసెన్స్‌దారులు అపరిమితమైన డిస్కౌంట్ ప్రకటించవచ్చు. వినియోగదారులకు అకర్షణీయమైన ఆఫర్లు ఇవ్వొచ్చు. లిక్కర్ హోం డెలివరీ కూడా చేయొచ్చు. ఇవన్నీ మద్యం అమ్మకాలు పెంచుకోవడానికి ఉద్దేశించినవే. కొత్త పాలసీ వల్ల లిక్కర్‌పై ఆదాయం 27 శాతం పెరిగిందని, రూ.8,900 కోట్ల రాబడి వచ్చిందని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది.

➤ కేజ్రీవాల్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. నివాస గృహాల మధ్య విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారని, ఢిల్లీకి లిక్కర్ సంస్కృతిని తీసుకొచ్చారని బీజేపీ నాయకులు ఆరోపించారు.



➤ కొత్త మద్యం విధానంలో చాలా ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని, ప్రైవేట్ లైసెన్స్‌దారులకు అనుచిత ప్రయోజనాలు కలిగించారని స్పష్టం చేస్తూ 2022 జూలైలో ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్ ఒక నివేదిక విడుదల చేశారు. కోవిడ్–19 వ్యాప్తి సమయంలో ప్రైవేట్ వ్యాపారులకు ప్రభుత్వం రూ.144 కోట్ల మేర లైసెన్స్ ఫీజు మినహాయింపు ఇచ్చిందని వెల్లడించారు.

➤ చీఫ్ సెక్రెటరీ నివేదికపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్పందించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీపై సీబీఐ విచారణ జరపాలంటూ సిఫార్సు చేశారు. తమపై వస్తున్న ఆరోపణలను ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కొట్టిపారేశారు. తర్వాత కొన్ని రోజులకే నూతన లిక్కర్ పాలసీని కేజ్రీవాల్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. 400 మద్యం దుకాణాలు మూతపడ్డాయి. ఢిల్లీలో మద్యం విక్రయాలు మళ్లీ ప్రభుత్వ నియంత్రణలోకి వచ్చాయి.

➤ లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు మేరకు లిక్కర్ స్కామ్‌పై సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. 2022 ఆగస్టులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత మనీశ్ సిసోడియా నివాసంతోపాటు 31 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. అయితే, ఈ సోదాల్లో సీబీఐకి ఎలాంటి ఆధారాలు దొరకలేదని మనీశ్ సిసోడియా చెప్పారు. తమ పార్టీని అప్రతిష్ట పాలు చేయడానికి బీజేపీ పెద్దలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

➤ ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ కూడా జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గుర్తించింది. మనీశ్ సిసోడియాతో పాటు మరో 14 మందిపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ సైతం కేసు నమోదు చేసింది. దర్యాప్తునకు శ్రీకారం చుట్టింది.

➤ అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అధినేత కె.చంద్రశేఖరరావు కుమార్తె, తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని ‘సౌత్ గ్రూప్’కు లబ్ధి చేకూర్చడానికి వీలుగా కొత్త లిక్కర్ పాలసీని కేజ్రీవాల్ ప్రభుత్వం రూపొందించినట్లు ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. సౌత్ గ్రూప్‌కు పెద్ద ఎత్తున లైసెన్స్‌లు దక్కినట్లు తేల్చింది.

➤ తమకు అనుకూలంగా మద్యం విధానాన్ని రూపొందించినందుకు ప్రతిఫలంగా ఆమ్ ఆద్మీ పార్టీకి సౌత్ గ్రూప్ రూ.100 కోట్ల ముడుపులు చెల్లించినట్లు ఈడీ ఆరోపించింది. ఈ సొమ్మును గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఖర్చు చేసినట్లు తెలియజేసింది. ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం ద్వారా సౌత్ గ్రూప్ ఈ రూ.100 కోట్లు తిరిగి రాబట్టుకున్నట్లు పేర్కొంది. నూతన లిక్కర్ పాలసీ వల్ల ఢిల్లీ ప్రభుత్వానికి రూ.2,800 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ఈడీ తేల్చిచెప్పింది.

➤ ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరుణ్ పిళ్లై, సమీర్ మహేంద్రు, పి.శరత్‌చంద్రారెడ్డి, బినోయ్‌బాబు, అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్, అమిత్ అరోరా, గోరంట్ల బుచ్చిబాబు, గౌతమ్ మల్హోత్రా, రాజేష్ జోషి, మాగుంట రాఘవ, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, కల్వకుంట్ల కవిత అరెస్టయ్యారు. వీరిలో అరుణ్ పిళ్లై, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్ జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా, కల్వకుంట్ల కవిత ఈడీ కస్టడీలో ఉన్నారు. మనీశ్ సిసోడియా అనుచరుడు దినేష్ అరోరా, మాగుంట రాఘవ, గోరంట్ల బుచ్చిబాబు పి.శరత్‌చంద్రారెడ్డి అప్రూవర్లుగా మారారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఈ కేసులో సీబీఐ విచారించింది. తాజాగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

‘మోదీ’ ప్రకటనలపై ఈసీకి ఫిర్యాదు

న్యూఢిల్లీ: ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేస్తూ బీజేపీ ‘మోదీకీ పరివార్’, ‘మోదీ కీ గ్యారెంటీ’ ప్రకటనలను గుప్పిస్తోందని, వీటిని వెంటనే తొలగించి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదుచేసింది. ముకుల్ వాస్నిక్, సల్మాన్ ఖుర్షీద్‌ల కాంగ్రెస్ ప్రతినిధి బృందం గురువారం ఈసీని కలిసి ఎన్నికల కోడ్‌ను బీజేపీ ఎలా ఉల్లంఘించిందో వివరించింది. సుప్రీంకోర్టు గతంలోనే క్లీన్‌చిట్ ఇచ్చినా 2జీ స్పెక్ట్రమ్ కేసులో అభూత కల్పనలతో బీజేపీ తప్పుడు అడ్వర్‌టైజ్‌మెంట్లు ఇచ్చిందని ఈసీకి ఫిర్యాదుచేసింది.

అరుణాచల్ భారత్‌దే: అమెరికా

వాషింగ్టన్: అరుణాచల్ ప్రదేశ్‌ను భారత్‌కు చెందిన ప్రాంతంగానే గుర్తిస్తున్నామని అమెరికా ప్రకటించింది. వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) ఆవలి వైపు ప్రాంతం కూడా తమదేనంటూ చైనా సైన్యం కానీ, పౌరులు గానీ ఏకపక్షంగా అక్రమంగా చొరబాట్లకు పాల్పడేందుకు చేసే ప్రయత్నాలను గట్టిగా వ్యతిరేకిస్తున్నట్లు అగ్రరాజ్యం తెలిపింది. ఇటీవల ప్రధాని మోదీ అరుణాచల్ ప్రదేశ్‌లో పర్యటించిన నేపథ్యంలో చైనా ఆర్మీ మరో మారు ఆ భూభాగం తమదేనంటూ ప్రకటించడంపై అమెరికా విదేశాంగ శాఖ ప్రిన్సిపల్ ఉప అధికారప్రతినిధి వేదాంత్ పటేల్ మీడియాకు ఈ విషయం తెలిపారు. భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌ను టిబెట్‌లోని ‘జాంగ్నాన్’గా చైనా తరచూ పేర్కొంటోంది. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన భారత్..అరుణాచల్ ప్రదేశ్ ఎల్లప్పుడూ తమదేనని, ఇకపైనా విడదీయరాని అంతర్భాగంగానే కొనసాగుతుందని బుధవారం పునరుద్ఘాటించిన విషయం తెలిసిందే.

అమెరికాకు సంబంధం లేదు:చైనా
అరుణాచల్ భారత్‌దేనంటూ అమెరికా చేసిన ప్రకటనను చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. భారత్–చైనా సరిహద్దు వివాదంతో అమెరికాకు ఏమాత్రం సంబంధం లేదని తెలిపింది. అమెరికా ఇతర దేశాల మధ్య వివాదాలను రెచ్చగొడుతూ, వాటిని తన స్వార్థ భౌగోళిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం అందరికీ తెలిసిందేనని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ వ్యాఖ్యానించారు.

పార్టీని ఆర్థికంగా చిదిమేసే కుట్ర

- మోదీ వ్యవస్థీకృత చర్యలకు పాల్పడుతున్నారు
- కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేయడంపై సోనియా ఆగ్రహం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ సభలు, ర్యాలీలు, అభ్యర్థుల భారీ ప్రచార కార్యక్రమాలకు ఎంతో ధనం అవసరమైన వేళ ప్రధాని మోదీ వ్యవస్థీకృతంగా కుట్రలు పన్ని కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా చిదిమేసేందుకు బరితెగించారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఢిల్లీలో పత్రికా సమావేశంలో సోనియా, పార్టీ చీఫ్ ఖర్గే, రాహుల్ గాంధీలు మాట్లాడారు. పార్టీలో ముగ్గురు అగ్రనేతలు ఒకేసారి మీడియాతో మాట్లాడటం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. దేశవ్యాప్తంగా పార్టీ అభ్యర్థుల ప్రచారఖర్చులు, ప్రకటనలకు భారీ మొత్తంలో నగదు అవసరమైన వేళ తమ బ్యాంక్ ఖాతాలను అదునుచూసి స్తంభింపజేయడాన్ని నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. ‘కాంగ్రెస్‌కు ప్రజలిచ్చిన నగదు విరాళాలను బలవంతంగా లాగేసుకున్నారు. ఇది చాలా తీవ్రమైన అంశం. ఓవైపు ఎలక్టోరల్ బాండ్లపై నిషేధం, మరోవైపు ఖాతాల స్తంభనతో ఎదురైన ఆర్థిక ఇబ్బందులు. ఇవి నిజంగా అనూహ్యమైన తీవ్ర అవరోధాలు. ఇలా అత్యంత క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ కూడా మా శక్తిమేరకు అద్భుతంగా ఎన్నికల ప్రచార కార్యక్రమాలను చేపట్టగలుగుతున్నాం. ప్రత్యేకంగా కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకున్నారన్నది సుస్పష్టం. ప్రధాన ప్రతిపక్షం ఆర్థికమూలాలపై దాడి చేశారు’ అని సోనియా ఆగ్రహం వ్యక్తంచేశారు.

డీఫ్రీజ్ చేస్తేనే ఆరోగ్యకర పోటీ సాధ్యం: ఖర్గే
‘డీఫ్రీజ్ చేయడమే ఎన్నికల్లో ఆరోగ్యకర పోటీకి బాటలుపరుస్తుంది. సాధారణ ప్రజానీకం కాంగ్రెస్‌కు విరాళంగా ఇచ్చిన మొత్తాలను ఫ్రీజ్ చేసి, ఐటీ శాఖతో బలవంతంగా రూ.115.32 కోట్లు నగదు విత్‌డ్రా చేయించి మమ్మల్ని బీజేపీ లూటీ చేసింది. స్వేచ్ఛాయుత, పారదర్శకమైన ఎన్నికలు అత్యావశ్యకమైన ఈ తరుణంలో రాజ్యాంగబద్ధ సంస్థలు కాంగ్రెస్ పార్టీ ఖాతాలను డీఫ్రీజ్ చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి’ అని ఖర్గే కోరారు. ‘బీజేపీ అధికారంలో ఉంది. పైగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ తమ ఖాతాలను వేల కోట్ల రూపాయలతో నింపేసుకుంది. ఎన్నికల్లో దీటైన పోటీకి వీలు లేకుండా మా పార్టీ ఆర్థిక మూలాలను దెబ్బతీసింది. అధికారంలో ఉన్న వారు ప్రత్యక్షంగాగానీ పరోక్షంగానీ రాజ్యాంగబద్ధ సంస్థలపై నియంత్రణ కల్గి ఉండొద్దు. వనరులపై గుత్తాధిపత్య ధోరణి అస్సలు మంచిది కాదు’ అని ఖర్గే వ్యాఖ్యానించారు.


ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాహుల్ గాంధీ. చిత్రంలో సోనియా గాంధీ, ఆ పార్టీ చీఫ్ ఖర్గే

రూ.2 కూడా చెల్లించలేని పరిస్థితి: రాహుల్
‘ప్రధాన ప్రతిపక్షం అన్ని అకౌంట్లను ఫ్రీజ్‌చేయడం అంటే అది కాంగ్రెస్‌పై మాత్రమే ప్రభావం చూపదు దేశ ప్రజాస్వామ్యానికీ అది విఘాతమే. ఎన్నికల్లో పోటీచేసే సామర్థ్యాన్ని దెబ్బతీశారు. మేం ప్రచార కార్యక్రమాలు చేసుకోలేకపోతున్నాం. ఫ్రీజ్ చేసి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేరపూరిత చర్యకు పాల్పడ్డారు. ఇలాంటి చర్యలతో దేశంలో ప్రజాస్వామ్యం ఉందనడం అబద్ధమే అవుతుంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థలేవీ ఇక్కడ పని చేయట్లేవు’ అని రాహుల్ అన్నారు. ‘ఖాతాల స్తంభనతో కరెన్సీ కష్టాలు విపరీతంగా పెరిగాయి. మా నేతలు, అభ్యర్థులు విమానాల్లో దేశంలోని ఒక చోటు నుంచి ఇంకో చోటుకు వెళ్లలేని పరిస్థితి. విమానం సంగతి పక్కనబెట్టండి. కనీసం రైలు టికెట్ కొనేందుకు కూడా కష్టపడుతున్నాం. 20 శాతం ఓటుబ్యాంక్ మాకున్నా రూ.2 కూడా చెల్లించలేని పరిస్థితి. అదునుచూసి ఎన్నికలకు రెండు నెలల ముందు మోదీ పన్నిన కుట్ర ఇది. ఇంత జరుగుతున్నా ఈసీ మౌనం వహించడం విచారకరం. ఈ విషయంలో ఈసీ ఇంతవరకు స్పందించలేదు’ అని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై బీజేపీ స్పందించింది. ఓటమి ఖాయం కావడంతో కావాలనే కాంగ్రెస్ ఇలాంటి ఆరోపణలు గుప్పిస్తోందని బీజేపీ ప్రతివిమర్శ చేసింది.

అసుర శక్తిపైనే పోరాటం: రాహుల్
విద్వేషం నిండిన అసుర(రాక్షస) శక్తిపై తమ పార్టీ పోరాటం సాగిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. ‘శక్తికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం’ అంటూ ఆయన ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. రాహుల్ వ్యాఖ్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సహా బీజేపీ నాయకులు దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్వేషం నిండిన అసుర శక్తిపైనే తమ పోరాటం అని రాహుల్ గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో స్పష్టం చేశారు. అసుర శక్తిని ఓడించడమే తమ లక్ష్యమన్నారు.

సీఈసీ, ఈసీల నియామక చట్టంపై స్టే ఇవ్వలేం: సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: ‘ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (అపాయింట్‌మెంట్, కండీషన్స్ ఆఫ్ సర్వీస్, టరమ్స్ ఆఫ్ ఆఫీస్) చట్టం–2023’పై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సీఈసీ, ఈసీల నియామకానికి సంబంధించిన సెలక్షన్ కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత జయ ఠాకూర్, ఇటీవల ఇద్దరు నూతన ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ఇతర పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారించింది. పిటిషనర్లలో ఒకరి తరఫున సీనియర్ లాయర్ వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీ సిఫార్సుల మేరకు సీఈసీ, ఇతర కమిషనర్ల నియామకాలు చేపట్టాలని అనూప్ బరన్వాల్ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. కొత్త చట్టంపై స్టే విధించాల్సిందేనని అసోసియేషన్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ప్రభుత్వ పాలనాయంత్రాంగం కింద పని చేస్తోందని ఆరోపించారు. అయితే, ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థ అని, పాలనాయంత్రాంగం కింద పనిచేస్తోందని అనడం సరికాదని జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ‘‘ఇద్దరు నూతన ఎన్నికల కమిషనర్లు ఇప్పటికే నియమితులయ్యారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. నియమితులైన ఇద్దరు కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూపై ఎలాంటి ఆరోపణలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో చట్టంపై మధ్యంతర ఉత్తర్వు ద్వారా స్టే విధించడం గందరగోళానికి దారి తీస్తుంది. అలాగే వారి నియామకాన్ని నిలిపివేయలేం’’ అని జస్టిస్ సంజీవ్ ఖన్నా తేల్చిచెప్పారు. నూతన చట్టం ప్రకారం ఎంపికైన ఇద్దరు కమిషనర్ల నియామకంపై స్టే ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. అయితే, ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన ప్రధాన పిటిషన్లను పరిశీలిస్తామని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లోగా స్పందించాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఆగస్టు 5 తేదీకి వాయిదా వేసింది.

‘ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్’పై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఆధ్వర్యంలో ఫ్యాక్ట్–చెకింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌పై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. ఇది భావ వ్యక్తీకరణకు సంబంధించిన అంశమని వెల్లడించింది. ప్రభుత్వంపై మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను, ఆన్‌లైన్‌లో నకిలీ కంటెంట్‌ను గుర్తించడానికి ఈ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్–2021లో సవరణలు చేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎడిటర్స్ గిల్డ్ ఇండియాతోపాటు పలువురు బాంబే హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన హైకోర్టు ఫ్యాక్ట్–చెకింగ్ యూనిట్ ఏర్పాటుపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరిస్తూ మార్చి 11న తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. మార్చి 11 నాటి బాంబే హైకోర్టు తీర్పును తోసిపుచ్చింది.

తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: డీఎంకే సీనియర్ నేత కె.పొన్ముడిని తిరిగి మంత్రి వర్గంలోకి తీసుకోవడాన్ని నిరాకరిస్తున్న తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన సుప్రీంకోర్టును సైతం ధిక్కరిస్తున్నారని వ్యాఖ్యానించింది. పొన్ముడిని మంత్రిగా నియమించే విషయాన్ని 24 గంటల్లో తేల్చాలని, లేదంటే తాము తీవ్ర చర్యలకు దిగుతామని హెచ్చరించింది. అక్రమాస్తుల కేసులో పొన్ముడికి హైకోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో, సీఎం స్టాలిన్ ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించారు. హైకోర్టు ఉత్తర్వులపై ఈనెల 11న సుప్రీంకోర్టు స్టే విధించింది. దీంతో, పొన్ముడిని తిరిగి మంత్రివర్గంలోకి తీసుకోవాలంటూ ప్రభుత్వం సిఫారసు చేయగా గవర్నర్ రవి పట్టించుకోవడం లేదు. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

‘వికసిత్ భారత్’ సందేశాలను ఆపండి: ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రచారం చేసే వికసిత్ భారత్ సంకల్ప్ సందేశాలు ఓటర్ల ఫోన్లకు వాట్సాప్‌లో పంపడాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తప్పుబట్టింది. వెంటనే ‘వికసిత్ భారత్’ గంపగుత్త మెసేజ్‌లను వాట్సాప్ ద్వారా పంపడం ఆపేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శికి గురువారం ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొనడమే తమ ఉద్దేశమని ఈసీ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళి అమల్లోకి వచ్చాక సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభుత్వ పథకాలు, విజయాలను ప్రచారం చేయడం నిషేధమని ఈసీ పేర్కొంది.

పంజాబ్, అస్సాం జిల్లాల పోలీసు చీఫ్‌ల బదిలీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ ఎన్నికల కమిషన్(ఈసీ)మరికొందరు అధికారులకు స్థానచలనం కల్పించింది. తాజాగా అస్సాం, పంజాబ్‌లోని జిల్లా పోలీసు చీఫ్‌లను బదిలీ చేసింది. పంజాబ్, ఒడిశా, గుజరాత్, పశ్చిమబెంగాల్‌లలో పనిచేసే అయిదుగురు నాన్ కేడర్ జిల్లా మేజిస్ట్రేట్లు(డీఎంలు), 8 మంది పోలీస్ సూపరింటెండెంట్ల(ఎస్పీలు)ను సైతం బదిలీ చేసింది. జిల్లా స్థాయిలో ప్రధానమైన పోస్టుల్లో ఐఏఎస్, ఐపీఎస్‌లు కాని నాన్–క్యాడర్ అధికారులను నియమించడంపై ఈసీ కఠినమైన వైఖరిని తీసుకుంది.

చెన్నై సౌత్ బరిలో తమిళిసై

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల మూడో జాబితాను బీజేపీ అధిష్టానం విడుదల చేసింది. ఈ జాబితాలో తమిళనాడులోని మొత్తం తొమ్మిది స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను చెన్నై సౌత్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు.

విరాళాల సమస్త వివరాలు బహిర్గతం

- ఈసీకి సమర్పించిన ఎస్‌బీఐ
- వెంటనే తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) నుంచి ఎలక్టోరల్ బాండ్ల వివరాలన్నీ వాటి నంబర్లతో సహా పూర్తి స్థాయిలో కేంద్ర ఎన్నికల సంఘానికి చేరాయి. దీంతో ఆ సమస్త వివరాలను ఈసీ వెంటనే తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఆల్ఫా–న్యూమరిక్ నంబర్లతోసహా దాతలు, వాటిని అందుకున్న గ్రహీతల(రాజకీయ పార్టీలు) జాబితాను విడివిడిగా ఈసీ పొందుపరిచింది. ఆల్ఫా–న్యూమరిక్ నంబర్లను బట్టి ఏ ఎలక్టోరల్ బాండ్ మొత్తాన్ని ఈ రాజకీయ పార్టీ విరాళంగా పొందిందో సులభంగా తెల్సుకోవచ్చు. సుప్రీంకోర్టు గత ఆదేశాల సమయంలో ఈ ఆల్ఫా–న్యూమరిక్ నంబర్లు లేకుండానే బాండ్లు, వాటి గ్రహీతల జాబితాను ఈసీకి ఎస్‌బీఐ ఇచ్చింది. ఏ వ్యక్తి/సంస్థ బాండ్లను ఏ పార్టీకి విరాళంగా ఇచ్చారని తెలిపే ఈ నంబర్లు లేకపోవడంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం బ్యాంకు తీరుపై



అసహనం వ్యక్తం చేసింది. సమస్త వివరాలను ఈసీకి ఇవ్వాలని ఆదేశించడంతో దిద్దుబాటు చర్యలకు దిగిన ఎస్‌బీఐ గురువారం ఆల్ఫా–న్యూమరిక్ నంబర్లతో కూడిన పూర్తి వివరాలను ఈసీకి అందజేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది.

రిలయన్స్ సంబంధ సంస్థ నుంచి బీజేపీకి రూ.395 కోట్లు
ఈసీ వెల్లడించిన తాజా వివరాల ప్రకారం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో సంబంధం ఉన్న క్విక్ సప్లై చైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బీజేపీకి రూ.395 కోట్ల విరాళాలు ఇచ్చింది. 2022లో శివసేన పార్టీకి రూ.25 కోట్ల విరాళాలు అందజేసింది. 2021–22, 2023–24కాలంలో బాండ్లు కొని విరాళంగా ఇచ్చిన మూడో అతిపెద్ద దాతగా క్విక్ సప్లై చైన్ నిలిచింది. ఈకాలంలో ఈ సంస్థ రూ.410 కోట్ల బాండ్లను కొనుగోలుచేసింది. అత్యధికంగా ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ రూ.1,368 కోట్ల బాండ్లను కొనుగోలుచేయడం తెల్సిందే. ఈ సంస్థ 2022 అక్టోబర్ వరకు మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీపార్టీకి రూ.540 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఈ సంస్థ నుంచి అత్యధిక విరాళాలు పొందిన పార్టీగా టీఎంసీ నిలిచింది. ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ నుంచి బీజేపీ రూ.100 కోట్ల విరాళాలు పొందింది. ఈ సంస్థ కాంగ్రెస్‌కు రూ.50 కోట్ల విరాళం ఇచ్చింది. సిక్కిం క్రాంతికారీ మోర్చా సైతం ఈ సంస్థ నుంచి విరాళాలు స్వీకరించింది. తమిళనాడులోని డీఎంకేకు ఈ సంస్థ ఏకంగా రూ.509 కోట్ల విరాళాలు ఇచ్చింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో సంబంధం ఉన్న హనీవెల్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ సైతం రూ.30 కోట్ల బాండ్లను కొని మొత్తం బీజేపీకే విరాళంగా ఇచ్చింది.

ఈసీకి ఇచ్చేశాం: ఎస్‌బీఐ
ఎలక్టోరల్ బాండ్ల వివరాలన్నీ వాటి నంబర్లతో సహా ఎన్నికల సంఘానికి అందజేశామని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్‌కుమార్ ఖరా గురువారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. దాతలు ఇచ్చిన బాండ్లను నగదుగా మార్చుకున్న రాజకీయ పార్టీల బ్యాంక్ ఖాతాల నెంబర్లు, కేవైసీ వివరాలను బయటపెట్టడం లేదని వెల్లడించారు.

7
సాక్షి హైదరాబాద్
శుక్రవారం । 22 । మార్చి । 2024

రంజాన్ వేళలు
ఇఫ్తార్ — శుక్రవారం సాయంత్రం 6:33
సహర్ — శనివారం ఉదయం 4:56

బండ్లగూడ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం



విజయ దరహాసంతో కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్

బండ్లగూడ: బండ్లగూడ మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసం తీర్మానం నెగ్గింది. మొత్తం 22 మంది సభ్యులున్న కార్పొరేషన్‌లో 16 మంది మేయర్ మహేందర్ గౌడ్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. గురువారం రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ మహేందర్ గౌడ్‌తో పాటు ఆయనకు మద్దతునిస్తున్న ఐదుగురు కార్పొరేటర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. మహేందర్ గౌడ్‌కు వ్యతిరేకంగా 14 మంది కార్పొరేటర్లు అవిశ్వాస ప్రతిపాదనను ధ్రువీకరిస్తూ తమ సమ్మతిని తెలిపారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లయింది.



జంపింగ్‌లకే జై

పారాచూట్ లీడర్లకే కాంగ్రెస్ పెద్దపీట

- మల్కాజిగిరి నుంచి పట్నం సునీతారెడ్డి
- సికింద్రాబాద్‌కు దానం నాగేందర్ ఖరారు
- చేవెళ్ల బరిలో రంజిత్‌రెడ్డి
- నేతల వెంట కేడర్ కదిలేనా?

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ అధిష్టానం పారాచూట్‌లకే పెద్దపీట వేసింది. ఏళ్ల నుంచి పార్టీ జెండా మోసిన వారిని పక్కన పెట్టి కొత్తగా చేరిన వారి అభ్యర్థిత్వానికి జై కొట్టింది. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మల్కాజిగిరి స్థానానికి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, చేవెళ్లకు సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పేర్లను ఖరారు చేసింది. ఈ మేరకు గురువారం రాత్రి అభ్యర్థులను ప్రకటించింది. ఈ ముగ్గురూ ఇటీవలే కారు దిగి.. హస్తం గూటికి చేరినవారు కావడం గమనార్హం. ఇతర పార్టీల నుంచి కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన వారికి ఎంపీ సీట్లు కేటాయించడంతో మొదటి నుంచీ పార్టీనే నమ్ముకున్న లీడర్లకు ఆశాభంగం తప్పలేదు. అధిష్టానం తీరుతో పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం వీచినా.. గ్రేటర్ పరిధిలో మాత్రం బీఆర్ఎస్ హవా కొనసాగించింది. మెజార్టీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం సహా ఇతర స్థానాల్లోనూ ఆశించిన సీట్లు గెలవలేకపోయింది.

కారు దిగి.. హస్తం గూటికి చేరి..

హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో కనీస ప్రాతినిధ్యం లేకపోవడంతో అధికార కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించి మహానగర పరిధిలోని నాలుగింటిలో మూడు స్థానాలు కై వసం చేసుకునేందుకు వ్యూహరచన చేశారు. ఇందులో భాగంగా ఇతర పార్టీల నుంచి చేరికలకు తెర లేపారు. దీంతో చేవెళ్ల టికెట్ ఆశించిన ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కూడా ఇదే స్థానాన్ని ఆశిస్తూ.. కారు దిగి హస్తం గూటికి చేరారు. మరోవైపు సికింద్రాబాద్ టికెట్ ఆశించి మాజీ జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన సతీమణి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి దంపతులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆమె భర్త మోతె శోభన్‌రెడ్డి సికింద్రాబాద్, మల్కాజిగిరిలోని ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయాలని భావించి కాంగ్రెస్‌లో చేరినప్పటికీ.. ఆయనకు సైతం భంగపాటు తప్పలేదు.

ఆశలు.. అడియాసలై..

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. మళ్లీ లోక్‌సభ బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి టికెట్ ఆశించారు. నాగర్‌కర్నూలు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ సీనియర్ లీడర్, సినీనటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిలు కూడా ఇటీవలే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా మల్కాజిగిరి సీటును ఆశించారు. అనూహ్య పరిణామాల మధ్య కాంగ్రెస్ అధిష్టానం వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డికి టికెట్ ఖరారు చేసింది. దీంతో ఇప్పటి వరకు ఇక్కడి నుంచి టికెట్ ఆశించిన మైనంపల్లికి ఆశాభంగమే మిగిలింది. నిన్నా మొన్నటి వరకు వేరే పార్టీలో పని చేసిన నేతలు.. లోక్‌సభ టికెట్లు ఆశించి తాజాగా అధికార కాంగ్రెస్‌లో చేరారు. లీడర్లు మారినంత సులభంగా పార్టీ కేడర్ మారుతుందా? అనేది అనుమానమే.

పోరు రసవత్తరం..

చేవెళ్ల బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ అభ్యర్థిగా ఇటీవలే బీఆర్ఎస్‌ను వీడిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఈ ముగ్గురు పోటీ పడుతుండటంతో ఇక్కడ పోటీ రసవత్తరంగా మారనుంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నుంచి పట్నం సునీతారెడ్డి బరిలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన ప్రాంతం కావడంతో ఆ పార్టీ ఈ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బీఆర్ఎస్ అభ్యర్థి మినహా ఇక్కడ పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు స్థానికేతరులు కావడం గమనార్హం. ఇక సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మంత్రి, సిట్టింగ్ ఎంపీ కిషన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి పద్మారావును బరిలోకి దించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఖరారు చేసింది. కాగా.. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి బీఆర్ఎస్ సిట్టింగ్‌లే కావడం గమనార్హం.

బీజేపీ.. బీఆర్ఎస్.. కాంగ్రెస్

హస్తినాపురం: ఆమె బానోతు సుజాతా నాయక్. తొలుత ఆమె బీజేపీ నుంచి హస్తినాపురం కార్పొరేటర్‌గా గెలిచారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. కాగా.. గురువారం మధుయాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో.. పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి సమక్షంలో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. అనంతరం సీఎంను కలిశారు.



హ్యాపీగా నవ్‌రోజ్





పార్శీలు తమ నూతన సంవత్సర వేడుకలను గురువారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. ఇరానీ కేలండర్ ప్రకారం మార్చి 21న నవ్‌రోజ్ (నూతన సంవత్సరం) వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని ఫైర్ దేవాలయంలో పార్శీలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం పీజీ రోడ్డులోని పార్శీ ధర్మశాలలో సామూహిక విందులో పాల్గొని ఉల్లాసంగా గడిపారు.

– రాంగోపాల్‌పేట్







‘గువ్వకుంట’ కబ్జాపై కన్నెర్ర

- ప్లాట్ల హద్దురాళ్లు, పార్కు నిర్మాణం కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

తుర్కయంజాల్: ‘కబ్జా చెరలో గువ్వకుంట’ శీర్షికన గురువారం ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన కథనం అధికార యంత్రాంగంలో చలనం పుట్టించింది. చెరువు అన్యాక్రాంతంపై రంగారెడ్డి కలెక్టర్ శశాంక ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు గురువారం ఉదయం ఇక్కడ ప్రత్యక్షమయ్యారు. తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని గువ్వకుంట కట్టను అక్రమార్కులు ధ్వంసం చేసి ప్లాట్ల హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ‘సాక్షి’ బట్టబయలు చేయడంతో స్పందించిన అధికారులు ప్లాట్ల హద్దు రాళ్లను తొలగించారు. చెరువు కట్టను ఆనుకుని ఓ వెంచర్ నిర్వాహకుడు నిర్మించిన పార్కును కూడా తొలగించారు. కట్టను ఆనుకుని చేపడుతున్న నిర్మాణాన్ని కూల్చివేశారు. కూల్చివేతల్లో ఇరిగేషన్ డీఈ ఉషారాణి, ఏఈఈ రజా తాప్సీన్, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి పాల్గొన్నారు.



గో గ్రీన్ మెట్రో

ప్రయాణం.. పర్యావరణ హితం

- గ్రీన్ చాంపియన్‌గా హైదరాబాద్ మెట్రో
- గణనీయంగా తగ్గిన కర్బన ఉద్గారాలు
- కారు, బస్సు కంటే 98% తక్కువగా కార్బన్‌డయాక్సైడ్


సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణలో హైదరాబాద్ మెట్రో గ్రీన్ చాంపియన్‌గా నిలిచింది. లక్షలాది మంది ప్రయాణికులు ప్రతి రోజు కాలుష్యరహితమైన, ఆహ్లాదకరమైన ప్రయాణ సదుపాయాన్ని అందజేస్తోంది. రహదారులపై పోటెత్తే వాహనాల రద్దీ, టన్నుల కొద్దీ వెలువడుతున్న అత్యంత ప్రమాదకరమైన కాలుష్యకారక పదార్థాల నుంచి నగరవాసులకు పెద్ద ఎత్తున ఊరటనిస్తోంది. నగరంలోని నాగోల్‌– రాయదుర్గం, ఎల్బీనగర్‌–మియాపూర్, జేబీఎస్‌–ఎంజీబీఎస్ కారిడార్‌లో ప్రతి రోజు సుమారు 1000 కిపైగా మెట్రో సర్వీసులు పరుగులు తీస్తున్నాయి. 4.8 లక్షల మందికి పైగా మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో 2017లో మెట్రో రైళ్లను ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు పర్యావరణ పరిరక్షణలో, కాలుష్యకారక పదార్థాల నియంత్రణలో మెట్రో రైలు అద్భుతమైన ఫలితాలను సాధించిందని ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ తెలిపింది. నగరవాసులకు కాలుష్యరహితమైన సుస్థిర ప్రయాణ సదుపాయాన్ని అందజేయడంలో 2040 నాటికి కార్బన్ న్యూట్రాలిటీని సాధించే దిశగా ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

88 వేల కిలోల కార్బన్‌డయాక్సైడ్ నియంత్రణ..

కార్బన్ డయాక్సైడ్ తదితర కర్బన ఉద్గారాల నియంత్రణలో హైదరాబాద్ మెట్రో రైల్ అద్భుతాలను సాధిస్తోంది. మెట్రో రైలు వల్ల ఏటేటా కర్బన ఉద్గారాలు తగ్గుముఖం పడుతున్నట్లు ఎల్ అండ్ టీహెచ్‌ఎంఆర్ స్పష్టం చేసింది. ఒక్క 2023 లోనే సుమారు 88,252 కిలోల కార్బన్‌డయాక్సైడ్‌ను తగ్గించడం గమనార్హం. ఇది 88 వేల చెట్లను నాటడానికి సమానమైన ఫలితమని అధికారులు పేర్కొన్నారు. నగరవాసుల ఆరోగ్య ప్రమాణాలను పెంపొందించేందుకు ఈ ఫలితాలు దోహదం చేస్తాయని ఎల్‌అండ్‌టీహెచ్‌ఎంఆర్ఎల్ సీఈఓ కేవీబీ రెడ్డి అభిప్రాయపడ్డారు. 2018లో మెట్రో రైల్‌తో సుమారు 5,510 కిలోల కార్బన్ డయాక్సైడ్ తగ్గుముఖం పడితే, ఐదేళ్ల వ్యవధిలో అది ఏకంగా 88 వేల కిలోలకుపైగా నియంత్రణకు చేరుకోవడం గమనార్హం.

మెట్రో రైల్ నగరంలో కార్బన్ డయాక్సైడ్ తగ్గుముఖం ఇలా..

సంవత్సరం	కార్బన్ దయాక్సైడ్ కిలోగ్రాములు
2018	5,510
2019	30,700
2020	67,225
2021	15,795
2022	37,636
2023	88,252



భారీగా తగ్గిన కార్బన్ ఫుట్‌ప్రింట్..

మరోవైపు కార్బన్‌ఫుట్ ప్రింట్ కూడా గణనీయంగా తగ్గింది. 30 కి.మీ ప్రయాణానికి, మెట్రో ప్రయాణికులు కారు వినియోగదారుల కంటే 97 శాతం, బస్సు ప్రయాణికుల కంటే 98 శాతం తక్కువ కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తున్నట్లు అంచనా. వనరులను సమర్థంగా వినియోగించుకుని లక్షలాది మందికి సురక్షితమైన ప్రయాణ సదుపాయాన్ని అందజేయడంలో మెట్రో రైలు విజయవంతంగా దూసుకెళ్తుందని కేవీబీ రెడ్డి తెలిపారు. ‘హైదరాబాద్ మెట్రో రైల్ కేవలం రవాణా వ్యవస్థ మాత్రమే కాదు. ఇది స్థిరమైన, పర్యావరణ స్నేహతో కూడిన నగరంగా అభివృద్ధి చెందుతోందనేందుకు ప్రతీక’ అని ఆయన పేర్కొన్నారు.

అవినీతిలో అనకొండలు!

హైరైజ్ భవనాలకు అడ్డగోలు అనుమతులు

- కమిటీల ఆమోదం లేకుండానే జారీ
- గ్రోత్ కారిడార్‌లో అక్రమ భవనాలు
- బడా బిల్డర్లతో కుమ్మక్కైన కృష్ణకుమార్
- మరికొందరు ఏపీఓలపై ఆరోపణలు
- చర్యలకు ఉపక్రమించిన దానకిశోర్
- ప్లానింగ్ విభాగం డైరెక్టర్ల విధుల్లో మార్పులు



సాక్షి, సిటీబ్యూరో: టీడీఆర్‌లపై ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి అక్రమాలకు పాల్పడి సస్పెన్షన్‌కు గురైన హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం సహాయ ప్లానింగ్ అధికారి కృష్ణకుమార్ అక్రమాలపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. గ్రోత్ కారిడార్‌లో హైరైజ్ బిల్డింగ్‌లకు అక్రమంగా అనుమతులను ఇవ్వడంలో కృష్ణకుమార్ కీలకంగా పని చేసినట్లు తెలిసింది. కొందరు బడా బిల్డర్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఎలాంటి కమిటీ సమావేశాలు నిర్వహించకుండానే అడ్డగోలుగా అనుమతులను ఇచ్చేశారు. మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ మద్దతు పుష్కలంగా ఉండడంతో కృష్ణకుమార్ ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తనపై ఉండే జోనల్ స్థాయి ప్లానింగ్ అధికారులను కూడా బేఖాతరు చేసి నేరుగా బాలకృష్ణతో కలిసి వ్యవహారాలు చక్కబెట్టేవాడని సమాచారం.

పెద్దల అండ ఉందని.. తమకేమీ కాదని..

శంకర్‌పల్లి జోన్‌లో ఔటర్ రింగ్‌రోడ్డుకు ఆనుకొని ఉన్న గ్రోత్ కారిడార్‌లో అక్రమ అనుమతులను పొందిన బడా బిల్డర్లలో చాలామంది అప్పటి ప్రభుత్వంలోని పెద్దలకు దగ్గరివారు కావడంతో కృష్ణకుమార్ వంటి కొందరు అధికారులు తమకేం కాదనుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా సదరు ప్రభుత్వ పెద్దలే చూసుకుంటారనే ధీమాతో బిల్డర్ల అడుగులకు మడుగులొత్తారు. భారీఎత్తున ఆస్తులను కూడబెట్టారు. అనూహ్యంగా కొత్త ప్రభుత్వం రావడంతో హెచ్‌ఎండీఏలోని తిమింగలాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

అక్రమార్కుల వెన్నులో వణుకు..

మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించిన అనంతరం ఆయనతో కలిసి అవకతవకలకు పాల్పడినవారికి ప్రస్తుతం వెన్నులో వణుకు పుడుతోంది. శివబాలకృష్ణను ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన మరుసటి రోజే కృష్ణకుమార్ అమెరికాకు వెళ్లిపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. రూ.కోట్ల విలువైన టీడీఆర్‌ల జారీలో అక్రమాలకు పాల్పడినట్లు కృష్ణకుమార్‌పై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడంతోనే హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిశోర్ ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలో మరికొందరు ఏపీవోలు కూడా కృష్ణకుమార్ తరహాలోనే అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

డ్రైవర్‌తో డబ్బుల వసూలు..

చెరువులు, కుంటలు తదితర ప్రాంతాల్లో అడ్డగోలుగా అక్రమ భవనాలకు అనుమతులను ఇచ్చారు. చెరువులో అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి అనుమతులను ఇచ్చిన ఓ మహిళా ఏపీఓ అందుకు లంచంగా ఏకంగా తన పేరిట ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల అమలులో ఎంతో కఠినంగా వ్యవహరిస్తున్నట్లు బయటకు కనిపించే మరో ఏపీఓ అధికారి డబ్బుల వసూళ్ల బాధ్యతను మాత్రం తన వద్ద పని చేసే డ్రైవర్‌కు అప్పగించినట్లు సమాచారం.

బాధ్యతల నుంచి తప్పించి..

ఈ క్రమంలోనే హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిశోర్ ప్రణాళికా విభాగంపై సీరియస్‌గా దృష్టి సారించారు. డైరెక్టర్ల విధుల్లో తాజాగా మార్పులు చేశారు. హెచ్‌ఎండీఏలో ప్రస్తుతం శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్ జోన్‌ల బాధ్యతలను నిర్వహిస్తున్న డైరెక్టర్ విద్యాధర్‌ను ఘట్‌కేసర్, మేడ్చల్ జోన్‌లకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు కేవలం ఘట్‌కేసర్ జోన్ బాధ్యతలను చూస్తున్న రెండో డైరెక్టర్ శ్రీనివాస్‌ను శంకర్‌పల్లి, శంషాబాద్ జోన్‌లకు బదిలీ చేశారు.

ఫంక్షన్‌పై టెన్షన్!

శుభకార్యాలపై ‘కోడ్’ ఎఫెక్ట్

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు
- బంగారం, పెళ్లి దుస్తులు తదితరాల కొనుగోళ్లు
- నగదు వెంట తీసుకెళ్లేవారికి తప్పని కష్టాలు

హుడాకాంప్లెక్స్: సుబ్బి పెళ్లి ఎంకి చావు కొచ్చిందంటే ఇదే మరి. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నగదు లావాదేవీలకు కష్టకాలం వచ్చిపడింది. వివాహాది శుభ కార్యాలకు కావాల్సిన వస్తువుల కొనుగోలుతో పాటు ఫంక్షన్ హాళ్ల బుకింగ్‌కు తిప్పలు పడాల్సి వస్తోంది. ఏప్రిల్ 26 వరకు మంచి ముహూర్తాలు ఉండటంతో అనేక మంది తమ పిల్లలకు సంబంధాలు కుదుర్చుకుని వివాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇటు అబ్బాయి, అటు అమ్మాయి తరఫు తల్లిదండ్రులు, బంధువులు షాపింగ్ చేస్తుంటారు. విందు భోజనాలకు కావాల్సిన సామగ్రి కొనుగోలుతో పాటు ఫంక్షన్ హాల్ బుకింగ్స్, పెళ్లి దుస్తులు, బంగారు ఆభరణాలు, ఫర్నిచర్, వంట సామాను, వాహనాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తుంటారు.



ఐటీ చూపించలేక.. ఆన్‌లైన్‌కు నిరాకరణ

ఆన్‌లైన్ చెల్లింపులపై ఐటీ ఆంక్షలు కొనసాగుతుండటంతో మెజార్టీ వ్యాపారులు ఇప్పటికీ వైట్ కంటే, బ్లాక్‌లో చెల్లింపులకే ఇష్టపడుతున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులపై సీఎస్టీ, జీఎస్టీలు ఉండటమే ఇందుకు కారణం. ముఖ్యంగా బంగారం వ్యాపారులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు, కేటరింగ్ సంస్థలు, హోటళ్లు, వంట మనుషులు.. చెక్కులు, ఆన్‌లైన్ నగదు చెల్లింపులను స్వీకరించడం లేదు. వీరంతా ఐటీ చూపించడం ఇష్టం లేకే ఇలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. దీంతో పెద్దపెద్ద వాటికే కాదు..చిన్న చిన్న అవసరాలకు కూడా నగదును వెంట తీసుకెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం దేశవ్యా ప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం, రూ.50 వేల నగదుకు మించి వెంట తీసుకెళ్తే, తనిఖీల్లో భాగంగా పోలీసులు వాటిని సీజ్ చేస్తుండటంతో వధూవరుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రతి దానికీ పెళ్లి కార్డు, ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు వెంట తీసుకెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అన్నింటికీ ఆన్‌లైన్ అంటే కష్టమే..

ప్రతి ఫంక్షన్ హాల్లో 20 నుంచి 30 మంది వర్కర్లు పని చేస్తుంటారు. వీరికి నగదు రూపంలో కూలీ చెల్లించాల్సి వస్తుంది. పూలు, పండ్లు, కూరగాయలు అమ్మే రైతులకు నగదు చెల్లించాలి. వీటికి ఐటీ చూపించలేం. అన్నింటికీ ఆన్‌లైన్ చెల్లింపులంటే.. ఐటీ చూపించలేక నిర్వాహకులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– సుధాకర్, ఫంక్షన్ హాల్ నిర్వాహకుడు

సరైన ఆధారాలను చూపించాలి..



శుభకార్యాల వేళ నగదు వెంట తీసుకెళ్లేవారు తమ వెంట పెళ్లి కార్డులు, సదరు నగదు ఏ బ్యాంకు అకౌంట్ నుంచి డ్రా చేశారు? ఎంత డ్రా చేశారు? ఏం కొనుగోలు చేయబోతున్నారు? వంటి వాటికి ఆధారాలు చూపించాలి. ఆస్పత్రులకు వెళ్లేవారు పేషెంట్ కేస్‌షీట్‌లు వెంట తీసుకెళ్లాలి. తనిఖీల్లో లభించిన నగదుకు సరైన ఆధారాలు చూపిస్తే.. వదిలేస్తారు.

– లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏసీపీ, మహేశ్వరం

3 రోజుల్లో 30 వేల మద్యం తాగేశాడు!

వాహనచోదకులను బెదిరించి డబ్బు వసూళ్లు

- నిందితుడిని పట్టుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: యాక్సిడెంట్ చేసి పట్టించుకోకుండా వస్తున్నావంటూ బెదిరించి వసూళ్లకు పాల్పడే ఓ యువకుడు కేవలం 3 రోజుల్లో రూ.30 వేల విలువైన మద్యం తాగేశాడు. బోయిన్‌పల్లికి చెందిన నిందితుడు ఆ ప్రాంతానికి చుట్టూ ఉన్న సిగ్నల్స్‌ను టార్గెట్‌గా చేసుకుని ఈ పని చేస్తున్నాడు. ఈ పంథాలో దోపిడీలకు పాల్పడుతున్న వినీత్‌ను ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు గురువారం డీసీపీ ఎస్.రష్మి పెరుమాళ్ వెల్లడించారు. బోయిన్‌పల్లిలోని వైశ్యా బ్యాంక్ కాలనీకి చెందిన షరోన్ వినీత్ గతంలో హైటెక్ సిటీ, మైండ్ స్పేస్‌ల్లో పని చేశాడు. మద్యానికి బానిసగా మారి ఉద్యోగాలను కోల్పోయాడు. జల్సాలకు అలవాటు పడిన వినీత్ అందుకు అవసరమైన నగదు కోసం నేరాలు చేయసాగాడు. నిత్యం మద్యం మత్తులో తన ద్విచక్ర వాహనంపై సంచరిస్తూ సిగ్నళ్ల వద్ద ఆగినప్పుడు అటు–ఇటు ఉన్న వాహన చోదకులను గమనిస్తాడు. కాస్త అమాయకంగా, హడావుడిగా కనిపించిన వాళ్లను ఎంచుకుని వెంబడిస్తాడు. అనువైన ప్రాంతాన్ని ఎంచుకుని వారి వాహనానికి తన బైక్ అడ్డు పెడతాడు. ఫలానా ప్రాంతంలో నా బండిని ఢీ కొట్టి ఆగకుండా వచ్చేస్తున్నావంటూ వాగ్వాదానికి దిగుతాడు. తన బైక్‌కి ఉన్న పాత దెబ్బల్ని చూపిస్తూ, తనకూ లోలోపల గాయాలయ్యాయంటూ గగ్గోలు పెడతాడు. వినీత్ ప్రధానంగా ఉదయం కార్యాలయాలకు వెళ్లే, సాయంత్రం ఇళ్లకు తిరిగి వచ్చే వారినే టార్గెట్ చేసుకుంటాడు. దీంతో వాళ్లు ఇతడితో వాగ్వాదానికి దిగలేక ఎంతో కొంత ఇచ్చి వెళ్లిపోతుంటారు. జేబులో నగదు లేని వాళ్లతో ఇతగాడు ఏకంగా గూగుల్ పే చేయించుకుంటున్నాడు. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ పంథా మొదలెట్టిన వినీత్ ఇప్పటి వరకు 20 నుంచి 30 మందిని బెదిరించి డబ్బు గుంజాడు. ఈ నెల 15, 16వ తేదీల్లో ఇతగాడు ఇద్దరి నుంచి రూ.28 వేలు కాజేశాడు. వీళ్ల ఫిర్యాదుతో కార్ఖానా, బేగంపేట పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నిందితుడిని పట్టుకోవడానికి నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి విచారించగా నేరాలు అంగీకరించాడు. ఇద్దరి వద్ద నుంచి దోచేసిన రూ.28 వేలతో పాటు తన వద్ద ఉన్న మరో రూ.2 వేలను వినీత్ మూడు రోజుల్లో మద్యం తాగడానికి ఖర్చు చేసినట్లు గుర్తించిన పోలీసులు అవాక్కయ్యారు.

సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ భారీ మోసాలు

- నలుగురు నిందితుల అరెస్ట్
- దేశవ్యాప్తంగా 128 కేసుల్లో
- రూ. 18 కోట్లు కొల్లగొట్టిన వైనం


సాయికుమార్


సాయిగౌడ్


నరేశ్ బాబు


సురేంద్ర

హిమాయత్‌నగర్: దేశవ్యాప్తంగా భారీ మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న నలుగురు వ్యక్తులను నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న వారికి బ్యాంక్ ఖాతాలు అందిస్తున్న తమనం సురేంద్ర, నరేష్ బాబును సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన మహిళను గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ గ్రూప్ గోల్డ్‌మన్ (ఇండియా) సాచ్స్ సెక్యూరిటీస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్‌లో యాడ్ చేసి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. పలు దఫాలుగా పెట్టుబడి పెట్టించి రూ. 57,37,536 కాజేశారు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తమనం సురేంద్ర, ఉప్పల్‌కు చెందిన దామచర్ల నరేష్ బాబు సైబర్ నేరగాళ్లు ఇచ్చే కమీషన్లకు ఆశపడి వారికి బ్యాంక్ ఖాతాలను అందించినట్లు గుర్తించిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి ల్యాప్‌టాప్, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరు సైబర్ నేరగాళ్లకు 8 అకౌంట్లను అందించారని, ఆయా ఖాతాల ద్వారా దేశవ్యాప్తంగా 83 కేసుల్లో రూ. 5 కోట్లు లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. ఇదే కేసులో మరో ఇద్దరు నిందితులు నెల్లూరుకు చెందిన జగదీష్, భరత్ దాసినేని పరారీలో ఉన్నట్లు తెలిపారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో టోకరా

క్రిప్టో ట్రేడింగ్ బిజినెస్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ప్రచారం చేస్తూ సైబర్ చీటర్స్‌కు సహకరించిన సాయి గౌడ్, సాయికుమార్ అనే వ్యక్తులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి సహకారంతో సైబర్‌నేరగాళ్లు దేశవ్యాప్తంగా నమోదైన 45 కేసుల్లో రూ. 13 కోట్లు కాజేసినట్లు తెలిపారు. అందులో మూడు కేసులు తెలంగాణకు చెందినవని పేర్కొన్నారు.

వేధింపులు తాళలేకే...

- నాగోలు హత్య కేసులో వీడిన మిస్టరీ
- పథకం ప్రకారం హత్య చేసిన స్నేహితులు


వివరాలు వెల్లడిస్తున్న ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ పరుశురామ్

నాగోలు: నాగోలు పోలీస్ స్టేషన్‌లో పరిధిలో ఈనెల 19 న జరిగిన హత్య కేసులో మిస్టరీ వీడింది. ముగ్గురిని నిందితులను నాగోల్ పోలీస్‌లు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఎల్ బీనగర్ ఏసీపీ కృష్ణయ్య వివరాలిలా ఉన్నాయి. నాగోలు, ఈశ్వరిపురికాలనీకి చెందిన దేరంగుల మల్లికార్జున్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. న్యూ నాగోలు సమతాపురి కాలనీ చెందిన కొప్పుల అర్జున్ యాదవ్, బోడుప్పల్, మణికంఠనగర్‌కు చెందిన కుంచల ఓంకార్, అహ్మద్‌నగర్‌కు చెందిన మల్లెల మహేశ్ అతడికి స్నేహితులు. అయితే మద్యానికి బానిసైన మల్లికార్జున్ తరచూ డబ్బుల కోసం వారిని వేధిస్తుండటమేగాక చంపుతానని బెదిరిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో గతంలో ఓ సారి ఓం కార్‌పై మల్లికార్జున్ కత్తితో దాడి చేశాడు. ఎప్పటికైనా మల్లికార్జున్‌తో తమకు ముప్పు తప్పదని భావించిన వారు ముగ్గురు అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు.

ఇదిలా ఉండగా ఈనెల 18న మల్లికార్జున్ అర్జున్ యాదవ్ ఇంటికి వెళ్లి మద్యం కోసం డబ్బులు కావాలంటూ వారి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. అదే రోజు రాత్రి మహేష్‌తో కలిసి మద్యం తాగిన అతను మద్యం మత్తులో మహేష్‌పై కత్తితో దాడి చేశాడు. దీంతో అతడిని ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్న అర్జున్ యాదవ్, ఓంకార్, మల్లెల మహేష్ ఈనెల 19న ఉదయం రామంతాపూర్‌లోని ఓ బార్‌లో కలుసుకున్నారు. మల్లికార్జున్ తన మిత్రుడు అజయ్‌తో లక్ష్మీనర్సింహకాలనీ సమీపంలోని మూసీ పరిసరాల్లో మద్యం తాగుతున్నట్లు తెలుసుకున్న వారు ముగ్గురు కారులో అక్కడికి వెళ్లారు. అదే సమయంలో మద్యం తీసుకువచ్చేందుకు అజయ్ జైపురికాలనీ కాలనీకి వెళ్లగా ఒంటరిగా ఉన్న మల్లికార్జున్‌పై మూకుమ్మడిగా దాడి చేసి అక్కడి నుండి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం ఉదయం ఆనంద్‌నగర్ చౌరస్తాలో కారులో వెళ్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. నిందితులు అర్జున్ యాదవ్, ఓంకార్, మల్లెల మహేష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయనున్నట్లు ఏసీపీ తెలిపారు. వారి నుంచి కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

ఉబర్ రైడర్‌పై కేసు నమోదు

వెంగళరావునగర్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఉబర్ రైడర్‌పై కేసు నమోదు చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌కు చెందిన మహిళ ప్రెస్ రిపోర్టర్‌గా పని చేస్తోంది. ఈ నెల 20 ఆఫీసుకు వెళ్లేందుకు ఉబర్ బైక్ బుక్ చేసుకుంది. ఉబర్ రైడర్ ఎం.నరేందర్ ఆమెను ఎక్కించుకుని జీటీఎస్ టెంపుల్ రాజీవ్‌నగర్ వైపు వెళుతుండగా రాంగ్‌వేలో ఎందుకు వెళుతున్నావని ఆమె ప్రశ్నించింది. దీంతో నరేందర్ ఆమెను దుర్భాషలాడటమేగాక చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఉబర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామంటూ..

రూ.కోటి టోకరా

ఉప్పల్: తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని నమ్మించి ఓ మహిళ అందిన కాడికి దండుకుని పారిపోయిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తన భర్త వెంకటరావు బంగారం వ్యాపారం చేస్తాడని అతి తక్కువ ధరకు బంగారాన్ని ఇప్పిస్తానని నమ్మించి పలువురు మహిళల నుంచి నగదు, నగలు తీసుకుంది. పాత నగలు తీసుకుని కొత్త నగలు చేయిస్తానని, సమయానికి నగలు అందివ్వలేకపోతే వడ్డీ చెల్లిస్తానని ప్రచారం చేసుకుని రూ. కోటికి పైగా వసూలు చేసింది. నగలు ఇవ్వాలని, లేని పక్షంలో నగదు ఇవ్వాలని బాధితులు ఒత్తిడి చేయడంతో తప్పించుకు తిరుగుతోంది. దీంతో బాధితురాలు స్వప్న తోపాటు మరికొందరు మహిళలు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చీటింగ్ కేసులో దంపతుల అరెస్ట్


నిందితులు శ్యామ్‌కుమార్


వర్షిణి

మల్కాజిగిరి: ప్రైవేట్ గోల్డ్ లోన్ సంస్థలను మోసం చేసిన కేసులో దంపతులను మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే..మౌలాలి ప్రాంతానికి చెందిన దీకొండ శ్యామ్‌కుమార్, దాసరి రజిని అలియాస్ దీకొండ వర్షిణి దంపతులు గత కొంత కాలంగా వేరే గోల్డ్ లోన్ సంస్థలో ఉన్న తమ బంగారాన్ని విడిపించి మీ వద్ద కుదవపెడతామని నమ్మించి పలు గోల్డ్ లోన్ సంస్థలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారు. ఇదే తరహాలో మల్కాజిగిరిలోని కెఎల్‌ఎం యాక్సివా ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్‌లో దాదాపు రూ. 14 లక్షలు కాజేశారు. కంపెనీ నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మల్కాజిగిరి పోలీసులు గురువారం మౌలాలిలో నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి కారు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.11 లక్షల నగదును సీజ్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. వీరిపై కీసర, కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ కేసులు నమోదైనట్లు తెలిపారు.

'టిమ్స్' పనులు వేగవంతం చేయాలి

అధికారులకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో టిమ్స్ హాస్పిటల్, మహేశ్వరం మెడికల్ కాలేజీ పనుల పురోగతిపై ఆమె కలెక్టర్ శశాంకతో కలిసి సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్తపేట టిమ్స్ హాస్పిటల్ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఎల్‌అండ్‌టీ ఇంజినీర్స్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సెక్రటరీ ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ వాణి, గచ్చిబౌలి టిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ విమల థామస్, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్లు జానకి, విజయలక్ష్మి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

రూ. 17.4లక్షల నగదు స్వాధీనం

మైలార్‌దేవ్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న మైలార్‌దేవ్ పల్లి పోలీసులు శాస్త్రీపురం ప్రాంతంలో గురువారం రూ.17.4 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మైలార్‌దేవ్‌పల్లి బృందావన్ కాలనీకి చెందిన ఆదిత్య అనే వ్యక్తి రూ.17.4 లక్షల నగదును తీసుకువెళుతున్నట్లు శాస్త్రీపురం ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు గుర్తించారు. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని డీటీవోకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు కిందపడి మహిళ మృతి

నల్లకుంట: ఆర్టీసీ బస్సు కింద పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గాన్ల లలిత(50) వెంకటస్వామి దంపతులు అడిక్‌మెట్ రైల్వే గేట్ సమీపంలో నివాసముంటున్నారు.లలిత ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆయాగా పని చేస్తోంది. గురువారం సాయంత్రం ఆమె నల్లకుంట పోలీస్ స్టేషన్ సమీపంలోని బస్ స్టాప్‌కు చేరుకుంది. అదే సమయంలో అఫ్జల్‌గంజ్ నుంచి కూషాయిగూడ వెళుతున్న ఆర్టీసీ బస్సు రావడంతో వెనుక నుంచి బస్సు ఎక్కేందుకు ప్రయత్నించిన ఆమె అదుపు తప్పి కింద పడింది. బస్సు వెనక చక్రాలు ఆమె మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలతో మంగారి రాజేందర్, చిత్రంలో ఆచార్య తంగెడ కిషన్ రావు

నాంపల్లి: తెలుగు సాంస్కృతిక, సామాజిక రంగంలోని వివిధ ప్రక్రియల్లో విశేష సేవలందించిన 23 మంది ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం-2022వ సంవత్సరానికి గాను కీర్తి పురస్కారాలను ప్రదానం చేసింది. గురువారం వర్సిటీ ఆడిటోరియంలో వీసీ ఆచార్య తంగెడ కిషన్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమి డైరెక్టర్ డాక్టర్ మంగారి రాజేందర్(జింబో) ముఖ్య అతిథిగా హాజరై పురస్కారాలను అందజేశారు. ఒక్కొక్కరికి రూ.5,116 నగదు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. అనంతరం మంగారి రాజేందర్ మాట్లాడుతూ... కళలు, సాహిత్యం మనిషి జీవితంతో నిరంతరం ముడిపడి ఉంటుందని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.వీసీ తంగెడ కిషన్ రావు పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేస్తూ వారు సమాజానికి చేస్తున్న సాహిత్య, సామాజిక, సాంస్కృతిక కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా వర్సిటీ జానపద కళల శాఖాధిపతి డాక్టర్ లింగయ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన ప్రదర్శన ఆకట్టుకుంది.

పురస్కార గ్రహీతలు వీరే...

ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు(సాహిత్య విమర్శ), కొల్లాపురం విమల(మహిళాభ్యుదయం), కొడాలి వెంకటేశ్వరరావు(లలిత సంగీతం), ప్రసన్నకుమారి(శాస్త్రీయ సంగీతం), ఎస్.కె.బాబూజీ(జానపద కళలు), రంగరాజు పద్మజ(ఉత్తమ రచయిత్రి), నామని సుజాతాదేవి(ఉత్తమ రచయిత్రి), డాక్టర్ కె.శ్రీదేవి(నవల), లలితారాజ్(ఉత్తమ నటి), మోహన్ సేనాపతి(ఉత్తమ నటుడు), గరికపాటి కాళిదాస్(నాటకరంగంలో కృషి), డాక్టర్ ఆర్.ఎల్.వి.రమేష్((ఆంధ్రనాట్యం), డాక్టర్ ఎస్.పి.భారతి(కూచిపూడి నృత్యం), జి.వి.ఎస్.రాజు (వ్యక్తిత్వ వికాసం), షరీఫ్ గోరా(హేతువాద ప్రచారంలో కృషి), డాక్టర్ చేగొని రవికుమార్(గ్రంథాలయ సమాచార విజ్ఞానం), అనుముల శ్రీనివాస్(గ్రంథాలయకర్త), మాదిశెట్టి గోపాల్(సాంస్కృతిక సంస్థ నిర్వాహణ), బి.వి.సత్య నగేష్(ఇంద్రజాలం), మృత్యుంజయ(కార్టూనిస్ట్), డాక్టర్ నూనె వెంకటయ్య (జ్యోతిషం), సి.రామనాథ శర్మ(ఉత్తమ ప్రధానోపాధ్యాయులు), గౌరవి వేములు (చిత్రలేఖనం)

ఏసీబీ వలలో లీగల్ మెట్రాలజీ సిబ్బంది

తూ.కొ.శాఖ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్ అరెస్ట్



సాక్షి,సిటీబ్యూరో: తూనికల యంత్రాలకు సంబంధించి స్టాంపింగ్, లైసెన్స్ పునరుద్ధరణ కోసం లంచం తీసుకుంటూ తూనికలు, కొలతల శాఖ రంగారెడ్డి జిల్లా ఇన్‌స్పెక్టర్, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు చిక్కారు. కొత్తూరులోని నాట్కో ఫార్మా లిమిటెడ్ 25 ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలకు స్టాంపింగ్, లైసెన్స్‌ల పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుతో యంత్రానికి రూ. 400 చొప్పున రూ. 10 వేలు ఇవ్వాలని సంబంధిత అధికారులు డిమాండ్ చేయడంతో సదరు లైసెన్స్‌దారు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం లైసెన్స్ దారు రంగారెడ్డి జిల్లా ఇన్‌స్పెక్టర్ సింగబోయిన ఉమారాణి, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ మల్లేశంలకు రూ. 10 వేలు నగదు అందిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులోని ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ అధికారులు తెలిపారు.

స్థానిక భాషల్లో ఐపీఎల్ ప్రత్యక్ష ప్రసారం

- తెలుగుతో పాటు ఇతర భాషల్లో వ్యాఖ్యాతలను ప్రకటించిన జియో సినిమా..
- తెలుగులో హనుమ విహారి, హర్యానీలో వీరేంద్ర సెహ్వాగ్, ఇంగ్లిష్‌లో గేల్, డివిల్లీర్స్ తదితరులు..

JioCinema

సాక్షి, సిటీబ్యూరో: టాటా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 కోసం భారత క్రికెట్ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎదురు చూస్తున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ మ్యాచ్‌లు హైదరాబాద్‌తో పాటు దేశంలోని విభిన్న నగరాల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లను జియో సినిమా వేదికగా స్థానిక భాషల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నామని యాజమాన్యం తెలిపింది. ఇందులో భాగంగా జియో సినిమా ఇంగ్లిష్‌తో పాటు మొత్తం 12 భారతీయ భాషాల్లో మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాలను ఉచితంగా అందిస్తోందన్నారు. తెలుగులో హనుమ విహారి, వెంకటపతి రాజు, అక్షత్ రెడ్డి, ఆశిష్ రెడ్డి, సందీప్ బవనక, కళ్యాణ్ కొల్లారపు, ఆర్జే హేమంత్, ప్రత్యూష, ఆర్జే కౌశిక్, సునీత ఆనంద్ వ్యాఖ్యానం చేయనున్నారు. తెలుగుతో పాటు ఇంగ్లిష్, హిందీ, మరాఠి, గుజరాతి, భోజ్‌పూరి, పంజాబీ, బెంగాలి, తమిళ్, మలయాళం, కన్నడ, హర్యాని భాషాల్లో దిగ్గజ క్రికెటర్ల కామెంట్రీతో మ్యాచ్‌లను ప్రసారం చేయనుంది. జియో సినిమా తొలిసారిగా హర్యానీలో ప్రసారాలను ప్రారంభిస్తుండడం విశేషం. ప్రముఖ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ హర్యానీ భాషలో వ్యాఖ్యానం చేయనున్నాడు. ఇంగ్లిష్‌లో క్రిస్ గేల్, ఏబీ డివిల్లీర్స్, షేన్ వాట్సన్, ఇయాన్ మోర్గాన్, బ్రెట్‌లీ, అనిల్ కుంబ్లే, రాబిన్ ఊతప్ప, గ్రేమ్ స్మిత్, హిందీలో జహీర్ ఖాన్, సురేష్ రైనా, పార్థివ్ పటేల్, ఆర్పీ సింగ్, ప్రజ్ఞాన్ ఓజా మరాఠీలో కేదార్ జాదవ్ గుజరాతీలో అజేయ్ జడేజా, భోజ్‌పురిలో మహ్మద్ సైఫ్ ఇలా ఇతర భాషల్లో తదితర క్రీడా ప్రముఖులు వ్యాఖ్యానం చేయనున్నారు.

త్వరలో భారత్- ఆఫ్రికాలో హుక్‌వార్మ్ వ్యాక్సిన్

అమెరికా సైంటిస్ట్, ప్రొఫెసర్ పీటర్ జె హోటెజ్

గచ్చిబౌలి: రక్తహీనతతో బాధపడుతున్న వారి కోసం త్వరలో భారత్- ఆఫ్రికాలో హుక్‌వార్మ్ వ్యాక్సిన్ అందుబాటులోకి రానుందని అమెరికా టీకా శాస్త్రవేత్త, శిశు వైద్యుడు, బేలర్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌లో నేషనల్ స్కూల్ ఆఫ్ ట్రాఫికల్ మెడిసన్ డీన్ ప్రొఫెసర్ పీటర్ జె హోటెజ్ తెలిపారు. గురువారం గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌లో 'గ్లోబల్ వ్యాక్సినేషన్ ఫర్ నెగ్లెక్టెడ్ డిసీజెస్ అండ్ రిలేటెడ్ ఇంటెస్టినల్ ఇన్‌ఫెక్షన్స్' అంశంపై ఆయన ప్రసంగించారు. హుక్‌వార్మ్ సోకిన వారు రక్త హీనతతో బాధపడతారని, వారి సంఖ్య భారత్‌తో పాటు ఆఫ్రికాలో ఎక్కువగా ఉందన్నారు. తాను కనుగొన్న హువార్మ్ వ్యాక్సిన్ రక్త హీనతను తగ్గిస్తుందని తెలిపారు. అమెరికాలో వ్యాక్సినేషన్‌ను రాజకీయం చేస్తున్నారన్నారు. చిన్నారుల మాదిరిగానే 18 ఏళ్లకు పైబడిన వారందరు ప్రొటోకాల్ ప్రకారం వ్యాక్సిన్ తీసుకుంటే చాలా రోగాలను అరికట్టవచ్చని సూచించారు. ఏఐజీ హస్పిటల్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఏఐజీ హాస్పిటల్‌లో పెద్దలకు(18 ఏళ్లు పైబడిన వారికి) నిమోకోకల్, ఇన్‌ఫ్లూయెంజా, హెపటైటీస్-ఏ, హెపటైటీస్-బి, షింగ్లెస్ తదితర వ్యాక్సిన్ అందుబాటులో ఉంచామన్నారు. అంటు వ్యాధులు నివారించేందుకు, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వ్యాక్సిన్‌లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. హుక్‌వార్మ్ సోకి రక్త హీనతతో బాధపడే వారిని తాము ప్రత్యక్షంగా చూశామని, వ్యాక్సిన్ అందుబాటులోకి మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఏటా మిలియన్ మంది హుక్‌వార్మ్ బారిన పడుతున్నారని, దేశంలో 100 మిలియన్ మంది ఈ వ్యాధి బారిన పడినట్లు అంచనా ఉందన్నారు. కార్యక్రమంలో అమెరికాకు చెందిన మరియా ఎలీనా, డాక్టర్లు విక్రం, డాక్టర్ హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.



అమెరికా టీకా శాస్త్రవేత్త, ప్రొఫెసర్ పీటర్ జె హోటెజ్, చిత్రంలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి

హత్య కేసులో తల్లీకొడుకు అరెస్టు

వివాహేతర సంబంధమే కారణం

చార్మినార్: పాతబస్తీ కోట్ల అలీజాలో ఈనెల 18న జరిగిన యువకుడి హత్య కేసులో తల్లీ కొడుకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య వివరాలు వెల్లడించారు. ఉప్పల్ పీర్జాదిగూడకు చెందిన వాజీద్, పాతబస్తీ కోట్లా అలీజాకు చెందిన నిసార్ అహ్మద్ స్నేహితులు. వాజిద్ వ్యక్తిగత అవసరాల నిమిత్తం, నిస్సార్ అహ్మద్ వద్ద నుంచి రూ. 4లక్షలు అప్పుగా తీసుకున్నాడు. వాజిద్ తరచూ వారి ఇంటికి వస్తూ నిస్సార్ అహ్మద్ తల్లితో వివాహేతర కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో వాజిద్‌ను హత్య చేయాలని నిసార్ నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 18న తల్లితో వాజిద్‌కు ఫోన్ చేయించి పాతబస్తీలోని తన ఇంటికి పిలిపించుకున్నాడు. అతడు రాగానే అప్పటికే బెడ్ రూమ్‌లో దాక్కుని ఉన్న నిస్సార్ అహ్మద్ వాజిద్‌పై కత్తితో దాడి చేసి విచక్షణా రహితంగా పొడవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం తల్లీ కొడుకులు రక్తపు మరకలను కడిగి అక్కడినుంచి పరారయ్యారు. దీనిపై సమాచారం అందడంతో మీర్ చౌక్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం ఉదయం వారు నగరం విడిచి వెళ్లేందుకు ఎంజీబీఎస్‌కు వెళుతున్నట్లు సమాచారం అందడంతో ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సినీ ఫక్కీలో బాలుడి కిడ్నాప్


కిడ్నాప్‌కు గురైన ఇషాన్‌రెడ్డి..

సుభాష్‌నగర్: సినీ ఫక్కీలో ఓ బాలుడిని అపహరించిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేపింది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గాజులరామారం ఓక్షిత ఎన్‌క్లేవ్ రాజశేఖర్‌రెడ్డి, సుజాత దంపతులు ఇషాన్‌రెడ్డి (04)తో కలిసి నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం అతను భార్య, కుమారుడిని తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి వచ్చాడు. సూజాత చెకప్ చేయించుకునేందుకు లోపలికి వద్దకు వెళ్లగా రాజశేఖర్‌రెడ్డి కుమారుడితో పాటు బయటే ఉన్నాడు. అదే సమయంలో వారి పక్క కూర్చున్న ఓ మహిళ రాజశేఖర్‌రెడ్డితో మాటలు కలిపింది.. 'మీ భార్య లోపల ఉన్నట్లున్నారు, మీరు కూడా ఆమె వద్దకు వెళ్లండి, మీ అబ్బాయిని నేను చూసుకుంటాను, మొబైల్ ఫోన్ ఇచ్చి వెళ్లండి ఇక్కడే ఆడుకుంటాడని నమ్మబలికింది'.. ఆమె మాటలు నమ్మిన రాజశేఖర్‌రెడ్డి వైద్యుడి వద్దకు వెళ్లి 5 నిముషాల్లో తిరిగి వచ్చేసరికి కుమారుడు కనబడలేదు. పిల్లలతో ఉన్న సదరు మహిళ సైతం కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన వారు చుట్టు పక్కల వెతికినా ఫలితం కనిపించలేదు. తమ కుమారుడిని సదరు మహిళే కిడ్నాప్ చేసి ఉంటుందని రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీకాల సర్పాల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఫిలింనగర్: ఫిలింనగర్ దైవసన్నిధానంలో శ్రీకాల సర్పాల విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో రెండో రోజైన గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామవార్ల విగ్రహాలకు జలాధివాసం, పుష్పాధివాసం, ధాన్యాధివాసం పూజాదికాలు నిర్వహించారు. నేడు ఆలయంలో ఉదయం 8 గంటలకు విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ వర్గాలు తెలిపాయి. వేడుకల్లో దైవసన్నిధానం చైర్మన్ మంచు మోహన్‌బాబు పాల్గొంటున్నారని వారు తెలిపారు.

వేడుకగా స్వామివారి తృతీయ పుష్కరోత్సవాలు



బంజారాహిల్స్: అపోలో ఆస్పత్రి ఆవరణలో ఉన్న శ్రీ ఆనందవల్లి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తృతీయ పుష్కరోత్సవ వేడుకలు ఆలయంలో వైభవంగా జరుగుతున్నాయి. అయిదు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా గురువారం ఆలయంలో ద్వారకాతోరణ పూజ, చతుస్థానార్చన, వేద ఇతిహాస పురాణ, స్తోత్ర పారాయణాలు, పెరుమాళ్లకు నవకలశ స్నపన తిరుమంజనం, వాహన సేవ, పూర్ణాహుతి నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన భట్టాచార్యులు తెలిపారు. ఆలయంలో జరిగిన ఈ పూజాదికాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



లిబర్టీ: ప్రతి ఒక్కరు మానవత్వంతో ముందుకొచ్చి రక్తదానం చేయాలని.. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే అది ప్రాణదానంతో సమానమని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన రక్తాదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రధానంగా యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాన్ని కాపాడవచ్చునని తెలిపారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం

లిబర్టీ: సృజనాత్మక సాహిత్యాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని విస్తృతస్థాయిలో కవిత్వం రాయాల్సిన అవసరం ఉందని రయితలకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని అభ్యుదయ రచయితల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమాజంలో అనేక సమస్యలు రుగ్మతులు, మూఢనమ్మకాలు ఉన్నాయని వాటిని వస్తువుగా తీసుకోని కవిత్వం రాసి ప్రజల్లోకి ఆలోచన చేయడం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అల్మారాలో దాచిన బంగారు ఉంగరాలు మాయం

వెంగళరావునగర్: అల్మారాలో దాచిన బంగారు ఉంగరాలు మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్పీఆర్‌హిల్స్‌లో ఉండే పి.శశిరేఖ అనే మహిళ ఈ నెల 17న తన గదిలోని అల్మారాలో రెండు బంగారు ఉంగరాలు దాచింది. బయటకు వెళ్లి వచ్చేలోగా ఉంగరాలు మాయం అయ్యాయి. మల్లీశ్వరి, దయానంద్ అనే వ్యక్తులపై తనకు అనుమానం ఉన్నట్టుగా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ద్విచక్ర వాహనం మాయం

ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలివీ... యాదగిరినగర్‌లోని జి.హరిగంగ ప్రసాద్ ఈ నెల 19న తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి ఇంట్లో పడుకున్నాడు. ఉదయం చూడగానే ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

‘కోడ్’ కూసిన వేళ..!



ఫిలింనగర్‌లో విగ్రహాలకు ముసుగులు వేస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రధాన రోడ్లతో పాటు పలు కూడళ్లు, కాలనీలు, బస్తీల్లో ఉన్న ఫ్లెక్సీలు, గోడరాతలను జీహెచ్ఎంసీ సిబ్బంది పూర్తిగా తొలగిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు నెలల నుంచి ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల చాలా గోడలపై ఓ పార్టీ నేతలు పెద్ద ఎత్తున గోడ రాతలు రాయించారని దీంతో అవి కనిపించకుండా రంగులు వేయడానికి కాస్త సమయం పడుతున్నదని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా ప్రధాన కూడళ్లలో ఉన్న అన్ని విగ్రహాలకు అధికారులు ముసుగులు వేయిస్తున్నారు. రాజకీయాలను ప్రభావితం చేసే విధంగా ఉన్న ఏ గుర్తులను కూడా అధికారులు వదలడం లేదు.

యువకుడి అదృశ్యం

వెంగళరావునగర్: స్నేహితులను కలిసి వస్తానని చెప్పిన కుమారుడు తిరిగి ఇంటికి రాలేదని ఓ తండ్రి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... కందుకూరి ప్రసాద్ వాచ్‌మెన్‌గా పనిచేస్తూ రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. తన కుమారుడు ధన్‌రాజ్ ఏడాది కిందట ఉద్యోగం పోవడంతో ఖాళీగా ఉంటున్నాడు. ఈ నెల 17న తన స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని డబ్బులు తీసుకుని వెళ్లాడు. ఎన్నిసార్లు ఫోన్లు చేసినా స్విచాఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాన్ దుకాణానికి వెళ్లిన మహిళ...

పాన్ దుకాణానికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. జి.రేణుక ప్రైవేట్ జాబ్ చేస్తూ రహమత్‌నగర్‌లో ఉంటుంది. ఆమె తల్లి ఎస్.లక్ష్మమ్మ అప్పుడప్పుడు పాన్ షాపునకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేది కాదు, చుట్టుపక్కలవారు, తెలిసిన వ్యక్తులు ఆమెను తీసుకుని వచ్చేవారు. ఈ నెల 20న పాన్ షాపునకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో రేణుక మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

భవన నిర్మాణ వ్యర్థాలపై నిర్లక్ష్యాన్ని సహించం

ఎప్పటికప్పుడు తొలగించాలి

- నిర్మాణదారులకు అవగాహన కల్పించాలి
- ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే



మాట్లాడుతున్న ఖైరతాబాద్ జెడ్‌సీ హేమంత్ బోర్కాడే

బంజారాహిల్స్: భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా వేస్తున్నారని, దీని వల్ల పారిశుద్ధ్య సమస్యతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే అన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలపై గురువారం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ... నిర్మాణ వ్యర్థాలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయని, ఇళ్ల ముందు, రోడ్ల పక్కన కుప్పలుగా పోస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎప్పటికప్పుడు ఎందుకు తరలించడం లేదని, ఎందుకలా కుప్పలుగా పోస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంలో నిర్లక్ష్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించమని స్పష్టం చేశారు. నిర్మాణ వ్యర్థాలను రోడ్డు పక్కన పోస్తే వారికి తగిన జరిమానా విధించాలని సూచించారు.

- అలాగే నిర్మాణ వ్యర్థాలను జీహెచ్ఎంసీ టిప్పర్ల ద్వారా తరలించేందుకు తగిన రుసుము కూడా వసూలు చేసి, ఈ విషయంలో అందరికీ అవగాహన కలిగించాలన్నారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, సోమాజీగూడ, ఖైరతాబాద్, మెహిదీపట్నం ప్రాంతాల్లో ఎక్కువగా నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.
- ఇల్లు నిర్మించే క్రమంలో తమ పాత ఇళ్లను కూల్చే పరిస్థితుల్లో నిర్మాణ వ్యర్థాలు భారీగా పేరుకుపోతున్నాయని, కొన్నిచోట్ల ఫుట్‌పాత్‌లు కూడా నిండిపోతున్నాయని, రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.
- సంబంధిత అధికారులు ఈ విషయంలో ప్రజలకు అవగాహన కలిగిస్తూ కఠినంగా వ్యవహరించాలని వెల్లడించారు. లారీలు నిర్మాణ వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో, రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై వేస్తున్నప్పుడు వాటిని గుర్తిస్తే వారిపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని, జరిమానాలు కూడా విధించవచ్చని సూచించారు.
- ఎప్పటికప్పుడు భవన నిర్మాణ వ్యర్థాలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహిస్తూ సూచనలు జారీ చేస్తున్నా యధావిధిగా సమస్య అలాగే ఉంటుందని, ఈ విషయంలో ఉప కమిషనర్లు తగిన రీతిలో పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
- మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ ఉప కమిషనర్లు నాగేశ్వరరావు, శశిరేఖ, విద్యాధర్, జగన్, ప్రశాంతి, ఏఎంఓహెచ్‌లు విజయరమణ మోహన్‌రావు, అనురాధ, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ, రజనీకాంత్ పాల్గొన్నారు.

పద్మశాలీలకు రాజ్యసభ, ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వండి

హిమాయత్‌నగర్: రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న పద్మశాలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక రాజ్యసభ, నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు, ఆరు కార్పొరేషన్‌ల చైర్మన్‌లుగా అవకాశం కల్పించి పద్మశాలీల అభ్యున్నతి తోడ్పడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరెపల్లి రవికుమార్ మాట్లాడుతూ... పద్మశాలీల చిరకాల కోరిక ‘పద్మశాలీ ఫైనాన్స్ కార్పొరేషన్’ను ప్రభుత్వం ఏర్పాటు చేసినందుకు సంఘం తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చేనేత రంగం సరైన పెట్టుబడి లేక చితికి పోతున్నందున ఆదుకోవడానికి పద్మశాలీలు జీవనోపాధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. రాష్ట్ర జనాభాలో 12 శాతం ఉన్న పద్మశాలీల ఆర్థిక పరిపుష్టి కొరకు పద్మశాలీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు నిరంతరం ప్రభుత్వం సమకూర్చాలని కోరారు. సంఘం కోశాధికారి కొండ సహదేవ్, సహయ కార్యదర్శి చిప్ప నవీన్, సభ్యులు కుసుమ విజయ, దేవులపల్లి రాధిక, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో ‘చిట్ చాట్ ఛాయ్’



ఔషధ మొక్కల తేనీటి ఉత్పత్తులను చూపిస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్: యూనిక్ కాన్సెప్ట్‌తో ఔషధ మొక్కలతో నగరవాసులకు తేనీటి రుచులు అందించేందుకు చిట్‌చాట్ చాయ్ సంస్థ తన స్టోర్‌ను బంజారాహిల్స్‌రోడ్ నెం. 4లో గురువారం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో నగరంలోని పలువురు సోషలైట్స్‌తో పాటు పేజ్3 సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పూర్ణ తేజ మాట్లాడుతూ ఇది దేశంలోనే తొలి స్పెషాలిటీ టీ బార్ అని సరికొత్త రుచులతో పాటు ఆరోగ్యాన్ని సైతం అందించే విభిన్న రకాల తేనీటిని అందించేందుకు దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.ఎల్.నారాయణ్, హరీష్ చంద్రప్రసాద్, యార్లగడ్డ శ్రీదేవి, స్వాతి సంఘి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు గ్లూకోన్-డి ప్యాకెట్ల పంపిణీ



గ్లూకోన్-డి ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్

బంజారాహిల్స్: ఎండలు మండుతుండటంతో రోడ్లపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు డీహైడ్రేషన్ సమస్య తలెత్తకుండా గ్లూకోన్-డి ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయి ప్రకాష్‌గౌడ్ తెలిపారు. గురువారం బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పోలీసులకు ఆయన గ్లూకోన్-డి ప్యాకెట్లను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ... వేసవి తీవ్రత నుంచి వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు గ్లూకోన్-డి తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య నుంచి బయటపడవచ్చన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా పోలీసులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

ఎవడిగోల వాడిదే..!



మల్లెమాల ముందు లీకవుతున్న నీళ్లలో బైక్‌ను కడుగుతున్న వాహనదారుడు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని ప్రసాద్ ల్యాబ్స్ ఎదురుగా మల్లెమాల ముందు భారీగా నీటి పైప్ లీకేజీ అయ్యింది. అయితే ఓ వాహనదారుడు లీకవుతున్న నీళ్ల వద్ద తన బైక్‌ను ఆపి దానిని కడుక్కోవడం అటు నుంచి వెళ్తున్న వాహనదారులను ఆశ్చర్యానికి గురిచేసింది. అసలే వేసవి.. ఆపై ఇళ్లల్లో నీటి కొరత.. ఇదే అదునుగా భావించిన సదరు స్కూటరిస్టు లీక్ అవుతున్న నీళ్ల వద్ద తన బైక్‌ను కడిగి తళతళ మెరిసేలా చేసుకున్నాడు. అటు నుంచి వెళ్తున్న వాహనదారులు వింతగా చూస్తున్నా ఆ స్కూటరిస్టు మాత్రం ఇవేమీ పట్టకుండా తన పని తాను చేసుకుంటూపోయాడు. మొత్తానికి లీకవుతున్న నీళ్లు ఈ రకంగానైనా ఉపయోగపడుతున్నాయని సదరు వాహనాదారుడు సంబరపడ్డాడు.

తెలుగు టెలివిజన్ చరిత్రలో ‘కార్తీకదీపం’ సంచలనం



ప్రసాద్‌ల్యాబ్స్‌లో సందడి చేసిన కార్తీకదీపం నటీనటులు

బంజారాహిల్స్: తెలుగు టెలివిజన్ చరిత్రలో కార్తీకదీపం సీరియల్ సంచలనం సృష్టించిందని, అత్యధిక రేటింగ్స్‌తో బుల్లితెర ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిందని కార్తీకదీపం సీరియల్ ఫేమ్ నిరుపమ్, ప్రేమి విశ్వనాథ్ అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో కార్తీకదీపం టీం సందడి చేస్తూ కార్తీకదీపం-2 వివరాలను వెల్లడించారు. ఈ నెల 25 నుంచి సోమవారం నుంచి శనివారం వరకూ రాత్రి 8 గంటల నుంచి స్టార్ మాలో కార్తీకదీపం-2 ప్రసారం అవుతుందని తెలిపారు. బలమైన కథతో అనురాగాలు, అనుబంధాలు, అవమానాలు, అనుమానాలు, అపనిందలు ఓ కుటుంబంలో ఎలావస్తాయో తెలుపుతూ కార్తీకదీపం ప్రేక్షకులను రంజింపజేసిందని, ఇప్పుడు కార్తీకదీపం-2 (ఇది నవవసంతం) కూడా మరింత రక్తికట్టించే సంఘటనలు, పాత్రలతో ముందుకు వస్తుందని చెప్పారు.

‘ఓటుతో గుణపాఠం చెప్పాలి’



మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

లిబర్టీ: ఓటు ఆయుధంతో ఓటర్లు రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు గొప్ప ఆయుధమని దళిత బహుజనులను విస్మరించిన రాష్ట్ర అభివృద్ధిని ప్రజాసంక్షేమ విస్మరించిన ప్రధాన రాజకీయ పార్టీలను లోక్‌సభ ఎన్నికల్లో తిరస్కరించాలని పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బహుజనులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరించారని ఆరోపించారు. దళిత బహుజనులను చట్టసభల్లోకి పంపితే ప్రజావానిని వినిపిస్తారని దళిత బహుజనుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. కొత్త కొత్త వాగ్దానాలతో హామీలతో ప్రజలను మభ్యపెట్టి కేంద్రంలో రాష్ట్రంలో అధికారం రావాలని కాంగ్రెస్ భారత రాష్ట్ర సమితి, బీజేపీలు ప్రయత్నిస్తున్నాయని ఆయా పార్టీలను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తిరస్కరించాలని కోరారు. నేతలు ఇటికాల గణేష్, బి.సతీష్‌కుమార్, నక్క దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు శుభాకాంక్షలు



గవర్నర్‌ను కలిసిన భీంరెడ్డి, నవీన్‌యాదవ్ తదితరులు

రహమత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.పి.రాధాకృష్ణన్‌ను ఇండియన్ రెడ్ క్రాస్ అసోసియేషన్ హైదరాబాద్ డిస్టిక్ చైర్మన్ భీంరెడ్డి, హైదరాబాద్ డిస్టిక్ చీఫ్ పార్టున్ నవీన్ యాదవ్ గురువారం రాజ్‌భవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్ క్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని తమకు గవర్నర్ సూచించినట్లు వారు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు జ్యోతి, సాయినాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

‘రాజకీయ కుట్రలో భాగమే కవిత అరెస్టు’

పంజగుట్ట: ఎమ్మెల్సీ కవిత అరెస్టు కేవలం రాజకీయ ప్రయోజనాలు తప్ప మరేమీ లేవని, కేసీఆర్‌ను మానసికంగా ఇబ్బందులకు గురిచేసేందుకు చేసిన కుట్రలో భాగమే అని యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచంద్రయ్య ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంబీసీ కమిషన్ మాజీ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, ముప్పు భిక్షపతి మాట్లాడుతూ... ఒక మహిళ, మాజీ ముఖ్యమంత్రి కూతురు, ఎమ్మెల్సీ అని చూడకుండా ప్రధాని నరేంద్రమోదీనే ఈడీ రూపంలో వచ్చి ముందుగానే టిక్కెట్లు కూడా బుక్ చేసుకుని అన్యాయంగా అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కవిత రిమాండ్ తొలగించి విడుదల చేయాలని, ఆమెను కేవలం ఒక సాక్షిలా చూడాలని, ముద్దాయిలా చూడకూడదని డిమాండ్ చేశారు. సమావేశంలో దత్తాత్రేయ, నాగేందర్, గీత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎర్రగడ్డ బీఆర్ఎస్ నేతలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ బీఆర్ఎస్ సీనియర్ నేతలు గంట మల్లేష్, ఎర్ర కృష్ణకుమార్, మహ్మద్ సర్దార్‌తో పాటు 150 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. నేతలు మోసిన్ ఖురేషి, రవిగౌడ్, పోతురాజు నర్సింగరావు, ఎన్.ఎస్.కె.ఆకాష్, రమేష్‌నాయక్, గంట శ్రీనివాస్, భిక్షపతి, బాలయ్య, యాదయ్య, గణేష్, రంగారావు, సురేష్, రాజు, దీపక్, రాజా, యాదిలాల్, గంట ధనరాజ్, దయానంద్ పాల్గొన్నారు.

నీటి దందాపై అధికారుల కొరడా

బోరబండలో నాలుగు బోర్లు, లారీ సీజ్



బోర్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

రహమత్‌నగర్: అనుమతి లేకుండా నీటి వ్యాపారం చేసే వారిపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. బోరబండ డివిజన్‌లో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ దందా గుట్టు రట్టు చేశారు ఖైరతాబాద్ మండల రెవెన్యూ అధికారులు. వివరాలివీ... బోరబండ డివిజన్ సైట్-3 కాలనీ, అనుకుని ఉన్న అల్లాపూర్, పద్మావతీనగర్, మాదాపూర్ డివిజన్‌లు ఉన్నాయి. ఇవన్నీ వేర్వేరు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోకి వస్తాయి. ఆయా ప్రాంతాల్లో చాలా కాలంగా అక్రమంగా నీటి వ్యాపారం కొనసాగుతున్నది. మూడు మండలాలు కావడంతో అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో వీరి వ్యాపారాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అయితే సైట్-3 ప్రాంతంలో బోర్‌వెల్స్ సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం, నీటిని తరలించే ట్యాంకర్ల రాకపోకలు పెరిగిపోవడంతో స్థానికులు ఖైరతాబాద్ మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అసలు కథ బయట పడింది. స్థానికుల ఫిర్యాదుతో మూడు రోజుల క్రితం సైట్-3 వచ్చిన ప్రత్యేక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌రాజ్, ఆర్ఐ విజయ్, సిబ్బంది ఇదే నాలుగు బోర్లు, బోర్‌వెల్ లారీని సీజ్ చేశారు.

‘జాయిన్ డెవోప్స్’ క్లౌడ్ ఇంజినీరింగ్ విద్యకు మార్గదర్శకం



శివకుమార్‌రెడ్డి

బంజారాహిల్స్: ప్రాంతీయ భాషల్లో నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో స్థాపించబడిన ‘జాయిన్ డెవోప్స్’ నేడు క్లౌడ్ ఇంజినీరింగ్ విద్యకు మార్గదర్శకమైందని వ్యవస్థాపకుడు శివకుమార్‌రెడ్డి మెట్టుకూరు తెలిపారు. బంజారాహిల్స్ గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రారంభమైన నాటి నుంచి డెవోప్స్ తెలుగు భాషా బోధన ద్వారా క్లౌడ్ ఇంజనీరింగ్‌లో 4,500 మంది విద్యార్థులకు సాధికారతను అందించడం జరిగిందన్నారు. టెక్ మహీంద్రా, డీబీఎస్, హెచ్‌సీఎల్, ఎల్టీఐ మైండ్ ట్రీతో సహా ప్రఖ్యాత కంపెనీలోల 3,500లకు పైగా విద్యార్థుల ప్లేస్‌మెంట్‌ను సులభతరం చేసినట్లు చేశారు. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 215,000 యూఎస్‌డీ ఆదాయాన్ని ఆర్జించందన్నారు. డెవోప్స్‌ను క్లౌడ్ ఇంజనీరింగ్ విద్య ప్రముఖ ప్రొవైడర్‌గా, జాయిన్ డెవోప్స్‌ను విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడం కోసం నెలకొల్పబడిందన్నారు. తెలుగు రాష్ట్రాల మార్కెట్ అవసరాలను తీర్చడానికి తెలుగు, జాతీయ మార్కెట్ కోసం ఆంగ్లంలో ఆయా కోర్సులను అందించడం జరుగుతుందన్నారు.

దారిని ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాన్ని అడ్డుకోండి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీలో ఓ నిర్మాణదారుడు ఏకంగా దారిని కబ్జా చేస్తూ రోడ్లపైకి మెట్లు వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బస్తీవాసులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు నిర్మాణదారుడికి దారిని ఆక్రమించి కట్టుకోవద్దని బస్తీవాసులందరూ ఇబ్బంది పడతారని పలుమార్లు చెప్పినా వినిపించుకోవడం లేదని బస్తీవాసులు ఆరోపించారు. ఈ నిర్మాణం ఇలాగే జరిగితే భవిష్యత్‌లో మరిన్ని గొడవలు జరిగే అవకాశం ఉంటుందని అక్రమ నిర్మాణాన్ని అడ్డుకొని సమస్యను పరిష్కరించాలంటూ బస్తీకి చెందిన మహిళలు వరలక్ష్మి, ప్రభావతి, సుకన్య, మాధవి, రాధ తదితరులు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్



ఖైరతాబాద్: ఆంగ్ల భాషా ప్రావీణ్యంపై నైపుణ్యాన్ని అంచనా వేయడం కోసం ఐఐఎంసీ కళాశాలలో ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. గురువారం ఐఐఎంసీ ఆంగ్లభాషా విభాగం, ప్లానెట్ ఫైనాన్స్ బిజినెస్ స్కూల్, ఐఎంఎస్ లెర్నింగ్ రీసోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 40 కళాశాలల నుంచి 590 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆంగ్ల భాష వ్యక్తీకరణకు సంబంధించి 100 ప్రశ్నలతో 60 నిమిషాల పాటు పరీక్ష నిర్వహించారు. టాలెంట్ టెస్ట్ అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సెయింట్ ఆన్స్ కళాశాలకు చెందిన శ్రీజ మొదటి బహుమతిగా రూ. 6 వేలు, రెండవ బహుమతిగా లక్ష్మికి ఐఐఎంపీ కళాశాల రూ. 4 వేలు, సెయింట్ జార్జిస్ ఉమెన్స్ కళాశాల నుంచి గ్లోరియా కరిష్మాకు, ఐఐఎంసీ కళాశాల కామిక్షి కశ్వితో పాటు మరో నలుగురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇలాంటి పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలపై పట్టు సాధించడంతో పాటు వారిలోని ప్రావీణ్యాన్ని వెలికితీయవచ్చని ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు.

క్లుప్తంగా...

ప్రణీత్‌రావు పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం తన విచారణ జరగడం లేదంటూ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కస్టడీ సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించడం లేదని, పీఎస్‌లో నిద్రపోవడానికి సరైన సౌకర్యాలు లేవని, విచారణ పూర్తైన తర్వాత తిరిగి జైలుకు తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరడంతోపాటు పోలీస్ కస్టడీకి ఇస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ప్రణీత్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌లో వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి.. పిటిషన్‌ను కొట్టివేస్తూ గురువారం తీర్పు వెలువరించారు. 2023లో అక్రమంగా ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్ ట్యాంపింగ్‌కు ప్రణీత్‌రావు పాల్పడ్డారు. ఇది చాలా తీవ్ర నేరమని.. నిబంధనల మేరకే ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేస్తోందని వాదనల సందర్భంగా పీపీ నివేదించారు. సాక్ష్యాలను అందించడంలో భాగంగానే రమేశ్ విచారణ జరిగే ప్రాంతానికి వచ్చారు తప్ప.. విచారణలో పాల్గొనలేదన్నారు. 4 రోజుల కస్టడీ పూర్తయిందని, మరో 3 రోజులు మాత్రమే ఉందని చెప్పారు. పీపీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ప్రణీత్‌రావు పిటిషన్ కొట్టివేశారు.

నా కొడుకును రక్షించండి

అబ్దుల్ మహ్మద్ ఆర్పద్ తండ్రి సలీం వేడుకోలు

మల్లాపూర్(హైదరాబాద్): అమెరికాలో కిడ్నాప్‌నకు గురైన తన కొడుకు అబ్దుల్ మహ్మద్ ఆర్పద్‌ను కాపాడాలని తండ్రి అబ్దుల్ సలీం ఆవేదనతో వేడుకుంటున్నాడు. నాచారం ఏరియాకు చెందిన ఆర్పద్‌ను అమెరికాలో డ్రగ్స్ మాఫియా కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. గురువారం మీడియాతో మాట్లాడుతూ రెండు రోజులైనా ఫోన్ రాకపోవడంతో అక్కడే ఉన్న తమ బంధువులకు సమాచారం ఇచ్చినా, వారికి కూడా అతని ఆచూకీ తెలియలేదన్నారు. కిడ్నాపర్ల చెర నుంచి తన కొడుకు రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

పోలీసుల ఆరా

ఆర్పద్ కిడ్నాప్ విషయం తెలుసుకున్న నాచారం పోలీసులు తండ్రి సలీంను పీఎస్‌కు పిలిచి ఆరా తీశారు. ఆర్పద్ ఎప్పుడు అమెరికాకు వెళ్లాడు.. చివరిసారి ఎప్పుడు మాట్లాడాడు, అమెరికాలో ఎక్కడ ఉంటున్నాడు.. ఇంతకు ముందు ఎవరైనా అక్కడ బెదిరింపులకు పాల్పడుతున్నట్టు చెప్పాడా అనే కోణంలో వివరాలు అడిగారు.

యాదాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


గురువారం యాదాద్రిలో ప్రధాన కలశంతో పాటు వెండి, బంగారు కలశాలకు పూజలు చేస్తున్న ఆచార్యులు, యజ్ఞాచార్యులు.

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ప్రధానాలయంలో వేకువజామున నిత్య పూజలు నిర్వహించిన ఆచార్యులు వేద మంత్రాలతో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శ్రీస్వామి అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకం చేశారు. 108 కలశాలలో ఫల రసాలతో, పంచామృతాలతో, శుద్ధ జలంతో స్వయంభూలకు, బంగారు ప్రతిష్టామూర్తులకు వేద మంత్రాలు, పారాయణాలతో శత ఘటాభిషేక మహోత్సవం జరిపారు. రాత్రి 9.30 గంటలకు శ్రీస్వామి వారికి శృంగార డోలోత్సవం ఘనంగా జరిపించి ఉత్సవాలకు ముగింపు పలికారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రద్దు చేసిన నిత్య కళ్యాణం, సుదర్శన నారసింహ హోమం వేడుకలు శుక్రవారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. కాగా ఉదయం, సాయంత్రం జరిగిన వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు, అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ధర్మపురి నృసింహుడి కల్యాణం


నృసింహుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ధర్మపురి: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన గురువారం ఆలయంలోని శేషప్ప వేదికపై ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. ప్రభుత్వం తరఫున కలెక్టర్ యాస్మిన్ బాషా పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటలవరకు వేడుక జరిపించారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ రాంబాబు డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అజ్ఞాతంలోకి ప్రభాకర్‌రావు!

ప్రణీత్‌రావు సస్పెండ్ కాగానే ఎస్ఐబీ మాజీ చీఫ్ అప్రమత్తం

- ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు పోలీసుల అనుమానం
- మాజీ డీఎస్పీ కస్టడీ ముగిసిన తర్వాత హైకోర్టును ఆశ్రయించే అవకాశం
- 2018 నుంచే మొదలైన అక్రమ ట్యాపింగ్ దందా
- ఇజ్రాయెల్ నుంచి అత్యాధునిక ఉపకరణాలు ఖరీదు



సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు అజ్ఞాతంలోకి వెళ్లినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈయన ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు భావిస్తున్నారు. ప్రణీత్ రావు కేసును అక్కడి నుంచే నిశితంగా గమనిస్తున్న ప్రభాకర్‌రావు.. అతని పోలీసు కస్టడీ ముగిసిన తర్వాత హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోపక్క సిట్ అధికారులు ప్రణీత్ రావును ఐదో రోజైన గురువారమూ బంజారాహిల్స్ ఠాణాలో ప్రశ్నించారు. తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాల ఆధారంగా మరో నలుగురు పోలీసులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. వీళ్లు గతంలో 'ప్రభాకర్‌రావు సైన్యం'లో కీలక సభ్యులని సమాచారం.

హోదా ఏదైనా బాధ్యత మాత్రం చీఫే

రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొన్నాళ్లు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) డీసీపీగా పని చేసిన ప్రభాకర్‌రావును ప్రభుత్వం ఏరికోరి ఎస్ఐబీకి డీఐజీని చేసింది. ఐజీగా పదోన్నతి పొందినా అక్కడే కొనసాగారు. చివరకు 2020లో పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును నాటి ప్రభుత్వం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా నియమించింది. హోదా ఏదైనా ఎస్ఐబీ చీఫ్‌గానే కొనసాగారు. ఇలా ఏళ్లుగా అక్కడ పాతుకుపోయిన ప్రభాకర్‌రావు తనకంటూ ఓ సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

గత ఎన్నికల నేపథ్యంలోనే అడ్డదారి

ఎస్ఐబీలో 2017 వరకు లీగల్ ఇంటర్‌సెప్షన్ (ఎల్ఐ)గా పిలిచే అధికారిక ట్యాపింగ్ మాత్రమే జరిగింది. అయితే ఆ తర్వాత ఎన్నికలు సమీపిస్తుండటం, ప్రతిపక్ష పార్టీలు పుంజుకోవడం గమనించిన ప్రభాకర్‌రావు, అప్పటి కొందరు కీలక రాజకీయ నాయకులు.. అక్రమ ట్యాపింగ్‌పై దృష్టి పెట్టారు. అయితే ప్రతిపక్ష నేతలు తరచుగా వేర్వేరు నంబర్లతో సంప్రదింపులు జరుపుతుండటంతో ప్రభాకర్‌రావు బృందం రష్యా, ఇజ్రాయెల్‌లో పర్యటించి వచ్చింది. ఆయా దేశాల్లో అందుబాటులో ఉన్న ఆధునిక ట్యా పింగ్, ఇతర నిఘా పరికరాలను పరిశీలించి వచ్చింది. ఏవేవి ఖరీదు చేయాలో చెప్పాల్సిందిగా పేర్కొంటూ కొందరు పెద్దలకు నివేదిక సమర్పించింది.

కొనుగోలులో కీలక పాత్ర పోషించిన రవి పాల్

టెక్నికల్ అనుభవం ఉన్న రవి పాల్ అనే నిపుణుడు గతంలో ఇంటెలిజెన్స్ విభాగానికి కన్సల్టెంట్, అడ్వైజర్‌గా పని చేశారు. ప్రభాకర్‌రావుతో పాటు కొందరు కీలక అధికారులతో సన్నిహితంగా మెలిగారు. రవి పాల్ సూచన మేరకు ప్రభాకర్‌రావు ఇజ్రాయెల్ నుంచి సూట్‌కేస్‌లో ఇమిడిపోయి ఉండే అక్రమ ట్యాపింగ్ పరికరం ఖరీదు చేశారు. దీన్ని ప్రణీత్‌రావు టీమ్ ఓ వాహనంలో పెట్టుకుని టార్గెట్ చేసిన వ్యక్తి ఇల్లు, కార్యాలయం సమీపంలో మాటు వేసేది. ఈ పరికరానికి 300 మీటర్ల పరిధిలో ఉన్న ప్రతి ఫోన్ ద్వారా జరిగే కమ్యూనికేషన్ తెలుసుకునే సామర్థ్యం ఉంది.

'ఆదిలాబాద్'కోసం వినియోగించారు

2018లో ఆదిలాబాద్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సమయంలోనూ ఎస్ఐబీ అధికారులు ఈ బ్రీఫ్‌కేస్ ఉపకరణాన్ని వినియోగించారు. రెండు వర్గాలకు చెందిన కీలక నేతలు ఇద్దరిని పట్టుకోగలిగారు. ఈ వ్యవహారాల్లో ప్రణీత్ రావుకు కుడిభుజంగా వ్యవహరించిన ఆరుగురు అధికారులను సిట్ గుర్తించింది. వీరిలో ఇద్దరి నుంచి ఇప్పటికే వాంగ్మూలాలు నమోదు చేయగా.. మరో నలుగురికి విచారణకు హాజరుకావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

ప్రణీత్‌రావు సస్పెన్షన్‌తో అలెర్ట్

గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పిడి జరిగిన వెంటనే ప్రభాకర్‌రావు తన ఓఎస్డీ పోస్టుకు రాజీనామా చేశారు. ఆపై కొన్నాళ్లు హైదరాబాద్‌తో పాటు తన స్వగ్రామంలో ఉన్నారు. అయితే ఈ నెల మొదటి వారంలో ప్రణీత్ రావుపై సస్పెన్షన్ వేటు పడటంతో అప్రమత్తం అయ్యారు. కుటుంబంతో కలిసి విహార యాత్రకు వెళ్తున్నట్టు చెప్పి నగరం దాటిన ప్రభాకర్‌రావు అట్నుంచి అటు అమెరికా వెళ్లిపోయారని పోలీసులు భావిస్తున్నారు. ప్రణీత్ రావు కస్టడీ ముగిసిన తర్వాత ప్రభాకర్‌రావు విషయంలో పోలీసు విభాగం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

సమీక్షలో సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. పోలీసు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, అటవీ, రెవెన్యూ, రవాణా తదితర శాఖల అధికారులతో గురువారం ఆమె సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎలా పనిచేశారో.. అదే స్ఫూర్తితో రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలని కోరారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు ఆయా రాష్ట్రాల చెక్ పోస్టులతో కలసి సమన్వయంతో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో కూడా వివిధ శాఖలు చెక్ పోస్టులను ఏర్పాటు చేశాయన్నారు. ఇప్పటివరకు పోలీసు శాఖ రూ.10 కోట్ల నగదు, పలు లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులను నిల్వ చేసేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. మరో 141 గోదాములు, 912 వివిధ వస్తువుల తయారీ కేంద్రాలపై కూడా నిఘా ఉంచామన్నారు. మద్యం అక్రమ రవాణాకు అవకాశమున్న ఐదు రైలు మార్గాలను గుర్తించి మద్యం నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో డీజీపీ రవిగుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పీసీసీఎఫ్ డోబ్రియల్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అడిషనల్ డీజీ ఎస్.కె. జైన్ పాల్గొన్నారు.

ఎన్నికల బందోబస్తుకు 145 కంపెనీల కేంద్ర బలగాలు

- ఇప్పటికే రంగంలోకి 60 కంపెనీలు
- శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్ తెలిపారు. ఎన్నికల తేదీనాటికి మొత్తం 145 కంపెనీల కేంద్ర బలగాలు బందోబస్తు విధుల్లో ఉండే అవకాశం ఉన్నట్టు చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని గురువారం ఆయన 'సాక్షి'కి తెలిపారు. స్థానిక పోలీసులతోపాటు ఇప్పటికే 60 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రవ్యాప్తంగా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నట్టు వెల్లడించారు. నిబంధనల ప్రకారం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి కనీసం మూడుకు తగ్గకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 440 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.10 కోట్ల వరకు నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నామని సంజయ్‌కుమార్ జైన్ వెల్లడించారు.

నగర వార్తలు

వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు

- రాచకొండ సీపీ తరుణ్‌జోషి
- మహిళలు, యువతులను వేధించిన ఆకతాయిలకు కౌన్సెలింగ్

నాగోలు: బాలికలను, మహిళలను వేధించే వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ తరుణ్‌జోషి తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత 16 నుంచి 29 వరకు 130 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఆకతాయిలను రాచకొండ షీ టీమ్స్ పట్టుకున్నారు. మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తున్న 121 మందిలో 64 మేజర్స్, 57 మైనర్స్ ఉన్నారు. ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఎన్‌జీవో వారి ఆధ్వర్యంలో పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ తరుణ్ జోషీ మాట్లాడుతూ మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తి లేదని అన్నారు. అన్ని ప్రాంతాల్లో మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. రాచకొండ వాట్సాప్‌లో నంబర్: 87126 62111లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. షీ టీమ్స్ డీసీపీ ఉషావిశ్వనాథ్, ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి హామీతో సమ్మె విరమిస్తున్నాం'

స్టోన్ క్రషర్స్ అసోసియేషన్ ప్రతినిధుల స్పష్టీకరణ

బంజారాహిల్స్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న స్టోన్ క్రషర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి కోమటిరెడ్డి హామీతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. గురువారం బంజారాహిల్స్‌లోని జింఖానా క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు నందిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్‌లు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె విరమించి స్టోన్ క్రషర్స్ నేటి సాయంత్రం నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తాయని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వపరంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేనందున సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని మంత్రి చెప్పడంతోనే తాత్కాలికంగా సమ్మెను విరమించినట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కరిస్తామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. అసోసియేషన్ సభ్యులు మోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, వీరారెడ్డి, రాంరెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కోటి సమర్పయామి!

జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితి ఎంత అధ్వానంగా ఉన్నా.. నెలనెలా సిబ్బంది జీతాల చెల్లింపులకు ఇబ్బందులెదురవుతున్నా.. కొత్త పనులు చేసేందుకు నిధులు లేకున్నా.. అట్టహాసాలు, ఆడంబరాలతో నిధులు దుబారా చేయడం అలవాటుగా మారింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు జూన్‌లో నగర శివార్లలోని కొల్లూరులో, సెప్టెంబర్‌లో ప్రతాపసింగారంలో రెండు ప్రాంతాల్లో డబుల్ ఇళ్ల ప్రారంభోత్సవాల సందర్భంగా ఏర్పాట్ల పేరిట దాదాపు రూ.కోటి ఖర్చు చూపారు. ఇతర లొకేషన్లలోని ప్రారంభోత్సవాలనూ లెక్కిస్తే ఇది మరింత ఎక్కువే.. - సాక్షి, సిటీబ్యూరో

- రెండు చోట్ల ఇళ్ల ప్రారంభోత్సవాలకే రూ.కోటి ఖర్చు పెట్టారు
- అత్యవసరం పేరిట టెండరు లేకుండానే ఏజెన్సీలకు అప్పగింత
- 'డబుల్' ఇళ్ల అట్టహాసానికి జీహెచ్ఎంసీ దుబారా

◆ కొల్లూరులో నిర్మించిన 15,660 డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయానికి కేసీఆర్ నగర్ డిగ్నిటీ హౌసింగ్ కాలనీగా నామకరణం చేశారు. ఆ కాలనీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్నారు. దాన్ని ఆసరా చేసుకొని సీఎం హాజరయ్యే కార్యక్రమంటూ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పనుల్ని ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. సాధారణంగా నైతే టెండర్లు ఆహ్వానించి ఎవరు తక్కువ కోట్ చేస్తే వారికి అప్పగిస్తారు. కానీ, సమయం లేదంటూ టెండరు లేకుండానే నామినేషన్‌పై డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. రూ.87 లక్షలు ఖర్చయినట్లు పేర్కొన్నారు.

◆ ప్రతాపసింగారంలో 2208 ఇళ్ల కాలనీని అప్పటి డిప్యూటీ స్పీకర్ ప్రారంభించారు. ప్రారంభోత్సవ ఏర్పాట్ల పేరిట రూ.10.15 లక్షలు ఖర్చు చేశారు. దానినీ సమయాభావం పేరిట జాయింట్ వెంచర్‌గా ఆర్ఎస్‌సీ-ఆర్‌కేఐ, ఎస్ఎస్ఎస్‌సీ అనే సంస్థలకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈలెక్కన రెండు ప్రాంతాల్లో ప్రారంభోత్సవాల ఏర్పాట్ల అట్టహాస ఖర్చు రూ. 97.15 లక్షలు కాగా, ఇతరత్రా ఖర్చులు వెరసి దాదాపు రూ.కోటి ఖర్చు చేశారు. అందుబాటులోని నిధులను ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. అందుకు ఆమోదం కోసం ఇటీవల జరిగిన జీహెచ్ఎంసీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ముందుంచారు.

హడావుడిగా ఆమోద ముద్ర..

◆ సర్వసభ్య సమావేశాల్లో రెండు మూడు అంశాలపైనే గందరగోళాలు చెలరేగి, హడావుడిగా సభను ముగించడం ఆనవాయితీగా వస్తోంది. సభ ముగించడానికి ముందు అజెండాలోని మిగతా అంశాలపై చర్చ జరగకపోయినా, 'డీమ్డ్ అప్రూవ్డ్' అని పేర్కొంటూ గంపగుత్తగా ఆమోద ముద్ర వేస్తారు. అజెండా అంశాలు పదుల సంఖ్యలో ఉండటంతో వాటిల్లో ఏవేవి ఉన్నాయో పట్టించుకునే సమయం, శ్రద్ధ సభ్యులకు ఉండదు. దాన్ని ఆసరా చేసుకునే పలు అంశాలను ఆమోదించినట్లుగా భావించనైనది (డీమ్డ్ అప్రూవ్డ్) పేరిట హడావుడిగా అంగీకార ముద్ర వేస్తారు. పేదల గౌరవ సముదాయాలకు ఘనంగా ప్రారంభోత్సవాలు చేయాల్సిందే కానీ.. ఖర్చు మరీ భారీగా కనిపిస్తుండటంతో నిధులు దుబారా చేశారని లేదా తప్పుడు లెక్కలు చూపారనే అనుమానాలకు ఆస్కారమిస్తోంది.

ఆ డబ్బుతో పది ఇళ్లు కట్టొచ్చు..

గ్రేటర్ పరిసరాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లకు ఒక్కో ఇంటి నిరాణ ఖర్చు అంతస్తులను బట్టి రూ. 7.75 లక్షల నుంచి రూ.8.65 లక్షలు. ఒక్క సముదాయంలో ప్రారంభోత్సవ ఏర్పాట్ల ఖర్చు రూ. 87 లక్షలంటే.. ఆ మొత్తంతో పది ఇళ్లను నిర్మించవచ్చు. గ్రేటర్ శివార్లలో 27 ప్రాంతాల్లో, జీహెచ్ఎంసీ పరిధిలో దాదాపు 40 ప్రాంతాల్లో ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల నిర్మాణం చేపట్టారు. అన్ని ప్రాంతాల్లో ప్రారంభోత్సవాల ఖర్చులు పరిగణనలోకి తీసుకుంటే ఈ లెక్కన ఎంతవుతుందో ఊహించుకోవచ్చు. ఓవైపు అవసరం ఉన్నా లేకపోయినా జీహెచ్ఎంసీ పాలక మండలిలోని ముఖ్యనేతలు,అధికారుల చాంబర్ల కోసం, అదనపు హంగుల కోసం కోట్లు ఖర్చు చేస్తున్న జీహెచ్ఎంసీ.. మరోవైపు వివిధ కార్యక్రమాలు, ఫంక్షన్ల సందర్భంగానూ నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తోందనడానికి ఇది ఓ ఉదాహరణ.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వడం ఖాయం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


మంత్రి పొంగులేటిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్

కాచిగూడ: అర్హులైన జర్నలిస్టులందరికీ ఏడాదిలోపు ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్లాన్ చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత దీనిపై పూర్తి సమీక్ష జరిపి ప్రణాళిక తయారు చేస్తామని చెప్పారు. గురువారం గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తదితరులు మంత్రి పొంగులేటిని కలిసి తమ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో పదేళ్లుగా జర్నలిస్టులు అన్యాయానికి గురయ్యారని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారు. జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలను ఏకతాటిపై తీసుకువచ్చి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఐక్య కల్నరి ఒలింపిక్స్ పోటీల్లో నగర విద్యార్థులకు మెడల్స్


క్రీడాకారులను అభినందిస్తున్న కిషన్‌రెడ్డి

కాచిగూడ: క్రీడలకు నరేంద్రమోదీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఇటీవల జర్మనీలో జరిగిన ఐక్య కల్నరి ఒలింపిక్స్ పోటీలలో నగరానికి చెందిన చెన్నై అమృత ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌కు చెందిన విద్యార్థులు లైఫ్ కార్వింగ్ పోటీలలో గోల్డ్ మెడల్స్ సాధించారు. గురువారం మెడల్స్ సాధించిన విద్యార్థులను కిషన్ రెడ్డి బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ మెడల్స్ సాధించే క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం చేయూతనందిస్తుందన్నారు. గోల్డ్‌మెడల్స్ ను శ్రేయ అనీష్, జగన్, పునీత్‌లు సిల్వర్ మెడల్స్‌ను అకాష్, అంకిష్‌లు సాధించారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ 124 సంవత్సరాల తరువాత భారత్ ఈ పోటీలలో మెడల్స్ సాధించిందని తెలిపారు. 67 దేశాలకు చెందిన 2,400 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభాపాటవాలను ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ భూమినాథన్, ప్రిన్సిపల్ చంద్రమోహన్, సీఈఓ కవిత, నందకుమార్, రీజనల్ హెడ్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు మాదిగ ద్రోహ పార్టీలే..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ

పంజగుట్ట: కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ మాదిగ ద్రోహ పార్టీలే అని, ఆ పార్టీల్లోని మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులు, ఓటు వేసేవారు ఇకపై వారికి ఓటు వేయరాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. రెండు పార్టీలకు ఎస్సీ వర్గీకరణ, మాదిగల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వడంలో చిత్తశుద్ధి లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో జెండాలు మోసి, జైకొట్టేది మాదిగలు, అధికారం చెలాయించేది మాత్రం మాలలా అన్నారు. వర్గీకరణ వెయ్యి శాతం కేవలం బీజేపీతోనే సాధ్యమని, అందుకే బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే బీజేపీ వరంగల్, నాగర్‌కర్నూల్ రెండు స్థానాలు మాదిగలకు కేటాయించి చిత్తశుద్ధి చాటుకుందన్నారు.



వైద్య సదుపాయాల కల్పనలో ఎన్నారైల పాత్ర అభినందనీయం


రోగులకు పండ్లు అందజేస్తున్న బండారు దత్తాత్రేయ, మంత్రి దామోదర రాజనర్సింహ

నాంపల్లి: వైద్య సదుపాయాల కల్పనలో ఎన్నారైల పాత్ర అభినందనీయమని హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం వారు రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జె కేన్సర్ ఆసుపత్రిలో కేన్సర్ నివారణపై శ్రీనివాసన్ మునుస్వామి, రాధా అద్దంకి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కేంద్రాలను పరిశీలించారు. సొంత నిధులతో శానిటేషన్, సెక్యూరిటీ అండ్ అవేర్‌నెస్ కార్యక్రమాలను చేపడుతున్న డాక్టర్ శరత్ అద్దంకిని గవర్నర్ దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు అవసరమైన సదుపాయాల కల్పనలో ఎన్నారైలు, ఫార్మా కంపెనీల పాత్ర అభినందనీయమన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంఎన్‌జె ఆసుపత్రి అందిస్తున్న వైద్య సేవలను డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు వివరించారు. ఈ సందర్భంగా వారు కేన్సర్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శరత్ అద్దంకి, ట్రస్టీ మిక్ గల్లెర్, ప్రోగ్రామ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, బీజేపీ నేతలు కాంతికిరణ్, మంగళారపు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ యజ్ఞబోర్డును ఏర్పాటు చేయండి

సర్వోదయ మండలి అధ్యక్షుడు శంకర్ నాయక్


సమావేశంలో శంకర్ నాయక్

కాచిగూడ: అన్యాక్రాంతమైన భూదాన భూములను రక్షించేందుకు, ఉన్న భూదాన భూములను పేదలకు పంపిణీ చేసేందుకు భూదాన్ యజ్ఞబోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు ఆర్.శంకర్ నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సర్వోదయ మండలి కార్యాలయంలో భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్యం, ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల విలువైన భూదాన్ భూములు బడా భూకబ్జాదారులు, మైహోం రామేశ్వర్ రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి వంటి భూబకాసురుల కోరల్లో చిక్కుకున్నాయని, భూదాన్ భూములను ప్రైవేట్ భూములుగా చూపించి ధరణి పోర్టల్‌లో కూడా ఎక్కించారని తెలిపారు. అవకతవకలకు పాల్పడ్డ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

సర్వోదయ మండలి కమిటీ ఎన్నిక

తెలంగాణ సర్వోదయ మండలి రంగారెడ్డి జిల్లా నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేష్, ఉపాధ్యక్షులుగా రమేష్, గోవిందమ్మ, కార్యదర్శిగా యాదమ్మ, సహాయ కార్యదర్శులుగా విజయ, పరశురాముడు, ప్రత్యేక ప్రతినిధిగా భాస్కర్, కోశాధికారిగా పి.సూర్యంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ సర్వోదయ మండలి నేతలు వై.గిరిప్రసాద్, యాదమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

కేరాఫ్ కోటయ్య చౌదరి

విశాఖ పోర్టులో దొరికిన 25వేల కిలోల డ్రగ్స్...

సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కేంద్రంగా భారీ డ్రగ్స్ దందా

బ్రెజిల్ నుంచి కంటైనర్లో విశాఖ పోర్టుకు..
25 వేల కిలోల డ్రై ఈస్ట్‌తో కలగలిపి కొకైన్ దిగుమతి..
సంధ్యా ఆక్వా పేరిట డెలివరీ

విశాఖ సిటీ/ సాక్షి, అమరావతి : అచ్చం సినిమాను తలపించే రీతిలో విదేశాల నుంచి విశాఖ పోర్టుకు వచ్చిన నౌకలో భారీ స్థాయిలో డ్రగ్స్‌ను సీబీఐ అధికారులు పట్టుకున్నారు. ఇంటర్‌పోల్ సమాచారంతో ఆపరేషన్ గరుడలో భాగంగా ఎవరికీ అనుమానం రాకుండా డ్రై ఈస్ట్‌తో కలిపి బ్యాగుల్లో ప్యాక్ చేసిన ఈ డ్రగ్స్ కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్‌లో 25 కేజీల చొప్పున 1000 బ్యాగ్‌లు.. మొత్తంగా 25 వేల కిలోల ఇనాక్టివ్ డ్రై ఈస్ట్‌తో మిక్స్ అయిన డ్రగ్స్ ఉండటంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. ఎవరిదీ కంటైనర్.. అని విచారణ మొదలుపెట్టగానే.. ఈ స్మగ్లింగ్ దందా వెనుక టీడీపీ నేతల పాత్ర ఉందనే విషయం బట్టబయలైంది. తీగ లాగితే డొంక కదిలినట్లు ఇందులో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబ, వ్యాపార సంబంధాలూ బయటపడ్డాయి. బ్రెజిల్ దేశంలోని శాంటోస్ పోర్టు నుంచి బయలుదేరిన 'జిన్ లియన్ యన్ గ్యాంగ్' కంటైనర్ నౌక ఈ నెల 16వ తేదీ రాత్రి 9.30 గంటలకు విశాఖ పోర్టు టెర్మినల్–2కు చేరుకుంది. అందులో వచ్చిన కంటైనర్లను విశాఖ పోర్టు స్టాక్ యార్డ్‌లో అన్‌లోడ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ షిప్‌లోని ఎస్ఈకేయూ 4375380 నంబర్ గల కంటైనర్‌లో మాదక ద్రవ్యాలు ఉన్నాయని, తనిఖీ చేయాలని ఈ నెల 18న ఇంటర్‌పోల్ నుంచి ఒక ఈ–మెయిల్ వచ్చింది. వెంటనే ఢిల్లీలో సీబీఐ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దర్యాప్తు బాధ్యతలను డీఎస్పీ ఉమేష్ శర్మకు అప్పగించారు. సీబీఐ ఎస్పీ గౌరవ్ మిట్టల్ పర్యవేక్షణలో ఉమేష్‌కుమార్‌తో పాటు మరో డీఎస్పీ ఆకాష్ కుమార్ మీనా బృందం నార్కోటిక్ డిటెక్షన్ కిట్‌తో ఈ నెల 19వ తేదీ ఉదయం 8.15 గంటలకు విశాఖ చేరుకుంది. విశాఖ సీబీఐ డీఎస్పీ సంజయ్‌కుమార్ సమల్‌తో కలిసి విశాఖ పోర్టు విజిలెన్స్, కస్టమ్స్ అధికారుల సహకారంతో పోర్టులో తనిఖీ చేపట్టారు. ఇంటర్‌పోల్ సమాచారమిచ్చిన నంబర్ గల కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

భారీగా మాదక ద్రవ్యాలు గుర్తింపు

సదరు కంటైనర్ లాసెన్స్ బే కాలనీ ప్రాంతంలో ఉన్న సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరు మీద ఉన్నట్లు గుర్తించారు. ఈ కంపెనీకి కూనం వీరభద్రరావు ఎండీ కాగా.. సీఈఓగా ఆయన కుమారుడు కోటయ్య చౌదరి వ్యవహరిస్తున్నారు. విశాఖలో అందుబాటులో ఉన్న ఆ కంపెనీ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.వి.ఎల్.ఎన్.గిరిధర్, కంపెనీ ప్రతినిధులు పూరి శ్రీనివాస కృష్ణమాచార్య శ్రీకాంత్, కె.భరత్ కుమార్‌ను రప్పించారు. కంటైనర్, సీల్ నెంబర్లు చూపించి అందులో ఏముందని సీబీఐ అధికారులు వారిని ప్రశ్నించారు. కంటైనర్‌లో 25 కేజీలు చొప్పున 1000 బ్యాగ్‌లు మొత్తంగా 25 వేల కిలోల ఇనాక్టివ్ డ్రై ఈస్ట్ ఉందని చెప్పారు. దీంతో కంటైనర్ తెరిచి చూడగా లోపల 20 బాక్సులలో వెయ్యి బ్యాగులు ఉన్నట్లు గుర్తించారు. ఒక్కో బాక్స్ నుంచి ఒక్కో బ్యాగ్‌ను కంపెనీ ప్రతినిధుల సమక్షంలోనే బయటకు తీశారు. ఆ బ్యాగుల్లో పచ్చ రంగులో ఉన్న పౌడర్‌ను నార్కోటిక్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించారు. 20 బ్యాగుల్లో పౌడర్‌ను పరీక్షించిన సీబీఐ అధికారులు విస్తుపోయారు. ఈ పౌడర్‌లో కొకైన్, మెథాక్వాలోన్, ఓపియం, మారిజోనా, హాషిష్ మాదవ ద్రవ్యాలు ఉన్నట్లు రెండు వేర్వేరు పరీక్షల ద్వారా నిర్ధారణ అయింది. తాము తొలిసారిగా వీటిని దిగుమతి చేసుకున్నామని, అందులో ఉన్న పదార్థాల గురించి తమకు తెలియదని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. తిరిగి సీబీఐ బృందం 20వ తేదీ ఉదయం 10.15 గంటలకు విశాఖ పోర్టుకు చేరుకొని సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కూనం హరికృష్ణ, ఇతరుల సమక్షంలో మరికొన్ని బ్యాగులను పరీక్షించారు. అన్నింటిలోను మాదక ద్రవ్యాలు ఉన్నట్లు గుర్తించారు. దీనిపై కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించగా.. వారు సరైన సమాధానాలు చెప్పలేకపోయారు. దీంతో సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీపై కేసు నమోదు చేశారు.


కూనం వీరభద్రరావు


కోటయ్య చౌదరి

టీడీపీ, పురందేశ్వరితో అనుబంధం

భారీగా డ్రగ్స్ దిగుమతి చేసుకున్న సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన కూనం వీరభద్రరావు చౌదరి, కూనం కోటయ్య చౌదరిలతో టీడీపీ నేతలకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. చంద్రబాబు వదిన, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబానికి వీరు సమీప బంధువులు, వ్యాపార భాగస్వాములు కూడా కావడం గమనార్హం. పురందేశ్వరి కుమారుడు దగ్గుబాటి చెంచురామ్, ఆమె సమీప బంధువు ప్రసాద్‌రావులతో కలసి సంధ్యా ఆక్వా అనే కంపెనీని ఏర్పాటు చేశారు. అనంతరం ఆ కంపెనీని సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (విశాఖపట్నం, ఉయ్యూరు), సంధ్యా మెరైన్ (పాలకొల్లు), సంధ్యా ఆక్వా టెక్ (ప్రకాశం జిల్లా) పేర్లతో మూడుగా విభజించారు. వాటిలో సంధ్యా మెరైన్‌ను పురందేశ్వరి సమీప బంధువు (వియ్యంకుడు) ప్రసాద్‌రావు, సంధ్యా ఆక్వాటెక్‌ను పురందేశ్వరి కుమారుడు చెంచురామ్ నిర్వహిస్తుండగా.. సంధ్యా ఎక్స్‌పోర్ట్స్‌ను కూనం వీరభద్రరావు, కోటేశ్వరరావు నిర్వహిస్తున్నారు. కాగా, బాలకృష్ణ వియ్యంకుడి కుటుంబంతోనూ (గీతం యాజమాన్యం) వీరభద్రరావుకు సన్నిహిత సంబంధాలున్నాయి.


విశాఖ పోర్టులో సీబీఐ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న కంటైనర్ ఉన్న ప్రదేశం

ఈ కేసును మేము ఎదుర్కొంటాం..

ఈ కేసును కంపెనీ తరఫున మేము ఎదుర్కొంటాం. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి సంబంధం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫీడ్ ప్లాంట్ ప్రారంభించాం. మైదా, సోయా, ఫిష్ మీల్ తదితర 10–15 రకాల ముడి సరుకును వినియోగిస్తుంటాం. ఇందులో ఈస్ట్ కూడా ఒకటి. రొయ్యల మేతకు 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌ను బ్రెజిల్‌లో ఆర్డర్ చేశాం. ఐసీసీబీ కంపెనీ ద్వారా జనవరి 14న బ్రెజిల్ నుంచి బయలుదేరిన ఈ కంటైనర్ రావాల్సిన సమయం కంటే చాలా ఆలస్యంగా విశాఖకు వచ్చింది. దేశంలో డ్రైడ్ ఈస్ట్ కేజీ రూ.200 ఉండగా.. బ్రెజిల్‌లో రూ.70కే వస్తుండడంతో అక్కడి నుంచి దిగుమతి చేసుకున్నాం. ఇది మా మొదటి ఆర్డర్. అందులో ఏముందో మాకు తెలియదు. మా కంపెనీ జెన్యూన్ అని డాక్యుమెంట్స్ ఉన్నాయి. దీనిపై ఎటువంటి విచారణకైనా సిద్ధమే.

– కూనం హరికృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆక్వా మెరైన్ కంపెనీ

సంధ్యా ఆక్వాపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు

టీడీపీ ప్రభుత్వ హయాంలో సంధ్యా ఆక్వా అక్రమాలు యథేచ్ఛగా సాగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కంపెనీలో తనిఖీలు నిర్వహించింది. అనుమతి లేకుండా ఈక్వెడార్ దేశం నుంచి రొయ్యలను దిగుమతి చేసుకుని వాటిని ప్రాసెస్ చేసి అమెరికాకు ఎగుమతి చేశారని తేలింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకుని ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు భారత చట్టాలు అనుమతించవు. కానీ ఆ చట్టాన్ని సంధ్యా ఆక్వా ఎండీ కూనం కోటేశ్వరరావు చౌదరి బేఖాతరు చేస్తూ అక్రమాలకు పాల్పడ్డారు. దాంతోపాటు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను కూడా ఉల్లంఘించినట్టు తనిఖీల్లో వెల్లడైంది. ఏకంగా 16 ఉల్లంఘనలను గుర్తించి కేసు నమోదు చేసి సంధ్యా ఆక్వా కంపెనీని సీజ్ చేశారు. ఇదిలా ఉండగా కూనం వీరభద్రరావుపై యూఎస్ పోలీసులు 2016లో కేసు నమోదు చేశారు. ఆ ఏడాది జూలై 30న లాస్ ఏంజిల్స్ నుంచి న్యూజెర్సీకి వెళ్తున్న విమానంలో తన పక్కనే నిద్రిస్తున్న మహిళా ప్రయాణికురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో వీరభద్రరావుని ఎఫ్‌బీఐ అరెస్టు చేసి న్యూయార్క్ కోర్టులో హాజరు పరిచారు. అనంతరం తానా ప్రతినిధుల సహాయంతో ఈ కేసు నుంచి బయటపడ్డారు. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లోనూ వీరభద్రరావు పాత్ర ఉందని తెలుస్తోంది. ఈయన నేతృత్వంలో రూ.25 కోట్లు చేతులు మారినట్లు సమాచారం.

ఏపీకి ప్రైమ్ మినిస్టర్ ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యకు ఎంపిక చేసిన కేంద్రం
గుంటూరు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన
సాంకేతిక విద్యాబోధన భేష్ అంటూ ప్రశంసలు


గుంటూరులోని ప్రభుత్వ స్కూల్లో బోధనను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందిస్తున్న విద్యాబోధనకు గాను 'ప్రైమ్ మినిస్టర్ ఎక్స్‌లెన్స్' అవార్డుకు ఆంధ్రప్రదేశ్ ఎంపికైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక విద్యకు శ్రీకారం చుడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన విద్యా విప్లవానికి దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి. బ్లాక్ బోర్డు స్థానంలో తెచ్చిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ), బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల ద్వారా ఆధునిక బోధనకు గాను రాష్ట్రాన్ని ఈ అవార్డు వరించింది. ప్రభుత్వ పాఠశాలల్లో అమర్చిన ఐఎఫ్‌పీలు, 8, 9వ తరగతుల విద్యార్థుల చేతుల్లో ఉన్న ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన, సందేహాల నివృత్తికి బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులను పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన 'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్' కార్యక్రమం బెస్ట్ ఇన్నోవేషన్ కేటగిరీలో అవార్డు ఎంపికలో కీలకపాత్ర వహించింది. దేశంలోనే అత్యుత్తమ విద్యాబోధన చేస్తున్న రాష్ట్రంగా అత్యున్నత అవార్డుకు ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఇద్దరు అధికారుల బృందాన్ని రాష్ట్రానికి పంపింది. కేంద్ర డిప్యూటీ కార్యదర్శులు ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్‌తో కూడిన బృందం గురువారం గుంటూరు జిల్లాలోని పెదకాకాని మండలం వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్, గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పట్టాభిపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలను సందర్శించింది. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ స్వయంగా కేంద్ర అధికారులకు పాఠశాలల్లో అమలు చేస్తున్న సాంకేతిక విద్యా బోధన గురించి వివరించారు. కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధునిక బోధన పద్ధతులు, వసతులను తిలకించిన అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన అందించడంతో పాటు దేశంలోనే తొలిసారిగా ఇంజినీరింగ్ విద్యార్థులను పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన 'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్' కార్యక్రమంపై ప్రశంసలు కురిపించారు. విద్యార్థులతో మాట్లాడిన ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్‌లు.. వారిలోని అద్భుతమైన మేధస్సు, సబ్జెక్టుల వారీగా పట్టు, ఇంగ్లిష్ భాష పరిజ్ఞానంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్రాన్ని మింగేయడానికే బాబు పొత్తులు

- అవినీతిని ఆయన వ్యవస్థీకృతం చేసి రాష్ట్రానికి అపఖ్యాతి తెచ్చారు
- గతంలో బాబును తిట్టినవాళ్లే ఇప్పుడు మళ్లీ ఆయనతో పొత్తు పెట్టుకున్నారు
- 'మహాదోపిడీ' పుస్తకావిష్కరణలో ఏపీ ప్రభుత్వ సలహాదారు 'సజ్జల'



సాక్షి, అమరావతి: చంద్రబాబు అవినీతిని వ్యవస్థీకృతం చేయడమే కాక.. అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను అపఖ్యాతి పాల్జేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. రాష్ట్రాన్ని నమిలి మింగడానికి పొత్తులతో ఆయన మళ్లీ వస్తున్నాడు. వ్యవస్థలను అవినీతిమయం చేయటం, మీడియా ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడంలో చంద్రబాబు ఆరితేరారని విమర్శించారు. తన పాలనలో కేంద్ర, రాష్ట్ర నిధులను పూర్తిగా మింగేశారని.. అసలు రాజకీయం అంటే దోపిడీ అన్నట్లుగా బాబు వ్యవహరించారని సజ్జల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు అంతటి అవినీతి పరుడు లేరని ప్రధాని సైతం విమర్శించారని.. మరి ఆయనతో బీజేపీ ఎలా పొత్తు పెట్టుకుందని సజ్జల ప్రశ్నించారు. అధికారం కోసం ఆయన ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. సీనియర్ జర్నలిస్టు పి.విజయబాబు రచించిన మహాదోపిడీ పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం తాడేపల్లిలోని ఓ హోటల్‌లో జరిగింది. ''ఈ పుస్తకంలో చంద్రబాబు వ్యవస్థలను ఎలా మేనేజ్ చేశారో.. కేంద్ర, రాష్ట్ర నిధులను ఎలా దోచేశారో స్పష్టంగా రాశారు. మోదీని అన్ని తిట్లు తిట్టి తిరిగి ఆయనతోనే పొత్తు చంద్రబాబుకే సాధ్యం. అధికారం కోసం ఆయన పవన్, బీజేపీని వాడుకుంటూ ఆఖరి ప్రయత్నం చేస్తున్నారు. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఇక షర్మిల మాట్లాడే భాషను ప్రజలు గమనిస్తున్నారు. ఆమె మాట్లాడే స్క్రిప్ట్ మొత్తం చంద్రబాబు నుంచే వస్తోంది. బాబు కోసం ఏపీలో బీజేపీ, కాంగ్రెస్‌లు పనిచేస్తున్నాయి'' అని ఆయన అన్నారు.

పేరుకే కూటమి.. అంతటా అమీతుమీ!

క్షేత్ర స్థాయిలో పొత్తులపై పెరుగుతున్న వ్యతిరేకత

హిందూపురం ఎంపీ సీటుపై టీడీపీ, బీజేపీ అమీతుమీ
ధర్మవరంలో వరదాపురం వర్సెస్ పరిటాల
జమ్మలమడుగులో రెండు ముక్కలైన దేవగుడి కుటుంబం
రాజోలులో పోటీ చేసేదెవరో తేల్చని జనసేన
తిరుపతిలో అభ్యర్థిత్వాలపై పెల్లుబుకుతున్న నిరసనలు
పెనమలూరు టికెట్ వ్యవహారం వివాదాస్పదం

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో కుమ్ములాటలు ముదురుపాకాన పడుతున్నాయి. అభ్యర్థిత్వాలు ఇంకా ఒక కొలిక్కి రాకపోగా... ప్రకటించిన స్థానాల్లో అసమ్మతి రాగాలు మిన్నంటుతున్నాయి. పొత్తు ధర్మం తమ అభ్యర్థిత్వాలకు ఎసరు పెట్టినట్టయిందని కూటమి పార్టీల్లోని ఆశావహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా జెండామోసిన తమను కాదని వేరెవరికో టికెట్ ఇస్తే వారి గెలుపుకోసం ఎందుకు పాకులాడాలంటూ నిలదీస్తున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో బీజేపీ, జనసేన గరం గరం

శ్రీ సత్యసాయి జిల్లాలో సీట్ల కేటాయింపు విషయంలో టీడీపీపై బీజేపీ, జనసేన గుర్రుగా ఉన్నాయి. ఈ జిల్లాలో జనసేనకు ఒక్క సీటు కూడా ఇవ్వబోమని తేల్చేసినా బీజేపీకి ధర్మవరం అసెంబ్లీ లేదా హిందూపురం పార్లమెంటు ఇస్తారని ప్రచారం సాగింది. దానికి అనుగుణంగా హిందూపురం నుంచి పరిపూర్ణానందస్వామి, ధర్మవరం నుంచి వరదాపురం సూరి బీజేపీ తరఫున టికెట్ ఆశిస్తున్నారు. కానీ ఆ స్థానాల్లో కూడా టీడీపీ నేతలే టికెట్ కోసం పట్టుబట్టడం ఇక్కడ వివాదానికి కారణమవుతోంది. హిందూపురం లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసేందుకు బీజేపీ తరఫున పరిపూర్ణానందస్వామి ఉత్సాహం చూపిస్తుండగా టీడీపీ నేత నిమ్మల కిష్టప్ప ఆ స్థానానికి పట్టుపడుతున్నారు. అధిష్టానం అంగీకరించకుంటే ఇండిపెండెంట్‌గానైనా పోటీచేయాలని ఆయన యోచిస్తున్నారు. మరోవైపు పెనుకొండ టికెట్ ఆశించి భంగపడ్డ బీకే పార్థసారథి, హిందూపురం నేత అంబికా లక్ష్మీనారాయణ కూడా ఇదే సీటుకోసం యత్నిస్తున్నారు. ధర్మవరంలో వరదాపురం సూరి(బీజేపీ), పరిటాల శ్రీరామ్(టీడీపీ) మధ్య అంతర్గత పోరు నడుస్తోంది.


పిఠాపురంలో ఇటీవల తెలుగుదేశం, జనసేన జెండాలను తగులబెడుతున్న వర్మ వర్గీయులు

బాబాయ్‌పై అబ్బాయ్ గుర్రు

మాజీ ఎమ్మెల్యే దేవగుడి ఆదినారాయణరెడ్డి ఎత్తుగడలు ఈమారు బెడిసికొట్టాయి. బీజేపీ తరఫున జమ్మలమడుగు ఎమ్మెల్యే టికెట్ దక్కించుకోవడంలో సఫలమైన ఈయన కుటుంబంలో ఐక్యత సాధించడంలో విఫలమయ్యారు. అప్పటికే అక్కడ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన అన్న, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి కుమారుడు భూపేష్ టికెట్ తనకే ఖాయమన్న ధీమాలో ఉన్నారు. అయితే బాబాయ్ చేసిన పని వల్ల ఆ అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు దేవగుడి సోదరులంతా ఒకవైపు ఆది ఒక్కరు ఒకవైపులా మారిపోయారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ ఎమ్మెల్యే టికెట్ తీసుకోవాలా? లేక కడప ఎంపీ సీటు అడగాలా అన్న ఆలోచనలో ఆది పడిపోయారు.

కోనసీమలో జనసేన సీటుపై వీడని సందిగ్ధం

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జనసేనకు కేటాయించిన రాజోలు స్థానంలోనూ అభ్యర్థి ఖరారు విషయంలో సందిగ్ధం కొనసాగుతోంది. జిల్లాలో సుమారు 29 శాతం ఓట్లున్న జనసేనకు కనీసం మూడు స్థానాలైనా ఇస్తారని అంతా భావించారు. గతంలో గెలిచిన రాజోలుతో పాటు అమలాపురం, రామచంద్రపురం నియోజకవర్గాల నుంచి పోటీచేయాలని నిర్ణయించుకున్నారు. టీడీపీ తొలి విడతలో కొత్తపేట, మండపేట, ముమ్మిడివరం, పి.గన్నవరం, రెండో దశలో రామచంద్రపురం అభ్యర్థులను ప్రకటించుకుంది. రాజోలు, అమలాపురం ఎస్సీ నియోజకవర్గాలు మిగలగా ఇప్పటికే రాజోలు నుంచి జనసేన పోటీచేస్తుందని అధినేత ప్రకటించిన విషయం తెలిసిందే. అమలాపురం కూడా టీడీపీ లాగేసుకున్నట్టు తెలిసింది. వివాదాస్పదంగా మారిన పి.గన్నవరాన్ని పొత్తులో భాగంగా బీజేపీ కోరుకుంటోంది. ఇప్పటికీ రాజోలులో అభ్యర్థులను జనసేన ఖరారు చేయకపోవడంతో కేడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.


శ్రీనివాసులకు సీటు ఇవ్వాలంటూ గుంతకల్లులో బీజేపీ శ్రేణుల ర్యాలీ


పాలకొల్లులో 30 రోజుల తర్వాత నిమ్మల మెడలో జనసేన కండువా

కందుకూరు టీడీపీలో రాజేష్ తిరుగుబావుటా...

నెల్లూరు జిల్లా కందుకూరు టీడీపీలో నాయకుల మధ్య అంతర్గత పోరు ఢీ అంటే ఢీ అనే స్థాయికి చేరింది. దాయాదులైన ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్‌ల మధ్య పోరు సాగుతోంది. అధిష్టానం ఇంటూరి నాగేశ్వరరావును ఎంపిక చేయడంతో రాజేష్, ఆయన వర్గం వ్యతిరేకిస్తోంది. ఆయనకు నచ్చ జెప్పేందుకు ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ యత్నించినప్పటికీ రాజేష్ ససేమిరా అన్నారు. అంతేగాకుండా బుధవారం నుంచి పట్టణంలోని సుల్తాన్ మొహిద్దీన్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం కూడా మొదలెట్టేశారు. అధిష్టానం పునరాలోచించకుంటే ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గుంతకల్లు అసెంబ్లీ సీటుకోసం బీజేపీ పట్టు

టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లు అసెంబ్లీ సీటును బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు కేటాయించాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. అంతేగాకుండా గురువారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. 2014లో ఈ అసెంబ్లీ సీటును బీజేపీ అభ్యర్థి వెంకట్రామయ్యకు కేటాయించినప్పటికీ చంద్రబాబు పొత్తుధర్మానికి తూట్లు పొడిచి తిరిగి టీడీపీ అభ్యర్థి జితేంద్రగౌడ్‌కు బీ–ఫారం ఇచ్చి బీజేపీని మోసం చేశారనీ, ఈ సారి అలా కాకుండా సందిరెడ్డికే కేటాయించాలని కోరుతున్నారు.

జనసేన కండువా వేసుకోని నిమ్మలకు ఝలక్

పాలకొల్లు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు 30 రోజులుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. కానీ ఆయన పసుపు కండువా వేసుకుని, జనసేన కండువా వేసుకోకపోవడంపై ఆ పార్టీ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. చివరకు గురువారం యలమంచిలి మండలం వడ్డిలంకలో జనసేన కండువా వేసుకుంటేనే తాము ప్రచారానికి వస్తామని లేదంటే కుదరదని చెప్పినట్లు తెలిసింది. చేసేది లేక ఆయన ఎర్ర కండువా వేసుకున్నాకే జనసైనికులు ప్రచారంలోపాల్గొన్నారు.

పెనమలూరుపై వీడని పీటముడి

కృష్ణాజిల్లా పెనమలూరు టికెట్‌పై పీటముడి వీడటం లేదు. అధిష్టానం అనుసరిస్తున్న నాన్చుడు ధోరణిపై పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. టికెట్ ఆశిస్తున్న బోడె ప్రసాద్ తాజాగా సొంత పార్టీలో చేతకాని వెధవలు ఉన్నారంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తనను కాదని బయటి వారికి అవకాశమిస్తే చూస్తూ ఊరుకోనని, స్వతంత్రంగానైనా పోటీ చేస్తానని ప్రకటించారు. దీనిపై విలేకరులు ప్రశ్నించగా తాను ఆవేశంలో ఆ ప్రకటన చేశానని దాటవేశారు.

ఎవరి దారి వారిదే...

తిరుపతి జిల్లాలో కూటమి నేతల్లో సయోధ్య కొరవడింది. వారు విడివిడిగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని అభ్యర్థులను మార్చాలంటూ అధినేతలకు సమాచారం పంపారు. తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరిలో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కలిసి సమావేశాలు ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి.నాయుడు, జనసేన నాయకురాలు వినూత, బీజేపీ నాయకుడు సుబ్రమణ్యం రెడ్డి తన అనుచరులతో రహస్యంగా సమావేశమయ్యారు. బొజ్జల సుధీర్‌రెడ్డిని వారు వ్యతిరేకిస్తూ ఆయన తప్ప తమలో ఎవరికిచ్చినా కలిసి పనిచేస్తామని ప్రకటించారు. తిరుపతి సీటు నాన్ లోకల్ వ్యక్తికి కేటాయించడాన్ని అక్కడి కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. సత్యవేడు అభ్యర్థి ఆదిమూలాన్నే కొనసాగిస్తే.. తాము సహకరించేది లేదని టీడీపీ నేతలు ఆందోళన చేపట్టారు. మరోవైపు టీడీపీ నాయకుడు జేడీ రాజశేఖర్ రెబల్ అభ్యర్థిగా ప్రచారాన్ని ప్రారంభించారు. వెంకటగిరిలో టీడీపీ నాయకుడు మస్తాన్ యాదవ్ అనుచరులు చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థికి సహకరించేది లేదని మరోసారి తేల్చిచెప్పారు.

కట్టింది బ్యారేజీలా.. డ్యామ్‌లా?

సీడీఓ ఇంజనీర్లకు అయ్యర్ కమిటీ ప్రశ్నలు

- బ్యారేజీలు కట్టి డ్యామ్‌లుగా ఎందుకు వినియోగించారు?
- ఫ్రీ ఫ్లో ఉండాల్సిన బ్యారేజీల్లో నీళ్లు ఎందుకు నిల్వ చేశారు?
- డిజైన్లకు ప్రామాణికమేంటి? సీడబ్ల్యూసీ మార్గదర్శకాలు పాటించారా?
- మేడిగడ్డ డిజైన్లను ఎల్ అండ్ టీ రూపొందిస్తే తాము ఆమోదించామన్న ఇంజనీర్లు
- డిజైన్లలో కాకుండా నిర్మాణం, ఓ అండ్ ఎంలో తప్పులు జరిగి ఉండవచ్చునని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బ్యారేజీలను కట్టారా? డ్యామ్‌లను కట్టారా? బ్యారేజీలను నిర్మించి డ్యామ్‌ల తరహాలో నీళ్లు ఎందుకు నిల్వ చేశారు? బ్యారేజీలను డ్యామ్‌ల తరహాలో వినియోగించే పక్షంలో వాటి డిజైన్ల రూపకల్పన, నిర్మాణంలో డ్యామ్‌లకు సంబంధించిన ప్రమాణాలను ఎందుకు పాటించలేదు?.. అంటూ నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) ఇంజనీర్లపై చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ ప్రశ్నల వర్షం కురిపించింది. వరద నీళ్లు స్వేచ్ఛగా కిందికి ప్రవహించే (ఫ్రీ ఫ్లో) విధంగా బ్యారేజీలను వాడాల్సి ఉండగా, డ్యామ్‌ల తరహాలో నీళ్లను నిల్వ చేయాలని కోరింది ఎవరు? అని ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల డిజైన్, నిర్మాణంపై అధ్యయనం కోసం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నిపుణుల కమిటీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ కమిటీ గురువారం రెండో రోజూ ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జలసౌధలో నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో సుదీర్ఘంగా సమావేశమైంది. వివిధ అంశాలపై వారిని ప్రశ్నించింది.

క్షేత్రస్థాయిలో పరిశోధనలు చేయలేదు

డిజైన్లకు ప్రామాణికమేంటి? వాటి తయారీలో ఎవరి సహకారం తీసుకున్నారు? నిర్మాణం జరుగుతున్నప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లారా? సీడబ్ల్యూసీ మార్గదర్శకాలు పాటించారా? అని కమిటీ ప్రశ్నించింది. డిజైన్లకు సంబంధించి మొత్తం 46 ప్రశ్నలను సీడీఓ చీఫ్ ఇంజనీర్ ముందుంచింది. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీ డిజైన్లను నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ' రూపొందిస్తే తాము ఆమోదించామని కమిటీకి సీడీఓ ఇంజనీర్లు తెలియజేశారు. ఇందుకు ఆధారంగా ఈ–మెయిల్ ద్వారా ఎల్ అండ్ టీ నుంచి తమకు వచ్చిన డిజైన్లను చూపించారు. డిజైన్లను రూపొందించినందుకు ఎల్ అండ్ టీ బిల్లును కూడా క్లెయిమ్ చేసుకుందని చెప్పారు. మరోవైపు మేడిగడ్డ బ్యారేజీ డిజైన్లను తామే రూపొందించినట్టు ధ్రువీకరిస్తూ సీడబ్ల్యూసీకి సీడీఓ సర్టిఫికెట్ జారీ చేసిందని, తమకు ఎలాంటి బాధ్యత లేదని ఎల్ అండ్ టీ పేర్కొంది. బ్యారేజీల నిర్మాణానికి తాము క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశోధనలు చేయలేదని, క్షేత్రస్థాయిలోని ఇంజనీర్లు పంపిన పారామీటర్స్ ఆధారంగానే డిజైన్లను తయారు చేశామని ఇంజనీర్లు నివేదించారు. క్షేత్ర స్థాయిలో జరపాల్సిన పరిశోధనలతో తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఒరిజినల్ డిజైన్లు అందించాలని ఎన్డీఎస్‌ఏ కోరగా.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ తీసుకెళ్లిందని బదులిచ్చారు.

నిర్మాణం, నిర్వహణ లోపాలే కావచ్చు

కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యాల విషయమై నీటిపారుదల శాఖలోని వేర్వేరు విభాగాల ఇంజనీర్లు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకున్నట్టు తెలిసింది. డిజైన్లలో ఎలాంటి లోపాలు లేవని సీడీఓ ఇంజనీర్లు కమిటీకి చెప్పారు. నిర్మాణం, నిర్వహణ, పర్యవేక్షణ(ఓ అండ్ ఎం)లో లోపాలతోనే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని, ఇతర బ్యారేజీల్లోనూ సమస్యలొచ్చి ఉండవచ్చని ఆరోపించారు. బ్యారేజీల పునాదుల కింద సెకెంట్ పైల్స్‌ను వంకరగా నిర్మించి ఉండవచ్చని, రెండు సెకెంట్ పైల్స్ మధ్య గ్యాప్ ఏర్పడి ఉండవచ్చనే అనుమానాలను వ్యక్తం చేశారు.

డిజైన్ల ప్రకారమే నిర్మాణం: నిర్మాణ సంస్థలు

బ్యారేజీలను సీడీవో అందించిన డిజైన్లు/ డ్రాయింగ్స్ ఆధారంగానే నిర్మించినట్టు నిర్మాణ సంస్థల ప్రతినిధులు ఎన్డీఎస్‌ఏకు వివరణ ఇచ్చారు. బ్యారేజీల వైఫల్యానికి తాము బాధ్యులం కాదని, ప్రభుత్వం ఏ విధంగా డిజైన్లు ఇచ్చిందో ఆ విధంగానే నిర్మాణం చేపట్టామని చెప్పారు. కాగా బ్యారేజీల నిర్మాణంలో నాణ్యత పరీక్షలు చేసిన తర్వాతే సంతకాలు చేశారా? లేక ముందే సంతకాలు చేశారా? అని క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లను అయ్యర్ కమిటీ ప్రశ్నించింది. దీంతో నాణ్యత పరీక్షలు చేశాకే సంతకాలు చేశామని ఇంజనీర్లు బదులిచ్చారు.

వర్షాకాలానికి ముందు పరిశీలించారా?

డ్యామ్ సేఫ్టీ చట్టం, ఐఎస్ కోడ్ ప్రకారం వర్షాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీల పరిశీలన చేశారా? అని కమిటీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) విభాగాన్ని ప్రశ్నించింది. బ్యారేజీల నిర్మాణం 2019 జూలైలో పూర్తైందని, ఆ తర్వాత రెండేళ్లపాటు 2021 దాకా డిఫెక్ట్ లయబులిటీ పీరియడ్‌లో బ్యారేజీలు ఉన్నాయని, 2021 నుంచి 2024 దాకా బ్యారేజీల నిర్వహణ బాధ్యత నిర్మాణ సంస్థలదేనని ఓ అండ్ ఎం విభాగం ఇంజనీర్లు బదులిచ్చారు. కాగా శుక్రవారం చివరిరోజు అయ్యర్ కమిటీ స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్‌ఓ)తో సమావేశం కానుంది. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్ ల్యాబోరేటరీని సందర్శించి నమూనా బ్యారేజీలపై నిర్వహించిన అధ్యయనాలను పరిశీలించనుంది.

- బాబు 'గ్రూప్' పాలి'ట్రిక్స్'...

ఆ ఉద్యోగులకు ఊరట

2018 గ్రూప్ 1 మెయిన్స్‌పై సింగిల్ జడ్జి నిమ్మగడ్డ తీర్పును పాక్షికంగా సవరించిన హైకోర్టు ధర్మాసనం

- 167 మంది ఉద్యోగులకు తాత్కాలికంగా ఊరట.. 27న తదుపరి విచారణ
- తాము కోరకున్నా మొదటి మూల్యాంకనాన్ని నిమ్మగడ్డ రద్దు చేశారన్న పిటిషనర్లు
- గత చైర్మన్ ఉదయ్ భాస్కర్ నిర్వాకాలతోనే 'గ్రూప్స్'పై ముసిరిన వివాదాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

యువర్స్

● గేమింగ్

వేయి కన్నుల శత్రువు వేట



హరైజన్ జీరో డాన్ (2017) గేమ్‌కు సీక్వెల్‌గా వచ్చిన యాక్షన్–రోల్ ప్లేయింగ్ గేమ్ హరైజన్ ఫర్‌బిడెన్ వెస్ట్(పీసీ) విడుదలైంది. థర్డ్–పర్సన్ పర్‌స్పెక్టివ్‌లో ఆడే గేమ్ ఇది. ప్రమాదకరమైన ఆయుధాలతో నిండిన 'అలోయ్' అనే హంటర్‌ను ప్లేయర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. నోరా తెగకు చెందిన యంగ్ హంటర్ అలోయ్ శాస్త్రవేత్త ఎలిజబెత్ సోటెక్ క్లోన్. 'మిస్టీరియస్ ప్లేగ్' మూలాన్ని తెలుసుకోవడానికి తన బృందాన్ని ఫర్‌బిడెన్ వెస్ట్ అని పిలవబడే సరిహద్దు ప్రాంతానికి తీసుకువెళుతుంది. ఆలోయ్ తన ప్రయాణంలో భారీ తుఫానులను, సంచార తెగలతో యుద్ధాలను ఎదుర్కొంటుంది. పచ్చనిలోయల నుంచి శిథిలమైన నగరాల వరకు ఆలోయ్ ప్రయాణంలో ఎన్నో దృశ్యాలు కనిపిస్తాయి. గత గేమ్‌తో పోల్చితే ఈ గేమ్ మ్యాప్ పెద్దగా ఉంటుంది. షీల్డ్ వింగ్, ఫోకస్ స్కానర్, డైవింగ్ మాస్క్, పుల్‌కాస్టర్‌లాంటి టూల్స్‌ను కంబాట్‌లో ఉపయోగించవచ్చు.

● ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 4, ప్లే స్టేషన్ 5,
● విండోస్ జానర్: యాక్షన్, అడ్వెంచర్ ● మోడ్: సింగిల్–ప్లేయర్


● అదర్‌సైడ్

సామాజిక సేవ నుంచి సైన్స్ వరకు

బెంగళూరుకు చెందిన సియా గోడికా పేరు వినిపించగానే 'సోల్ వారియర్స్' గుర్తుకు వస్తుంది. 'సోల్ వారియర్స్' స్వచ్ఛంద సంస్థ ద్వారా పేదలకు పాదరక్షలను అందిస్తుంది సియా. 'చేంజ్‌మేకర్'గా గుర్తింపు పొందిన సియా గోడికా చదువులోనూ ప్రతిభ చూపుతోంది. 'ప్లూరిపోటెంట్ స్టెమ్ సెల్స్' గురించి ఆమె చేసిన సైన్స్ వీడియో 'బ్రేక్‌త్రూ జూనియర్ చాలెంజ్'లో బహుమతి గెలుచుకుంది. సైన్స్, మ్యాథమెటిక్స్‌కు సంబంధించి క్రియేటివ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ఇచ్చే ప్రైజ్ ఇది.



● సియా గోడికా



సేవామార్గంలో ప్రయాణించడంతో పాటు క్రియేటివ్ థింకింగ్ కోసం పుస్తకాలు ఎక్కువగా చదువుతుంటుంది సియా. సైన్స్‌కు సంబంధించిన సరికొత్త విషయాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తుంటుంది.

'ఇంట్లో పిల్లలకు ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంటే గొప్ప విజయాలు సాధించవచ్చు' అని చెప్పడానికి సియా ఒక ఉదాహరణ.

సేవాకార్యక్రమాలకు తమ వంతుగా సహాయపడడం నుంచి సైన్స్ సంగతులు చెప్పడం వరకు సియా గోడికాకు ఎన్నో రకాలుగా ఆమె తల్లిదండ్రులు సహకారం అందించారు.

● స్పేస్ టెక్ స్టార్టప్

అంతరిక్షంలో అగ్ని సంతకం





● శ్రీనాథ్ రవిచంద్రన్ ● మోహిన్

ఏరో స్పేస్ టెక్నాలజీ అనగానే విదేశాల వైపు చూసే ఎంతో మందికి మన సత్తా చూపించిన స్టార్టప్‌లలో 'అగ్నికుల్ కాస్మోస్' ఒకటి. ఆకాశమంత కలతో బయలుదేరిన 'అగ్నికుల్' అమ్ముల పొదిలో దివ్యాస్త్రం అగ్నిబాణ్....

'అగ్నికుల్' అంటే భారత అంతరిక్ష రంగంలో ఆత్మనిర్భర్ విజయగాథ.

ఐఐటీ–మద్రాస్ కేంద్రంగా పని చేస్తున్న 'అగ్నికుల్ కాస్మోస్' త్రీడీ ప్రింటెట్ రాకెట్ ఇంజిన్‌ను తయారు చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రశంసలు అందుకుంది. స్నేహితుడు మోహిన్, ప్రొఫెసర్ చక్రవర్తిలతో కలిసి 2017లో 'అగ్నికుల్'ను లాంచ్ చేశాడు శ్రీనాథ్ రవిచంద్రన్. మన దేశంలోని ఫస్ట్ ప్రైవేట్ స్మాల్ శాటిలైట్ రాకెట్ 'అగ్నిబాణ్'ను నిర్మించింది అగ్నికుల్. 30 కిలోల నుండి 300 కిలోల బరువు ఉన్న పేలోడ్‌ను తక్కువ భూకక్ష్యలోకి (సుమారు ఏడువందల కిలోమీటర్ల ఎత్తు) తీసుకువెళ్లే సామర్థ్యం దీని సొంతం. 2020లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)తో ఒప్పందం కుదుర్చుకున్న తొలి భారతీయ కంపెనీగా ప్రత్యేకత సాధించింది అగ్నికుల్. ఒప్పందం ద్వారా 'అగ్నిబాణ్' నిర్మాణంలో 'ఇస్రో' సహాయ, సహకారాలను తీసుకుంది.

ప్లగ్–అండ్–ప్లే ఇంజిన్ కాన్ఫిగరేషన్ సామర్థ్యం ఉన్న అగ్నిబాణ్, మిషన్ అవసరాలకు ఖచ్చితంగా సరిపోయేలా కాన్ఫిగర్ చేయగలదు. ప్రతి క్లయింట్‌కు సంబంధించిన ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా కాన్ఫిగర్ చేయవచ్చు. 3డీ సాంకేతికతతో రూపొందించిన ఈ రాకెట్ ఉపగ్రహ ప్రయోగాల ఖర్చును తగ్గిస్తుంది.

మొదట్లో వారానికి కనీసం రెండు రాకెట్ ఇంజిన్‌లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని ఆ తరువాత నాలుగు ఇంజిన్‌లకు విస్తరించింది అగ్నికుల్. ఒక్కో అడుగు వేస్తూ ముందుకు వెళ్లింది.

'మోర్ యాక్సెసబుల్ అండ్ అఫర్డబుల్' లక్ష్యంతో బయలు దేరిన శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌లు మరిన్ని లక్ష్యాలు నిర్దేశించుకోవడానికి రెడీ అవుతున్నారు.



● శ్రీనాథ్ రవిచంద్రన్ 'అగ్నికుల్' కో–ఫౌండర్, సీఈవో

ఆత్మవిశ్వాసమే అద్భుత శక్తి

2017లో 'అగ్నికుల్‌'తో శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌లు ప్రయాణం మొదలు పెట్టినప్పుడు ఇన్వెస్టర్‌ల నుంచి విశ్లేషకుల వరకు 'మన దేశంలో ఇది సాధ్యమా? ఈ కుర్రాళ్ల వల్ల అవుతుందా' అనే అనుమాన నీడ ఉండేది. అయితే శ్రీనాథ్, మోహిన్‌లు ఎప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ఆత్మవిశ్వాసం అనే అద్భుతశక్తితో ముందుకు కదిలారు. నాలుగు వందల వరకు పిచ్ మీటింగ్‌లు నిర్వహించిన తరువాతే ఫస్ట్ రౌండ్ ఫండింగ్ 2018లో వచ్చింది. అనుమాన నీడ వెనక్కి వెళ్లి 'అగ్నికుల్' పేరు ప్రపంచానికి పరిచయం కావడానికి ఎంతోకాలం పట్టలేదు. మన దేశంలో స్పేస్ టెక్ స్టార్టప్‌ల విజయాన్ని దృష్టిలో పెట్టుకొని 'ఏరోస్పేస్ డిగ్రీలు చేయడానికి చాలామంది విదేశాలకు వెళ్లాలనుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇక్కడే ఉండాలనుకుంటున్నారు' అంటున్నాడు 'అగ్నికుల్' కో–ఫౌండర్, సీఈవో శ్రీనాథ్ రవిచంద్రన్.

● శ్రీహరి కోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని ప్రైవేట్ లాంచ్ ప్యాడ్ నుంచి ఈరోజు లాంచ్ చేయాల్సిన 'అగ్నిబాణ్' సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది.

English Idioms

కీప్ కార్డ్స్ క్లోజ్ టు చెస్ట్

ప్లాన్, ఇంటెన్షన్, ఇన్‌ఫర్‌మేషన్‌లను రహస్యంగా ఉంచే సందర్భంలో వాడే మాట... కీప్ కార్డ్స్ క్లోజ్ టు చెస్ట్.

ఉదా: ది చిల్డ్రన్ డిడ్ నాట్ నో వేర్ దే వర్ టు గో ఫర్ దెయిర్ ఫ్యామిలీ హాలిడే ట్రిప్. దెయిర్ డ్యాడ్ కెప్ట్ హిజ్ కార్డ్స్ క్లోజ్ టు హిజ్ చెస్ట్.

పుష్ ది బోట్ ఔట్

సెలబ్రేషన్ లేదా ఏదైనా కార్యక్రమం కోసం డబ్బును కుమ్మరించే సందర్భంలో వాడే మాట... పుష్ ది బోట్ ఔట్

ఉదా: లెట్ అజ్ పుష్ ది బోట్ ఔట్ అండ్ సెలబ్రేట్ ది విన్ విత్ ఏ ఫ్యాన్సీ డిన్నర్ నైట్

● టెక్... టాక్

ఆసూస్ జెన్‌ఫోన్ 11 ఆల్ట్రా



డిస్‌ప్లే	:	6.78 అంగుళాలు
రిజల్యూషన్	:	1080X2400 పిక్సెల్స్
మెమోరీ	:	256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 16జీబి ర్యామ్
వోఎస్	:	ఆండ్రాయిడ్ 14
ఫ్రంట్ కెమెరా	:	32 ఎంపీ
బ్యాటరీ	:	5500 ఎంఏహెచ్
బరువు	:	224 గ్రా.

హానర్ వాచ్ జీఎస్ 4



● హార్ట్ రేట్ మానిటరింగ్, స్లీప్ ట్రాకింగ్, స్ట్రెస్ అండ్ బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ మెజరింగ్‌లాంటి హెల్త్ అండ్ ఫిట్‌నెస్ ఫీచర్‌లు ఉన్నాయి ● 100 ప్లస్ ఇండోర్ అండ్ ఔట్‌డోర్ మోడ్స్, కస్టమ్ స్పోర్ట్స్ మోడ్స్, 10 ప్లస్ ప్రొఫెషనల్ స్పోర్ట్స్ మోడ్స్‌ను సపోర్ట్ చేస్తుంది. ● రిజల్యూషన్: 466X466 పిక్సెల్స్ ● స్టోరేజ్: 4జీబి ● 5 ఏటీయం వాటర్ రెసిస్టెంట్ ● 32 ఎంబీ ర్యామ్

బింగ్ ఏఐ హోలీ చిత్రాలు

ఆకట్టుకునే ఇమేజ్‌లతో ఫ్రెండ్స్‌కు హోలి శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా? అయితే ఇది మీ కోసమే... మైక్రోసాఫ్ట్ వారి 'బింగ్ ఏఐ ఇమేజ్ క్రియేటర్'ను ఉపయోగించి 3డీ హోలీ థీమ్ ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు. సింపుల్ ప్రాంప్ట్స్ ద్వారా 'బింగ్ ఏఐ ఇమేజ్ క్రియేటర్'పై హోలి ఇమేజ్‌లు క్రియేట్ చేయవచ్చు. వీటిని ఆండ్రాయిడ్ అండ్ ఐవోఎస్, డెస్క్‌టాప్‌లతో యాక్సెస్ చేయవచ్చు. జెనరేట్ అయిన ఇమేజ్‌లు మీకు అంతగా నచ్చకపోతే 'మేక్ దెమ్ మోర్ కలర్‌ఫుల్ అండ్ వైబ్రంట్' 'మేక్ దెమ్ డిటేయిల్డ్' 'మేక్ దెమ్ లుక్ ఫొటో–రియలిస్టిక్' లాంటి ప్రాంప్ట్స్ ఇవ్వవచ్చు.



ఇమోజీ రియక్షన్ ఫీచర్



కమ్యూనికేషన్‌ను మరింత సులభతరం చేయడానికి 'గూగుల్ మెసేజెస్' చాట్స్‌లో ఇమోజీ రియాక్షన్ ఫీచర్ తీసుకువచ్చింది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఐమెసేజ్‌లలో మాదిరిగానే ఈ ఫీచర్‌ని ఉపయోగించవచ్చు. రియాక్షన్ ఇమోజీ జోడించడానికి పర్టిక్యులర్ ఎస్ఎంఎస్‌ను లాంగ్ ప్రెస్ చేస్తే ఇమోజీ మెనూ కనిపిస్తుంది. దీని నుంచి మనకు కావలసిన ఇమోజీని సెలెక్ట్ చేసుకోవచ్చు. థమ్స్ అప్, రెడ్ హార్ట్, లాఫింగ్ ఇమోజీ, థమ్స్ డౌన్, క్రైయింగ్ ఫేస్‌లాంటి పది ఇమోజీ క్యారెక్టర్లు ఇందులో ఉంటాయి.

సినిమా

తగ్గేదే లే!



● అల్లు అర్జున్

హీరో అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో అల్లు అర్జున్‌ని ఫాలో అయ్యేవారి సంఖ్య (ఫాలోవర్స్) 25 మిలియన్స్‌కు చేరుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంతమంది ఫాలోవర్స్ ఉన్న తొలి దక్షిణాది నటుడిగా అల్లు అర్జున్ రికార్డ్ సృష్టించి, తగ్గేదే లే అంటున్నారు. 'పుష్ప: ది రైజ్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్. అదే విధంగా ఆ మూవీకి ఉత్తమ నటుడి కేటగిరీలో తెలుగులో జాతీయ అవార్డు సాధించిన తొలి హీరోగా అరుదైన ఘనత సాధించారాయన. కాగా సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు సినిమా, వ్యక్తిగత విషయాలను అభిమానులతో పంచుకుంటారు అల్లు అర్జున్. అందులో భాగంగానే దక్షిణాదిలో అత్యధిక ఇన్‌స్టా ఫాలోవర్స్ ఉన్న హీరోగా రికార్డ్‌ను క్రియేట్ చేశారు. ఆ తర్వాతి స్థానంలో హీరో విజయ్ దేవరకొండ (21.3 మిలియన్లు), మూడో స్థానంలో హీరో రామ్ చరణ్ (20.8మిలియన్లు) ఉన్నారు.

భాగ్యనగరంలో పూర్తి



● కీరవాణి, త్రిష, చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. 'బింబిసార' చిత్రంతో బ్లాక్‌బస్టర్ అందుకున్న వశిష్ట ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'స్టాలిన్' (2006) వంటి హిట్ మూవీలో జోడీగా నటించిన చిరంజీవి–త్రిష 'విశ్వంభర' మూవీ కోసం రెండోసారి కలిశారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రం నిర్మిస్తున్నారు. కాగా ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన 'విశ్వంభర' షెడ్యూల్ పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. చిరంజీవి, త్రిషతో పాటు ప్రధాన తారాగణం పాల్గొన్న ఈ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్ట్, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరించినట్లు యూనిట్ పేర్కొంది. ''ఫ్యాంటసీ అడ్వెంచర్‌గా రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర'. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ మూవీ ఉంటుంది. 2025 సంక్రాంతి కానుకగా జనవరి 10న ఈ సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రబృందం తెలిపింది. ఇదిలా ఉంటే.. చిరంజీవి నివాసంలో చిత్ర సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణితో సహా యూనిట్‌తో దిగిన ఫొటోలను త్రిష సోషల్ మీడియాలో షేర్ చేసి, 'ఇదొక లెజెండరీ, అద్భుతమైన రోజు! విశ్వంభర' అని పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి కెమెరా: ఛోటా కె. నాయుడు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కార్తీక్ శబరీష్, లైన్ ప్రొడ్యూసర్: రామిరెడ్డి శ్రీధర్ రెడ్డి.

కాంబినేషన్ రిపీట్



● రామ్‌చరణ్

'రంగస్థలం' కాంబినేషన్ రిపీట్ కానుందని టాక్. హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన బ్లాక్ బస్టర్ ఫిల్మ్ 'రంగస్థలం' (2018). కాగా రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమాకు సన్నాహాలు మొదలయ్యాయట. ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడి కానుందని తెలిసింది. 'రంగస్థలం' సినిమాను నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని, దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తారని భోగట్టా.

చరణ్ సినిమాలో సంజయ్ దత్?

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ సినిమాలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ ఓ కీలక పాత్ర చేయనున్నారు. అలాగే బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. ఇక హిందీలో రామ్ చరణ్ చేసిన తొలి చిత్రం 'తుఫాన్'లో సంజయ్ దత్ ఓ రోల్ చేశారు. మరి.. రామ్‌చరణ్, సంజయ్ దత్ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

గోదావరి నేపథ్యంలో...

'పలాస 1978' ఫేం రక్షిత్ అట్లూరి హీరోగా, కోమలీ ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బర దర్శకుడు. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ– ''మా సినిమాని ఏప్రిల్ 5న రిలీజ్ చేద్దామనుకున్నాం. కానీ డిస్ట్రిబ్యూటర్స్ అడిగిన మేరకు 19న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''గోదావరి నేపథ్యంలో లవ్ అండ్ యాక్షన్ డ్రామా గా తెరకెక్కిన చిత్రం 'శశివదనే'' అన్నారు సాయి మోహన్ ఉబ్బర. ''నా 'పలాస 1978' కంటే 'శశివదనే' పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు రక్షిత్ అట్లూరి. కోమలీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్, సినిమాటోగ్రాఫర్ శ్రీసాయి కుమార్ దారా మాట్లాడారు.



● కోమలీ ప్రసాద్, రక్షిత్ అట్లూరి

అయోమయం.. ఆశ్చర్యం



● 'దో ఔర్ దో ప్యార్' మూవీ పోస్టర్

విద్యాబాలన్, ప్రతీక్ గాంధీ, ఇలియానా, సెంథిల్ రామమూర్తి లీడ్ రోల్స్‌లో నటించిన బాలీవుడ్ రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ 'దో ఔర్ దో ప్యార్'. శీర్ష గుహ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'నేను వీగన్... పాలతో తయారైన వాటిని తినను (విద్యాబాలన్)', 'మరి.. మీ ఫేస్ వాష్‌లలో మిల్క్ ఉంటుంది కదా (ప్రతీక్ గాంధీ)!', 'మనం డేటింగ్‌లో ఉన్న వారిలా లేము.. నిజంగా భార్యాభర్తలు ఎలా ఉంటారో అలానే ఉంటున్నాం (ఇలియానా)' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. 'ప్రేమ కన్‌ఫ్యూజ్ చేస్తుంది. సర్‌ప్రైజ్ చేస్తుంది' అన్నవి కూడా టీజర్‌లో కనిపించాయి.

గుండెల్లోన.. ప్రేమవాన!

నార్నే నితిన్, నయన్ సారిక హీరోహీరోయిన్లుగా అంజి కంచిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆయ్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'సూఫియానా.. గుండెల్లోన ప్రేమవాన..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. రామ్‌మిరియాల సంగీత సారథ్యంలో శ్రీమణి ఈ పాటకు లిరిక్స్ అందించారు. రామ్ మిరియాల, సమీర భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు.



● నయన్ సారిక, నార్నే నితిన్

మళ్లీ స్పైడర్‌మేన్ వస్తున్నాడు



● స్పైడర్‌మేన్ నో వే హోమ్ పోస్టర్

హాలీవుడ్ సూపర్ హిట్ సూపర్ హీరో 'స్పైడర్ మేన్' మళ్లీ థియేటర్స్‌కు వస్తున్నాడు. స్పైడర్ మేన్ ఫ్రాంచైజీలో ఇప్పటి వరకూ ఎనిమిది సినిమాలు వచ్చాయి. 'స్పైడర్‌మేన్' (2002), 'స్పైడర్‌మేన్ 2' (2004), 'స్పైడర్‌మేన్ 3' (2007), 'ది అమేజింగ్ స్పైడర్‌మేన్' (2007), 'ది అమేజింగ్ స్పైడర్‌మేన్ 2' (2014), 'స్పైడర్‌మేన్: హోమ్ కమింగ్' (2017), 'స్పైడర్‌మేన్: ఫార్ ఫ్రమ్ హోమ్' (2019), 'స్పైడర్‌మేన్: నో వే హోమ్' (2021)... ఈ 8 చిత్రాలూ రీ రిలీజ్ కానున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ కొలంబియా పిక్చర్స్ వంద సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంగా 'స్పైడర్‌మేన్' ఫ్రాంచైజీ సినిమాలను రీ రిలీజ్ చేస్తోందని హాలీవుడ్ సమాచారం. ఈ 8 సినిమాలకు సంబంధించి ఓ కామన్ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేశారు. ఈ చిత్రాలు కూడా ఏప్రిల్ 15 నుంచి వారానికి ఒక్కొక్కటి చొప్పున జూన్ 3 వరకు విడుదలవుతాయి. ప్రతి చిత్రం కూడా సోమవారమే రీ –రిలీజ్ కానుండటం విశేషం. ఎంపిక చేసిన థియేటర్స్‌లోనే ఈ సినిమాలు రీ రిలీజ్ కానున్నాయి.

ఆ ఒత్తిడి ఎదుర్కొన్నా!

- దర్శకుడు మల్లిక్ రామ్



''డీజే టిల్లు'(2022) సినిమాకి సీక్వెల్‌గా వస్తున్న 'టిల్లు స్క్వేర్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఎలాగైనా హిట్ కొట్టాలి, వారి అంచనాలు అందుకోవాలనే ఒత్తిడితో 'టిల్లు స్క్వేర్' తీశాను. ఫైనల్ ఔట్‌పుట్ చూశాక సినిమా బాగా వచ్చింది.. ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందనే నమ్మకంతో రిలీఫ్ అయ్యాను'' అని దర్శకుడు మల్లిక్ రామ్ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ– ''నేను, సిద్ధు, ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా... మేమంతా ఈ స్థాయికి రావడం కోసం 12 ఏళ్లుగా కష్టపడుతున్నాం. ఇప్పుడు కలిసి సినిమాలు చేస్తున్నాం. సిద్ధు బాగా నటించాడు. లిల్లీ పాత్రకి అనుపమ నూటికి నూరు శాతం న్యాయం చేసింది. నిర్మాతలు రాధాకృష్ణ, నాగవంశీ, సాయి సౌజన్యగార్లు బడ్జెట్ గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. కంటెంట్ గురించి, క్వాలిటీ గురించే ఎక్కువ మాట్లాడారు. ఏ విషయంలో రాజీ పడలేదు.. అందుకే కొన్ని సన్నివేశాలు రీ షూట్ చేశాం. ఒక్కమాటలో చెప్పాలంటే 'డీజే టిల్లు' నచ్చినవారిని 'టిల్లు స్క్వేర్' ఏమాత్రం నిరాశపరచదు. ఇక 'టిల్లు 3'కి అవకాశం ఉందా అంటే.. కొన్ని ఆలోచనలు ఉన్నాయి. భవిష్యత్తులో మూడో భాగం ఉండొచ్చు''అన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
22-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
539	173
72,641	22,012

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,488	▲ 119
డోజోన్స్	39,858	▲ 346
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,883	▲ 145
డాక్స్	18,174	▲ 159
షాంఘై	3,077	▼ 3
నికాయ్	40,815	▲ 812

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	66,914	▲ 1,125
బంగారం (99.5 స్వచ్ఛత)	66,646	▲ 1,120
వెండి (కిలో)	75,045	▲ 1,159

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.88	108.12
€	యూరో	ఎస్‌బీఐ	88.12	91.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	47.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.13	64.88
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.65	23.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.29

బంగారం మెరుపులు

రికార్డు స్థాయికి అప్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ద్రవ్య, ఆర్థిక ధోరణులు బంగారానికి మరింత మెరుగులు పెడుతున్నాయి. పసిడి ధర న్యూఢిల్లీలో గురువారం 10 గ్రాములకు ఏకంగా 1,130 పెరిగి ఆల్–టైమ్ హై రూ.67,450ని తాకింది. ఇక వెండి కూడా కేజీకి రూ.1,100 పెరిగి రూ.77,750కి ఎగసింది. అంతర్జాతీయ మార్కెట్ల కమోడిటీ ఎక్స్చేంజీలో స్పాట్ బంగారం ఔన్స్ (31.1) ధర 2,225 డాలర్లను తాకింది. ఇది క్రితం స్థాయితో పోల్చితే ఏకంగా 84 డాలర్లు అధికం. ద్రవ్యోల్బణం భయాలకుతోడు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు పసిడికి తక్షణం కలిసివస్తున్న ప్రధాన అంశాలు. ఇక ముంబైలో 99.9 స్వచ్ఛత, 99.5 స్వచ్ఛత ధరలు 10 గ్రాములకు రూ.1,125, రూ.1,120 చొప్పున పెరిగి వరుసగా రూ.66,914, రూ.66,646కు ఎగశాయి. వెండి కేజీ ధర 1,159 పెరిగి రూ.75,045 వద్దకు చేరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-3-2024	
విశాఖ	435-00
చిత్తూరు	478-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	72.00
21-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీగా సౌరభ్ వత్స



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీగా సౌరభ్ వత్స నియమితులయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నియామకం అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న రాకేశ్ శ్రీవాస్తవ మార్చి 31తో రిటైరవుతున్నారు. ఇటీవల జనవరి 15నే కంపెనీలో ఆయన డిప్యూటీ ఎండీగా నియమితులయ్యారు. అనుభవజ్ఞుడైన వత్స సారథ్యం .. కంపెనీ తదుపరి వృద్ధికి దోహదపడగలదని నిస్సాన్ ఇండియా ఆపరేషన్స్ విభాగం ప్రెసిడెంట్ ఫ్రాంక్ టోరెస్ తెలిపారు.

కియా కార్లు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆటోమొబైల్ సంస్థ కియా ఇండియా వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతోంది. ఏప్రిల్ 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నట్లు కంపెనీ గురువారం ప్రకటించింది. ముడిసరుకు ధరలు, సరఫరా సంబంధిత వ్యయాల పెరుగుదల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ధరలను పెంచడం ఈ ఏడాది ఇదే తొలిసారి అని కియా తెలిపింది.

శామ్‌సంగ్ కొత్త ఫోన్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: శామ్‌సంగ్ భారత్‌లో గెలాక్సీ సిరీస్‌లో ఏ55 5జీ, ఏ35 5జీ స్మార్ట్‌ఫోన్లను ప్రవేశపెట్టింది. 6.6 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీ ప్లస్ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే, నాక్స్ వాల్ట్ సెక్యూరిటీ, 50 ఎంపీ ట్రిపుల్ కెమెరా వంటి ఫీచర్లను జోడించింది. ఈ మోడళ్లు 5జీతోపాటు వేగంగా వృద్ధి చెందుతున్న రూ.30–50 వేల ధరల విభాగంలో తమ స్థానాన్ని కన్సాలిడేట్ చేస్తాయని శామ్‌సంగ్ తెలిపింది. ధర రూ.27,999 నుంచి రూ.42,999 వరకు ఉంది.

ప్రభుత్వ బ్యాంకుల్లో తగ్గిన మొండిబాకీలు

ఆరు నెలలుగా భారీ వెనుకడుగు ● ఫిక్కీ–ఐబీఏ బ్యాంకర్ల సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులన్నింటిలోనూ గత ఆరు నెలలుగా మొండిబాకీలు (ఎన్‌పీఏ) గణనీయంగా తగ్గాయి. ప్రైవేట్ రంగంలో 67 శాతం బ్యాంకుల్లో మాత్రమే ఎన్‌పీఏలు తగ్గాయి. పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ–ఐబీఏ బ్యాంకర్ల సర్వే నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. సర్వేలో పాల్గొన్న వాటిల్లో 77 శాతం బ్యాంకులు గత ఆరు నెలలుగా మొండిబాకీలు తగ్గినట్లు వెల్లడించాయి. సగం పైగా బ్యాంకులు రాబోయే ఆరు నెలల్లో తమ స్థూల ఎన్‌పీఏలు 3–3.5 శాతం శ్రేణిలో ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపాయి. ప్రైవేట్ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) అసెట్ క్వాలిటీ మెరుగుపడింది. పీఎస్‌బీలు, విదేశీ బ్యాంకుల్లో గత ఆరు నెలల్లో ఎన్‌పీఏ లేమీ పెరగలేదు. కానీ 22 శాతం ప్రైవేట్ బ్యాంకుల్లో మాత్రం పెరిగాయి. 18వ ఫిక్కీ–ఐబీఏ బ్యాంకర్ల సర్వేను గతేడాది జూలై–డిసెంబర్ మధ్య కాలంలో నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఫారిన్ బ్యాంకులు కలిపి మొత్తం 23 బ్యాంకులు ఇందులో పాల్గొన్నాయి. అసెట్ల పరిమాణంపరంగా బ్యాంకింగ్ రంగంలో వీటి వాటా 77 శాతంగా ఉంటుంది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో అధికంగా ఎన్‌పీఏలు ఉన్నాయి.
- వచ్చే ఆరు నెలల్లో ఆహారేతర పరిశ్రమలకు రుణాల వృద్ధి 12 శాతం పైగానే ఉండొచ్చని 41 శాతం బ్యాంకులు, 10–12 శాతం ఉండొచ్చని 18 శాతం బ్యాంకులు భావిస్తున్నాయి. 36% బ్యాంకులు ఇది 8–10 శాతం స్థాయిలో ఉండొచ్చని అంచనా వేస్తున్నాయి.
- రాబోయే ఆరు నెలల్లో ఎన్‌పీఏలు 2.5–3 % స్థాయిలో ఉండొచ్చని 14% బ్యాంకులు తెలిపాయి.
- టర్మ్ డిపాజిట్లు పుంజుకోగా, మొత్తం డిపాజిట్లలో కాసా డిపాజిట్ల వాటా తగ్గిందని 70 శాతం బ్యాంకులు తెలిపాయి. దీర్ఘకాలికంగా అధిక వడ్డీ రేట్లకు డిపాజిట్లను లాకిన్ చేయాలనే ధోరణిలో కస్టమర్లకు ఉండటమనేది టర్మ్ డిపాజిట్లకు సానుకూలంగా మారింది.
- ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెటల్స్, ఐరన్ .. ఉక్కు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో దీర్ఘకాలిక క్రెడిట్ కోసం డిమాండ్ నెలకొంది.

సూచీలకు ఫెడ్ జోష్

- ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలు సజీవం
- మార్కెట్లో ఉరకలేసిన ఉత్సాహం
- 539 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 22 వేల స్థాయి పైకి నిఫ్టీ
- రూ.5.72 లక్షల కోట్ల సంపద సృష్టి



ముంబై: ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ వడ్డీరేట్ల తగ్గింపు ఆశలను సజీవంగా ఉంచడంతో గురువారం స్టాక్ సూచీలు లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 539 పాయింట్లు పెరిగి 72,641 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 173 పాయింట్లు లాభపడి 22,012 వద్ద నిలిచింది. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ ద్రవ్య పాలసీ నిర్ణయాల వెల్లడి సందర్భంగా బుధవారం రాత్రి 'ద్రవ్యోల్బణం దీర్ఘకాలిక లక్ష్యానికి మించి ఉన్నప్పటికీ, ఈ ఏడాదిలో మూడు సార్లు వడ్డీరేట్ల కోత ఉంటుంది' అని పావెల్ సంకేతాలిచ్చారు. దీంతో అమెరికాతో సహా ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు నెలకొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 405 పాయింట్లు పెరిగి 72,507 వద్ద, నిఫ్టీ 151 పాయింట్లు బలపడి 21,990 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రోజంతా ట్రేడయ్యాయి. ముఖ్యంగా మెటల్, విద్యుత్, ఇంధన షేర్లు సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. ఒక దశలో సెన్సెక్స్ 781 పాయింట్లు ఎగసి 72,881 వద్ద, నిఫ్టీ 242 పాయింట్లు బలపడి 22,081 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. కొంతకాలంగా అమ్మకాల ఒత్తిడికి లోనైన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ ఇండెక్సులు వరుసగా 2.36%, 2.01% చొప్పున ర్యాలీ చేశాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు ఉండొచ్చనే ఆశలతో బుధవారం అమెరికా మార్కెట్లు జీవితకాల గరిష్టాన్ని నమోదు చేశాయి. సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.5.72 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్‌ఈ కంపెనీల మొత్తం విలువ రూ. 379 లక్షల కోట్లకు చేరింది.

క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ లిస్టింగ్ లాభాలు మాయం

క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ లిమిటెడ్ లిస్టింగ్ లాభాలు నిలుపుకోలేకపోయింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.715)తో పోలిస్తే 11% ప్రీమియంతో రూ.795 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో లిస్టింగ్ లాభాలన్నీ మాయమయ్యాయి. చివరికి రూ.0.38% నష్టంతో రూ.712 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.995 కోట్లుగా నమోదైంది.

టాక్ ఇన్ఫోసెక్ @ రూ.100-106

టాక్ ఇన్ఫోసెక్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ నెల 27న ప్రారంభంకానున్న ఇష్యూకి రూ. 100–106 చొప్పున ధరల శ్రేణిని ప్రకటించింది. ఏప్రిల్ 2న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 30 కోట్లు సమీకరించ నుంది.

ష్నైడర్ ఎలక్ట్రిక్ భారీ పెట్టుబడులు

తయారీపై రూ. 3,200 కోట్లు



బెంగళూరు: ఎనర్జీ మేనేజ్‌మెంట్, ఆటోమేషన్ దిగ్గజం ష్నైడర్ ఎలక్ట్రిక్ దేశీయంగా తయారీపై భారీ పెట్టుబడులకు సిద్ధపడుతోంది. 2026కల్లా తయారీ ప్లాంట్లపై రూ. 3,200 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. తద్వారా దేశ, విదేశాలలో అమ్మకాలకు భారత్‌ను తయారీ కేంద్రంగా వినియోగించుకోనున్నట్లు పేర్కొంది. ఈ బాటలో స్థానికంగా డేటా సెంటర్లకు అవసరమయ్యే కూలింగ్ సొల్యూషన్స్‌ను ఉత్పత్తి చేసేందుకు రూ. 100 కోట్లతో ఏర్పాటు చేసిన ప్లాంటును తాజాగా ప్రారంభించింది. ప్రణాళికల్లో భాగంగా గ్రూప్ తయారీ కేంద్రంగా భారత్‌లో పెట్టుబడులు చేపట్టనున్నట్లు ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రెసిడెంట్, గ్రేటర్ ఇండియా జోన్ ఎండీ, సీఈవో దీపక్ శర్మ వెల్లడించారు. వివిధ ప్రొడక్టులు, సొల్యూషన్ల తయారీకి దేశవ్యాప్తంగా తయారీ ప్లాంట్లను నెలకొల్పనున్నట్లు కూలింగ్ సొల్యూషన్స్ యూనిట్ ప్రారంభం సందర్భంగా తెలియజేశారు. వెరసి మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, ఒడిషాలలో యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. తాజా యూనిట్‌తో కలిపి ప్రస్తుతం కంపెనీ దేశవ్యాప్తంగా 30 ఫ్యాక్టరీలను నిర్వహిస్తోంది.

విదేశీ ఈటీఎఫ్‌లో పెట్టుబడులొద్దు

ఫండ్స్‌కు సెబీ ఆదేశాలు



ముంబై: విదేశీ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్(ఈటీఎఫ్)లలో ఇన్వెస్ట్ చేసేందుకు పెట్టుబడులను అనుమతించవద్దంటూ సెబీ తాజాగా దేశీ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్(యాంఫి)ను ఆదేశించింది. ఏప్రిల్ 1నుంచి తాజా ఆదేశాలు అమలుకానున్నాయి. కాగా.. ఎంఎఫ్‌లు విదేశీ సెక్యూరిటీల(షేర్లు)లో 7 బిలియన్ డాలర్లవరకూ ఇన్వెస్ట్ చేసేందుకు సెబీ అనుమతిస్తుంది. అయితే 2022 జనవరిలోనే గరిష్ట పరిమితికి చేరడంతో విదేశీ సెక్యూరిటీలలో ఎంఎఫ్ పెట్టుబడులకు ఇప్పటికే సెబీ చెక్ పెట్టింది. ఈ బాటలో ప్రస్తుతం విదేశీ ఈటీఎఫ్‌లో పెట్టుబడులకు నో చెప్పింది. వెరసి ఇన్వెస్టర్ల నుంచి విదేశీ ఈటీఎఫ్‌ల కోసం పెట్టుబడులను అనుమతించవద్దంటూ ఎంఎఫ్‌లను ఆదేశించింది. దేశీయంగా 77 ఎంఎఫ్ పథకాలు విదేశీ సెక్యూరిటీలలో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కాగా.. విదేశీ మార్కెట్లు దిద్దుబాటుకు లోనుకావడంతో ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) విలువ క్షీణించే అవకాశముంది. దీంతో ఆమేర పెట్టుబడులకు సెబీ 2023లో అనుమతించింది.

సాక్షి స్పోర్ట్స్

కెప్టెన్సీ నుంచి తప్పుకున్న ధోని ఆటగాడిగా మరో టైటిల్ విజయంలో భాగం అవుతాడా? ఇంకా తొలి ట్రోఫీ కోసమే ఎదురు చూస్తున్న కోహ్లికి ఈ సారైనా దానిని అందుకునే అదృష్టం ఉందా? సారథ్యం కోల్పోయిన రోహిత్ శర్మ తన బ్యాటింగ్ సత్తాతో ముంబైకి మరో విజయం అందిస్తాడా? చావుకు దగ్గరగా వెళ్లి వచ్చి మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టిన పంత్ కొత్త ఇన్నింగ్స్‌లో ఆటగాడిగా, నాయకుడిగా జట్టును నడిపించగలడా? ముంబై అభిమానుల ఆశలకు విరుద్ధంగా కెప్టెన్సీ అందుకున్న హార్దిక్ పాండ్యా తన ఆటతో, వ్యూహాలతో వారి మనసు గెలవగలడా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలన్నీ రాబోయే రెండు నెలల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో లభిస్తాయి. క్రికెట్ అభిమానులను ఫోర్లు, సిక్సర్లతో అలరిస్తూ పూర్తి స్థాయి వినోదాన్ని అందించే వేసవి పండగకు సమయం వచ్చేసింది. చెన్నై వేదికగా నేడు ఐపీఎల్ 17వ సీజన్ మొదలు కానుంది. గత ఏడాదిలాగే 10 జట్లు 74 మ్యాచ్‌లతో టోర్నీ సిద్ధం కాగా... ఎన్నికల కారణంగా తొలి దశలో 21 మ్యాచ్‌లకే బీసీసీఐ షెడ్యూల్ ప్రకటించింది. గత కొద్ది రోజులుగా భారత టెస్టు క్రికెట్‌ను ఆస్వాదించిన ఫ్యాన్స్ రాబోయే దాదాపు ఎనిమిది వారాల పాటు బౌండరీల గురించే చర్చించడం ఖాయం.

అటు ఫోర్... ఇటు సిక్సర్!

నేటి నుంచి ఐపీఎల్ టోర్నీ

- మొదటి పోరులో చెన్నైతో బెంగళూరు 'ఢీ'
- తొలి రోజు గంట పాటు ప్రారంభోత్సవ వేడుకలు

రాత్రి 8 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



ఐపీఎల్ ట్రోఫీతో కేఎల్ రాహుల్ (లక్నో), కమిన్స్ (హైదరాబాద్), జితేశ్ శర్మ (పంజాబ్-వైస్ కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (చెన్నై), రిషభ్ పంత్ (ఢిల్లీ), డు ప్లెసిస్ (బెంగళూరు), శుబ్‌మన్ గిల్ (గుజరాత్), సంజూ సామ్సన్ (రాజస్తాన్), శ్రేయస్ అయ్యర్ (కోల్‌కతా), హార్దిక్ పాండ్యా (ముంబై ఇండియన్స్)

చెన్నై: మెగా టి20 టోర్నీ ఐపీఎల్–2024కు రంగం సిద్ధమైంది. ఎంఎ చిదంబరం స్టేడియంలో నేడు జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తలపడుతుంది. గత రెండు సీజన్ల తరహాలోనే ప్రతీ జట్టు 14 మ్యాచ్‌ల చొప్పున ఆడుతుంది. లీగ్ దశలో 70 మ్యాచ్‌లు, 4 ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు (క్వాలిఫయర్–1, ఎలిమినేటర్, క్వాలిఫయర్–2, ఫైనల్) ఉంటాయి. తుది షెడ్యూల్ ప్రకటించకపోయినా... మే 26న ఫైనల్ జరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు జరిగిన 16 సీజన్లలో చెన్నై, ముంబై ఐదేసిసార్లు విజేతగా నిలవగా కోల్‌కతా 2 సార్లు టైటిల్ సాధించింది. దక్కన్ చార్జర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్తాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల ఖాతాలో ఒక్కో ట్రోఫీ చేరాయి. చెపాక్ మైదానంలో మొదటి మ్యాచ్‌కు ముందు ప్రత్యేక ఆరంభోత్సవ వేడుకలు జరుగుతాయి. ఎఆర్ రెహమాన్, సోనూ నిగమ్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. 17వ ఐపీఎల్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఏడాది టోర్నీకి సంబంధించిన విశేషాలు...

- తాజా సీజన్‌లో పలు జట్లకు కొత్త కెప్టెన్లు వచ్చారు. ముంబైకి రోహిత్ స్థానంలో పాండ్యా, హైదరాబాద్‌కు మార్క్‌రమ్ స్థానంలో కమిన్స్, చెన్నైకి ధోని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్, గుజరాత్‌కు పాండ్యా స్థానంలో శుబ్‌మన్ గిల్ బాధ్యతలు చేపడుతున్నారు. గాయం నుంచి కోలుకొని వచ్చిన రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ మళ్లీ ఢిల్లీ, కోల్‌కతా జట్ల పగ్గాలు చేపట్టారు. మిగతా నలుగురు కేఎల్ రాహుల్ (లక్నో), సంజూ సామ్సన్ (రాజస్తాన్), డుప్లెసిస్ (బెంగళూరు), శిఖర్ ధావన్ (పంజాబ్)లు గత సీజన్‌లాగే ఈసారి సారథులుగా కొనసాగనున్నారు.
- ఎనిమిది జట్ల 'హోం' వేదికల్లో ఎలాంటి మార్పు లేకపోగా... ఢిల్లీ తమ తొలి రెండు మ్యాచ్‌లను విశాఖపట్నంలో ఆడుతుంది. పంజాబ్ కింగ్స్ ఈసారి మొహాలిలో కాకుండా కొత్తగా ముల్లన్‌పూర్‌లో కట్టిన స్టేడియాన్ని తమ హోం గ్రౌండ్‌గా మార్చుకుంది.
- ఈ సీజన్‌లో కొత్తగా రెండు నిబంధనలు వచ్చాయి. ఒక ఓవర్లో రెండు బౌన్సర్లను అనుమతిస్తారు. చెలరేగిపోతున్న బ్యాటర్లను కొంత వరకు నిలువరించేందుకు పేస్ బౌలర్లకు ఇది ఒక అదనపు బలంగా పనికొస్తుంది. 'స్మార్ట్ రీప్లే' సిస్టంను కూడా తొలిసారి అమలు చేస్తున్నారు. దీని ద్వారా అంపైర్ రివ్యూ ఫలితాలను మరింత వేగంగా, కచ్చితంగా అందించే అవకాశం ఉంటుంది. టీవీ అంపైర్, హాక్ ఐ ఆపరేటర్ కలిసి ఒకే చోట కూర్చునే ఏర్పాటు చేయడం వల్ల ఇది సాధ్యమవుతుంది. గత సీజన్‌లో అమల్లోకి వచ్చిన 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధన ఈసారి కూడా కొనసాగుతుంది.
- ఐపీఎల్ తర్వాత వెంటనే టి20 ప్రపంచకప్ ఉండటంతో భారత జట్టులో చోటు సంపాదించుకునేందుకు పలువురు యువ ఆటగాళ్లకు ఈ టోర్నీ అవకాశం కల్పిస్తోంది.
- ఐపీఎల్ వేలంలో ఆసీస్ స్టార్ బౌలర్లు మిచెల్ స్టార్క్ రూ. 24 కోట్ల 75 లక్షలకు, ప్యాట్ కమిన్స్ రూ.20 కోట్ల 50 లక్షలకు అమ్ముడుపోయారు. ఈ నేపథ్యంలో తమ జట్లు కోల్‌కతా, హైదరాబాద్‌లను గెలిపించే విషయంలో వీరిద్దరిపై తీవ్ర ఒత్తిడి ఉండటం ఖాయం.
- గాయం కారణంగా లేదా వేలంలో అమ్ముడుపోకపోవడం వల్ల తాజా సీజన్‌కు దూరమైన కొందరు కీలక ఆటగాళ్లలో షమీ, మార్క్ వుడ్, ప్రసిధ్ కృష్ణ, జేసన్ రాయ్, హ్యారీ బ్రూక్, డెవాన్ కాన్వే, ఎన్‌గిడి, మదుషంక, స్టీవ్ స్మిత్, హాజల్‌వుడ్, బెన్ స్టోక్స్, జో రూట్, ఆడమ్ జంపా తదితరులు ఉన్నారు.



గురువారం ప్రాక్టీస్ సెషన్‌లో ధోని, రుతురాజ్

కెప్టెన్సీకి ధోని గుడ్‌బై సీఎస్‌కే కొత్త సారథిగా రుతురాజ్

చెన్నై: 'కొత్త సీజన్‌లో కొత్త 'పాత్ర' పోషించేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'... మార్చి 4న సోషల్ మీడియాలో ధోని పెట్టిన పోస్ట్ ఇది! ఆ కొత్త పాత్ర ఏమిటనేది ఎవరూ ఊహించలేకపోయారు. కానీ మార్చి 21కి వచ్చేసరికే అదేంటో ధోని చూపించాడు. తాజా ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ సారథ్య బాధ్యతల నుంచి ధోని తప్పుకున్నాడు. కెప్టెన్‌గా కాకుండా కేవలం ఆటగాడిగా అతను ఈ సీజన్ బరిలోకి దిగనున్నాడు. ధోని స్థానంలో జట్టు ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసినట్లు సీఎస్‌కే యాజమాన్యం ప్రకటించింది. 42 ఏళ్ల ధోని 2008లో ఐపీఎల్ తొలి ఏడాది నుంచి చెన్నై కెప్టెన్‌గా వ్యవహరించాడు. మధ్యలో రెండేళ్లు జట్టు నిషేధానికి గురి కాగా... 2022 సీజన్‌లో రవీంద్ర జడేజా కెప్టెన్ అయ్యాడు. అయితే 8 మ్యాచ్‌ల తర్వాత తనవల్ల కాదంటూ జడేజా తప్పుకోవడంతో సీజన్ మధ్యలో మళ్లీ ధోని పగ్గాలు చేపట్టాడు. ఐపీఎల్‌లో అతను మొత్తం 212 మ్యాచ్‌లలో కెప్టెన్‌గా వ్యవహరించగా... 128 మ్యాచ్‌ల్లో గెలిచి, 82 మ్యాచ్‌ల్లో ఓడిన చెన్నై 5సార్లు చాంపియన్ కావడంతో పాటు మరో 5సార్లు రన్నరప్‌గా నిలిచింది. మరో 23 చాంపియన్స్ లీగ్ మ్యాచ్‌ల్లో కెప్టెన్సీ చేసిన అతను 2 టైటిల్స్ అందించాడు. 2023లో టైటిల్ గెలిచాక అదే ధోని ఆఖరి సీజన్ అనిపించింది. కెప్టెన్సీ కాకుండా ఆటగాడిగా అతని ప్రభావం దాదాపు శూన్యంగా మారింది. కానీ మోకాలి ఆపరేషన్ తర్వాత అతను మరోసారి బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు.

అనుభవం లేకపోయినా...

మహారాష్ట్రకు చెందిన రుతురాజ్‌కు పెద్దగా కెప్టెన్సీ అనుభవం లేదు. సీనియర్ స్థాయిలో కేవలం 16 టి20 మ్యాచుల్లోనే అతను కెప్టెన్‌గా వ్యవహరించి 10 విజయాలు సాధించాడు. ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టుకు అతనే కెప్టెన్. అయితే ఓపెనర్ రూపంలో భారీగా పరుగులు సాధిస్తూ జట్టు విజయాల్లో అతను కీలకంగా మారాడు. 2020 సీజన్ నుంచి చెన్నై జట్టుతో ఉన్న రుతురాజ్ 52 మ్యాచ్‌లలో 135.52 స్ట్రయిక్‌రేట్‌తో 1797 పరుగులు సాధించాడు. రుతురాజ్ భారత్ తరఫున 6 వన్డేలు, 19 టి20లు ఆడాడు. 2022లో జడేజాను అనూహ్యంగా కెప్టెన్ చేయడంతో సమస్య వచ్చిందని, కానీ ఈసారి మార్పుకు తాము ముందే సిద్ధమయ్యామని సీఎస్‌కే మేనేజ్‌మెంట్ ప్రకటించింది.

ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
మార్చి 22	చెన్నై x బెంగళూరు	చెన్నై
మార్చి 23	పంజాబ్ x ఢిల్లీ	చండీగఢ్
మార్చి 23	కోల్‌కతా x హైదరాబాద్	కోల్‌కతా
మార్చి 24	రాజస్తాన్ x లక్నో	జైపూర్
మార్చి 24	గుజరాత్ x ముంబై	అహ్మదాబాద్
మార్చి 25	బెంగళూరు x పంజాబ్	బెంగళూరు
మార్చి 26	చెన్నై x గుజరాత్	చెన్నై
మార్చి 27	హైదరాబాద్ x ముంబై	హైదరాబాద్
మార్చి 28	రాజస్తాన్ x ఢిల్లీ	జైపూర్
మార్చి 29	బెంగళూరు x కోల్‌కతా	బెంగళూరు
మార్చి 30	లక్నో x పంజాబ్	లక్నో
మార్చి 31	గుజరాత్ x హైదరాబాద్	అహ్మదాబాద్
మార్చి 31	ఢిల్లీ x చెన్నై	వైజాగ్
ఏప్రిల్ 1	ముంబై x రాజస్తాన్	ముంబై
ఏప్రిల్ 2	బెంగళూరు x లక్నో	బెంగళూరు
ఏప్రిల్ 3	ఢిల్లీ x కోల్‌కతా	వైజాగ్
ఏప్రిల్ 4	గుజరాత్ x పంజాబ్	అహ్మదాబాద్
ఏప్రిల్ 5	హైదరాబాద్ x చెన్నై	హైదరాబాద్
ఏప్రిల్ 6	రాజస్తాన్ x బెంగళూరు	జైపూర్
ఏప్రిల్ 7	ముంబై x ఢిల్లీ	ముంబై
ఏప్రిల్ 7	లక్నో x గుజరాత్	లక్నో

నోట్: తొలి మ్యాచ్ ఒక్కటే రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుండగా... మిగతా రాత్రి మ్యాచ్‌లన్నీ గం.7:30 నుంచి.. మధ్యాహ్నం మ్యాచ్‌లన్నీ గం. 3:30 నుంచి జరుగుతాయి.

పతాకధారిగా శరత్ కమల్



న్యూఢిల్లీ: ఈ ఏడాది జూలై–ఆగస్టులలో జరిగే పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో భారత క్రీడాకారుల బృందానికి భారత టేబుల్ టెన్నిస్ దిగ్గజం ఆచంట శరత్ కమల్ పతాకధారిగా వ్యవహరిస్తాడు. తమిళనాడుకు చెందిన 41 ఏళ్ల శరత్ ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడనున్నాడు. మహిళల బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ భారత జట్టుకు 'చెఫ్ డి మిషన్'గా వ్యవహరిస్తుందని భారత ఒలింపిక్ సంఘం ప్రకటించింది.

క్వార్టర్స్‌లో గాయత్రి-ట్రెసా జోడీ

బాసెల్: స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా ద్వయం 21–10, 21–12తో భారత్‌కే చెందిన ప్రియ–శ్రుతి మిశ్రా జంటను ఓడించింది. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) జోడీ 17–21, 16–21తో రుయ్ హిరోకామి–యునా కాటో (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది.

నల్లా ఇరుక్కు!



మీ ఇంట్లో నల్లాల ద్వారా నీరొస్తోందా.. దాన్ని నేరుగా తాగుతున్నారా? లేదా ఏదైనా ఫిల్టర్‌లో వేసి తాగుతున్నారా? అత్యధిక శాతం ప్రజలు ఫిల్టర్‌లనే వాడుతుంటారు. ఎందుకంటే.. మంచి నీళ్లని చెబుతున్నా.. అవన్నీ మంచిగా ఉన్నవేనా అన్న డౌటు. ఫిల్టరైజేషన్ చేయకుంటే.. రోగాల బారినపడతామన్న భయం. అయితే.. కొన్ని దేశాల్లో నల్లా నీటిని నేరుగా తాగేయొచ్చు. ఎందుకంటే.. తాగునీటి సరఫరా విషయంలో ఇవి కఠిన నిబంధనలు పాటిస్తున్నాయి. సురక్షితమైన నీటిని నల్లాల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నాయి. అందుకే ఈ కింది దేశాల్లోని నీరు 'నల్లా ఇరుక్కు'అన్నమాట!! చాలా సినిమాల్లో ఈ మాట విన్నట్లు అనిపిస్తోంది కదూ.. ఈ తమిళ పదానికి అర్థం ఇది బాగుంది లేదా మంచిది అని. మార్చి 22న **'అంతర్జాతీయ నీటి దినోత్సవం'** నేపథ్యంలో.. ఈ 'నల్లా ఇరుక్కు' దేశాల టాప్–10 వివరాలివీ..

1 ఫిన్లాండ్
ప్రకృతి సహజ వనరులకు పెట్టింది పేరైన ఫిన్లాండ్‌లో అత్యాధునిక వ్యవస్థలతో విస్తృతంగా నీటి శుద్ధి చేపడతారు. ఇక్కడ నల్లాల ద్వారా సరఫరా చేసే మంచి నీరు ప్రపంచంలోనే సురక్షితమైనదిగా పేరుపొందింది.

2 ఐస్‌ల్యాండ్
ఈ దేశంలో హిమానీ నదాలు (గ్లేసియర్లు), వేడి నీటి ఊటల నుంచి వచ్చే నీరు సాధారణంగానే సురక్షితమైనది. ఆ నీటినే మరికాస్త శుద్ధిచేసి ఇళ్లకు సరఫరా చేస్తారు.

3 స్విట్జర్లాండ్
కలుషితాల విషయంలో కఠిన నిబంధనలు, శుద్ధి చేసేందుకు అనుసరించే విధానాలతో ఈ దేశంలో నల్లా నీళ్లు సురక్షితమైనవిగా గుర్తింపు పొందాయి.

4 ఆస్ట్రియా
ఇక్కడి పర్వత ప్రాంతాలు, వాటికి అనుబంధంగా ఉన్న మంచి నీటి వనరులకు తోడు.. నీటి సంరక్షణ చర్యలు, కఠిన నిబంధనలతో నాణ్యమైన నీటిని ఇళ్లకు సరఫరా చేస్తున్నారు.

5 నార్వే
హిమానీనదాలు, ఇతర మంచి నీటి వనరులు అందుబాటులో ఉండటం, నీటి శుద్ధికి అత్యంత ఆధునిక విధానాలు అవలంబించడంతో.. సురక్షిత నీరు సరఫరా చేసే దేశాల్లో నార్వే ఒకటిగా నిలిచింది.

6 నెదర్లాండ్స్
మంచినీటి వనరులు మరీ ఎక్కువగా లేని దేశమే అయినా.. నీటి శుద్ధి, నల్లాల ద్వారా పరిశుభ్రమైన నీటి సరఫరా విషయంలో ముందు నుంచీ మంచి ప్రమాణాలు పాటిస్తోంది.

7 మాల్టా
ఇది చుట్టూ ఉప్పునీరే కమ్ముకుని ఉన్న చిన్న ద్వీప దేశమే అయినా.. సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే (డీసాలినేషన్ ప్రక్రియ) ద్వారా సురక్షిత నీటిని ఇళ్లకు సరఫరా చేస్తోంది.

8 ఐర్లాండ్
ఇక్కడ మంచినీటి వనరులు పుష్కలంగా ఉండటంతో పాటు జలాల సంరక్షణ, శుద్ధి విషయంలో కఠిన నిబంధనలతో నాణ్యమైన నీటి సరఫరాలో టాప్–10 దేశాల్లో నిలిచింది.

9 గ్రీస్
ఈ దేశంలోని పర్వతాలు, కొండల నుంచి వచ్చే నీటి ఊటలు, నీటి నాణ్యత విషయంలో పకడ్బందీ చర్యలతో ఇళ్లకు సురక్షిత నీరు అందుతున్నాయి

10 యునైటెడ్ కింగ్‌డమ్
కలుషితాల విషయంలో కఠిన నిబంధనలు పాటించడం, నీటి శుద్ధికి అత్యున్నత విధానాలను అవలంబించడంతో ప్రమాణాలతో కూడిన నీటిని ఈ దేశంలో సరఫరా చేస్తున్నారు.

సాక్షి సెంట్రల్ డెస్క్

ఇంటిపన్ను వసూలుకు చావు డప్పు



గోవిందరావుపేట: గ్రామాల్లో ఇంటిపన్ను బకాయిల వసూలుకు పంచాయతీ అధికారులు చావు డప్పు మోగిస్తున్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో గురువారం మొండి బకాయిలున్న ఇళ్ల వద్ద చావుడప్పు మోగించారు. దీంతో యజమానులు పరువు పోతుందని భయంతో అప్పో సప్పో చేసి ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. దీనిపై గ్రామ కార్యదర్శి శరత్ బాబును వివరణ కోరగా.. ఒక్క పస్రా గ్రామం నుంచే రూ.30 లక్షల వరకు బకాయిలు రావాలని, అందుకే ఇలా వసూలు చేస్తున్నామని తెలిపారు.

వరంగల్‌కు చెందిన నిఖిలేశ్ కొన్నేళ్లుగా బెంగళూరులోని ఓ బహుళజాతి ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవలే పెళ్లి కావడంతో భార్యతో సహా కేఆర్ పురంలో నెలకు రూ.20 వేల అద్దెతో ఓ గేటెడ్ కమ్యూనిటీలో కాపురం పెట్టాడు. అయితే ఈమధ్య కాలంలో బెంగళూరు ప్రధాన నగరంలో నీటి ఎద్దడి తీవ్రం కావడంతో యాజమాన్యం ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇచ్చింది. కానీ, అపార్ట్‌మెంట్‌లో నీటి వినియోగం, సరఫరాలో రెసిడెన్షియల్ సొసైటీ ఆంక్షలు విధించింది. దీంతో అటు ఆఫీసుకు వెళ్లలేక, ఇటు ఇంట్లో ఉండలేక ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న బ్రాంచ్ ఆఫీసు నుంచి పని చేయాలని సూచించింది. అతడు భార్యను పుట్టింట్లో వదిలిపెట్టి ప్రస్తుతం హైదరాబాద్ నుంచే పనిచేస్తున్నాడు.

ఐటీకి నీటి ట్రాన్స్‌ఫర్



- బెంగళూరులో తీవ్రమైన నీటి సంక్షోభం
- దీంతో హైదరాబాద్, పుణేకు ఉద్యోగులు షిఫ్ట్
- సొంతూళ్ల నుంచి పనిచేసే వీలు కూడా..
- వేతన పెంపు, ఇతరత్రా అలవెన్స్‌ల చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్

.. ఇదీ బెంగళూరులోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఉద్యోగికి జరిగిన నీళ్ల బదిలీ. సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరొందిన బెంగళూరు గతంలో ఎన్నడూ లేనివిధంగా నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్ వంటి ప్రముఖ ఐటీ కంపెనీలకు కేంద్రమైన వైట్‌ఫీల్డ్, వర్తూర్ వంటి ఐటీ హబ్‌లలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో ఐటీ సంస్థలు, ఉద్యోగుల కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. ఐటీ హబ్‌లు, ఉద్యోగుల నీటి కష్టాలు వీడియో పలు సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్ కావడం గమనార్హం.

దేశీయ ఐటీ పరిశ్రమ అమెరికా, యూకే, యూరప్, ఆస్ట్రేలియా వంటి పలు దేశాల మీద ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. దీంతో రాజకీయ అస్థిరత, స్థానిక సమస్యలతో సంబంధం లేకుండా గడువులోగా ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడం సాఫ్ట్‌వేర్ కంపెనీలకు తప్పనిసరి. ఈ నేపథ్యంలో బెంగళూరు ఐటీ పరిశ్రమ నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది.

హైదరాబాద్, పుణేలకు బదిలీ

తాత్కాలికంగా కొద్దికాలం పాటు ఉద్యోగులను సొంతూళ్ల నుంచి పని చేసే వీలు కల్పించడం, హైదరాబాద్, పుణే వంటి ఇతర నగరాల్లోని బ్రాంచ్ ఆఫీసులకు బదిలీ చేయడం వంటివి చేస్తున్నాయి. విధి నిర్వహణలో ఎదురయ్యే సందేహాలు, టాస్క్‌లను నివృత్తి చేసేందుకు సాంకేతిక నిపుణులను జూమ్ వంటి ఆన్‌లైన్ మాధ్యమాల్లో అందుబాటులో ఉంచుతున్నాయి. అలాగే ఉద్యోగుల పనితీరుపై ఒత్తిడి ప్రభావం పడకుండా వారాంతాల్లో వర్చువల్‌గా శిక్షణ, మీటింగ్‌లను సైతం నిర్వహిస్తున్నాయి.

ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇచ్చినా బెంగళూరు నుంచే పని చేస్తారని, దీంతో అపార్ట్‌మెంట్లలో నీటి సమస్య మరింత తీవ్రమవుతుందని భావించిన పలు ఐటీ కంపెనీలు ఉద్యోగులను వర్క్ ఫ్రం హోం బదులుగా వర్క్ ఫ్రం హోంటౌన్ (సొంతూర్ల నుంచి పని) చేయాలని సూచిస్తున్నాయి.

వేతన పెంపు, అలవెన్స్‌లు కూడా..

అయితే ఉద్యోగులు ఇతర పట్టణాలు/మెట్రో సిటీల నుంచి పని చేయాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. కుటుంబంతో సహా వేరేచోటుకు మారడం, ప్రయాణ ఖర్చులతోపాటు అప్పటికే బెంగళూరులో ఉండే ఇంటికి అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఉద్యోగులకు భారం కావడంతో పలు కంపెనీలు తాత్కాలిక వేతన పెంపు, అలవెన్స్‌లు వంటివి ఇస్తున్నాయి. బెంగళూరులో నీటి సమస్య తీరిన తర్వాత తిరిగి ఆఫీసుకు రావాలని చెబుతున్నాయి.

రోజుకు 500 మిలియన్ లీటర్ల నీటి కొరత

ప్రస్తుతం కర్ణాటకలో సుమారు 8,785 ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల్లో 18 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వేగవంతమైన పట్టణీకరణ, జనాభా పెరుగుదల, అస్తవ్యస్తమైన పట్టణ ప్రణాళిక, లోటు వర్షపాతం, తలసరి నీటి వినియోగం పెరుగుదల వంటి కారణాలతో బెంగళూరులో నీటి సమస్య జటిలమైంది. నగరంలో రోజుకు తాగునీరు, పరిశ్రమ అవసరాలకు 2,600 ఎంఎల్‌డీ (రోజుకు మిలియన్ లీటర్లు) నీరు అవసరం ఉండగా.. ఇందులో 1,450 ఎంఎల్‌డీలు కావేరి నది నుంచి, 650 ఎంఎల్‌డీలు బోరు బావుల నుంచి సమకూరుతుండగా, 500 ఎంఎల్‌డీల నీటి కొరత ఉందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలు, పెద్ద నివాస సముదాయాలతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అగ్నిమాపక కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్లు కూడా నీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి.



ఐటీ ఆఫీసులపై ప్రభావం

బెంగళూరులో నీటి సమస్య ఐటీ కార్యాలయాల మీద కూడా ఎక్కువ ప్రభావం చూపిస్తోంది. మహాదేవపుర, కెంగేరి, వైట్ ఫీల్డ్, సర్జాపూర్ రోడ్, కోర మంగళ వంటి ప్రాంతాల్లోని ఐటీ సంస్థలు, ఉద్యోగులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో పలు సంస్థలు రిమోట్ వర్కింగ్, హైబ్రిడ్ మోడల్ పని విధానంతోపాటు ఇతర నగరాల్లోని బ్రాంచీల నుంచి పని చేయాలని ఉద్యోగులకు సూచిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఇలా పని చేస్తున్నారు.

-సందీప్ కుమార్ మక్తల, ప్రెసిడెంట్, తెలంగాణ ఐటీ అసోసియేషన్

25న రామయ్య పెళ్లి పనులకు శ్రీకారం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ ఘడియలు సమీపిస్తున్నాయి. ఏప్రిల్ 17న శ్రీరామనవమి, 18న పట్టాభిషేక మహోత్సవం జరగనున్నా యి. ఈ నెల 25న పెళ్లి పనులకు శ్రీకారం చుట్టనున్నా రు. ఉత్తర ద్వారం వద్ద సంప్రదాయపద్ధతిలో ప్రత్యేక పూజలు చేసి, పసుపు కొమ్ములను దంచుతారు. తలంబ్రాలు కలిపే క్రతువును ప్రారంభిస్తారు. అదే రోజు హోలీ కావడంతో వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించనున్నారు.

సుమారు200 క్వింటాళ్ల తలంబ్రాలు..

భక్తులు పవిత్రంగా భావించే స్వామి వారి తలంబ్రాలను గత ఏడాది 180 క్వింటాళ్లు తయారుచేశా రు. ఈ ఏడాది 200 క్వింటాళ్ల మేర కలిపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటిని నవమి రోజున ప్రత్యేక కౌంటర్ల ద్వారా భక్తులకు ఉచితంగా పంపిణీ చేయడ మే కాక ముత్యాలతో కూడిన తలంబ్రాలను విక్రయిస్తారు. శ్రీరామనవమి పనులకు టెండర్లు పూర్తి కాగా, వాటిని ప్రారంభించాల్సి ఉంది. ఈ అంశంపై భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక ఆల కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కాగా ఏటా ఉగాది రోజున ముఖ్యమంత్రి, గవర్నర్‌కు శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవ ఆహ్వాన పత్రికలను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆహ్వాన పత్రిక అందజేసినా సీఎం వస్తారా లేక ఉన్నతాధికారులు హాజరవుతారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా, ఏప్రిల్ 9 నుంచి 23వ తేదీ వరకు దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.



పసుపుకొమ్ములు దంచుతున్న మహిళలు (ఫైల్)



క్యూఆర్ కోడ్‌తో రైల్ టికెట్ బుకింగ్

- అందుబాటులోకి తెచ్చిన దక్షిణ మధ్య రైల్వే
- తొలిదశలో సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 14 స్టేషన్లలో అమలు

సాక్షి, హైదరాబాద్: సాధారణ రైల్వే టికెట్‌లను క్యూఆర్ కోడ్ ద్వారా బుక్ చేసుకొనే సదుపాయాన్ని దక్షిణ మధ్య రైల్వే అందుబాటులోకి తెచ్చింది. తొలిదశలో సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని 14 స్టేషన్లలో ఉన్న 31 కౌంటర్లలో ఈ సౌకర్యాన్ని ప్రవేశపెట్టారు. జనరల్ బుకింగ్ కౌంటర్లలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఈ సౌకర్యాన్ని ప్రవేశపెట్టినట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. టికెట్ కొనుగోలు చేసే సమయంలో జనరల్ బుకింగ్ కౌంటర్ల టికెట్ విండో వద్ద ప్రయాణికులు బుక్ చేసుకునే టికెట్ వివరాలు, చార్జీలను అందుబాటులో ఉంచుతారు. అందుకనుగుణంగా చార్జీలు చెల్లించి క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ తీసుకోవచ్చు. ఈ డిస్‌ప్లే బోర్డులో రైలు బయల్దేరే స్టేషన్, చేరుకొనే స్టేషన్, ప్రయాణపు తరగతి, పెద్దలు, పిల్లల సంఖ్య, చార్జీలు వంటి వివరాలను ప్రదర్శిస్తారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని సికింద్రాబాద్, నాంపల్లి, లింగంపల్లి, హైటెక్ సిటీ, బేగంపేట్, కాజీపేట, జేమ్స్‌స్ట్రీట్, ఫతేనగర్ బ్రిడ్జ్, వరంగల్, మంచిర్యాల, మహబూబాబాద్, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, వికారాబాద్ స్టేషన్లలోని 31 కౌంటర్ల ద్వారా నగదు రహిత లావాదేవీల సదుపాయాన్ని ప్రయాణికులు పొందవచ్చు.

మద్యం లూటీ.. 29 మందిపై కేసు

టేకులపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో మద్యం దుకాణాలపై బుధవారం కొందరు దాడి చేసి మద్యం లూటీ చేయడంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తాటిపాముల సురేశ్ తెలిపారు. పల్లవి, గణేశ్, క్రాంతి మద్యం దుకాణాల వద్ద సీసీ ఫుటేజీలు పరిశీలించామని తెలిపారు. మూడు దుకాణాల నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29 మందిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కాగా, మూడు దుకాణాల్లో లూటీ అయిన మద్యం విలువ రూ.15,94,590గా గుర్తించామని చెప్పారు. కాగా, రూ.లక్ష విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.